www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 55 | సోమవారం | 14 ఆగస్టు, 2017
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- హిజ్బుల్ కమాండర్ సహా ముగ్గురు ఉగ్రవాదులు హతం
- ఇద్దరు జవాన్లు మృతి

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్ షోపియాన్ జిల్లాలో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య శనివారం అర్ధరాత్రి భీకర కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థకు చెందిన స్వీయ ప్రకటిత ప్రధాన కార్యకలాపాల కమాండర్ యాసిన్ ఇటూ అలియాస్ గజ్‌నావీ సహా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. అదే సమయంలో ఇద్దరు భారత జవాన్లు మరణించగా, మరో తరువాయి 6లో





ఆదివాసీల తీజ్ తేజం

ప్రత్యేక కథనం - 3లో

హిమాచల్‌లో విరిగిన కొండచరియలు



47 మంది బలి

10

పంటకు పన్నీరు


కురుస్తున్న వర్షాలతో మురుస్తున్న మెట్ట పైరులు

మన తెలంగాణ/ హైదరాబాద్: వేసిన పంటలు ఎండిపోతాయని ఆందోళన చెందుతున్న దశలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల ఆశలు మళ్లీ చిగురించాయి. ఈ వర్షాలు పత్తి, మొక్కజొన్న వంటి మెట్ట పంటలకు మళ్లీ ప్రాణం పోశాయని అన్నదాతలు ఆనందిస్తున్నారు. భారీ వర్షాలు పడకపోయినా సాధారణ జల్లులతో పత్తి, మొక్కజొన్న, కంది, జొన్న, సోయాబీన్ వంటి పంటలకు మరో వారం, పది రోజుల వరకు ఎటువంటి ఢోకా లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వానలు లేక నిరాశతో కుంగిన రైతులు ఇప్పుడు చినుకులు పడడంతో కలుపు కోసం గుంటుక కొడుతున్నారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా చిరుజల్లులు పడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు తొలకరితో పలకరించినట్లే పలకరించి, వెనక్కు తగ్గాయి. వర్షాభావంతో పంటలు వాడిపోయాయి. దాదాపు ఎండిపోయే దశకు చేరుకున్న పంటలకు ప్రస్తుతం కురుస్తున్న వానలు జీవం పోస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో సోయాబీన్ పంట అధికంగా సాగవుతోంది. ఇప్పటి వరకు 3.97 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. ఈ పంట వర్షాభావ పరిస్థితులను తట్టుకునేది అయినప్పటికీ వానలు లేక ఎదుగుదల అనుమానమే అన్న దశకు చేరుకుంది. ఇప్పుడు కురిసిన వర్షాలతో పంట ఎదుగుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే పత్తి పంట తరువాయి 6లో



కలవని కాల్స్

- అన్‌లిమిటెడ్ కష్టాలు



మన తెలంగాణ/ హైదరాబాద్ : రమేష్ హైదరాబాద్‌లో ఒక కార్పొరేట్ ఆఫీసులో పని చేస్తున్న ఓ ఉద్యోగి. ఆఫీసుకు టైం అవుతోందన్న హడావుడిలో అతను ఆఫీసు బీరువా తాళాలు తేవడం మరిచి పోయారు. ముఖ్యమైన ఫైళ్లు ఇంకేవేవో కాగితాలున్న ఆ బీరువా తప్పని సరిగా తెరవాల్సిందే. ఇంతకూ తాను బీరువా తాళాలు తెచ్చుకున్నానా? దారిలో ఎక్కడైనా పడిపోయాయా? అనే సందేహం కల్గింది. తన సందేహాన్ని నివృత్తి చేసుకునేందుకు ఇంటికి ఫోన్ చేశారు. పావుగంట, అరగంట.. గంట.. ఇలా ఎన్ని సార్లు ఫోన్ కలిపినా అవతలి వ్యక్తి తరువాయి 6లో

కాంగ్రెస్ మిషన్ - 2019

- నిర్బంధకాండ, అవినీతిపై పోరాడుతూ పార్టీ మరింత బలోపేతం
- సెప్టెంబర్ 30లోగా వివిధ స్థాయిల్లో కమిటీలు
- త్వరలో గడప గడపకు : టిపిసిసి కార్యవర్గ విస్తృత భేటీలో నిర్ణయం



మన తెలంగాణ / హైదరాబాద్ : "రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుంది, ఒక్క సభకు, సమావేశానికి అనుమతివ్వడం లేదు. దళితులపై, గిరిజనులపై వెనుకబడిన వర్గాలపై దాడులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. అవినీతి పెచ్చి పెరిగిపోయింది. నిర్బంధాన్ని ఎదిరించి పోరాడాలి. అవినీతిపైనా పోరాటం చేయాలి, మరోవైపు పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలి. ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడేలా మిషన్ – 2019 పేరుతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలి" అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) నిర్ణయించింది. గాంధీభవన్‌లో ఆదివారం టిపిసిసి అధ్యక్షులు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన టిపిసిసి కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ డాక్టర్ రాంచంద్ర కుంతియా, ఇన్‌చార్జ్ సతీష్ జార్కోలిలతో పాటు సిఎల్‌పి నాయకులు కె. జానారెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క, శాసనమండలిలో విపక్ష నేత మహ్మద్ షబ్బీర్ అలీ, మాజీ పిసిసి అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, ఎంపి రేణుక చౌదరి, ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం తరువాయి 6లో

ఏడాది చివరికి మిడ్ మానేరులోకి

ఎల్లంపల్లి నీరు

అధికారులకు హరీశ్ రావు ఆదేశం



మన తెలంగాణ/ హైదరాబాద్: ఎల్లంపల్లి, మిడ్ మానేరు పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ డిసెంబరు మాసాంతానికి పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించారు. 2018 కొత్త సంవత్సరంలో అడుగుపెట్టే నాటికి ఎల్లంపల్లి నీళ్లు మిడ్ మానేరు తరువాయి 6లో

సినిమా చాన్స్ ఆశ చూపి యువతిపై అశ్లీల ఫిల్మ్ చిత్రీకరణ

7

ఐటిఐఆర్ నిధులు విడుదల చేయాలి

- కేంద్రానికి కెటిఆర్ లేఖ 6

సభలు జరుపుకునే హక్కుపై ప్రభుత్వం దాడి



- జెఎసి చైర్మన్ కోదండరామ్ 3

కుంచెపోటు



పోలీసు భూచోళ్లు

సైబరాబాద్‌లో ఒక డిసిపి, సిఐ, ఎస్ఐ, కానిస్టేబుల్‌పై కేసులు



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: ఒక భూ వివాదంలో అక్రమంగా వ్యవహరించినందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు రాయదుర్గం అదనపు డిసిపి పులిందర్‌రెడ్డి, సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణలపై కేసు నమోదయింది. రాయదుర్గంలోని ఎన్‌సిసి అర్బన్ బిల్డింగ్‌కు చెందిన అదనపు డిసిపి పులిందర్‌రెడ్డి కుమార్తె ఐశ్వర్యరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. 4 నెలల క్రితం పటాన్‌చెరులోని ముత్తంగిలో ఉన్న రెండెకరాల స్థలం కోసం ఆమె అబుబకర్ గ్రూప్‌కు రూ.5 లక్షలు ఇచ్చి అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. మూడు నెలలవుతున్నా ఐశ్వర్యరెడ్డి మిగతా డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో అబుబకర్ గ్రూప్ ఆ భూమిని ఇతరులకు ఇటీవల విక్రయించింది. విషయం తెలుసుకున్న ఐశ్వర్యరెడ్డి తన తండ్రి పులిందర్‌రెడ్డి పలుకుబడితో అబుబకర్‌తో పాటు అతని గ్రూప్ సభ్యులపై నార్సింగ్ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేయించారు. ఈ కేసులో విచారించాల్సి ఉందని అబుబకర్, కైసర్‌లను రెండు రోజుల క్రితం రాయదుర్గం ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ తరువాత పులిందర్‌రెడ్డి, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ దుర్గప్రసాద్ వారి నుంచి ఐశ్వర్యరెడ్డికి ఇచ్చేది ఉన్నట్లుగా చెక్ బుక్‌లపై బలవంతంగా రూ.60 లక్షలకు సంతకాలు చేయించుకున్నారు. బాధితులు నేరుగా కమిషనర్ సందీప్ శాండిల్యకు ఫిర్యాదు చేశారు. ఆగ్రహం తరువాయి 6లో

కుంతియా విమర్శలు అర్ధరహితం : బూర నర్సయ్యగౌడ్

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ మూడేళ్ల పాలనలో కెసిఆర్ కుటుంబం మాత్రమే బాగు పడిందంటూ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రామచంద్ర కుంతియా చేసిన విమర్శలు అర్థంపర్థం లేనివని టిఆర్‌ఎస్ ఎంపి డా. బూర నర్సయ్యగౌడ్ అన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వంపై కుంతియా చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను తెలుసుకుని మాట్లాడితే హుందాగా ఉంటుందని, రాజకీయ విమర్శలు చేయడం సరికాదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటిని సరఫరా చేయనున్నామని, రాష్ట్రంలోని అన్ని కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని సిఎం కెసిఆర్ అనేక కార్యక్రమాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ, డబుల్ బెడ్‌రూమ్, చేనేత కార్మికులకు చేయూత తదితర కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. వచ్చే ఏడాది నుంచి రైతులకు రెండు సీజన్లలో రూ.8వేల చొప్పున వ్యవసాయ పెట్టుబడి ఇవ్వనున్నట్లు తెలిపారు. టిఆర్‌ఎస్ మూడేళ్ల పాలనపై కాంగ్రెస్ చార్జ్‌షీట్ వేయడం కాదని, తామే జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్‌సింగ్ వరకు 42 ఏండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన అన్యాయాలు, మోసాలను చార్జ్‌షీట్ వేస్తామన్నారు.



ఉమ్మడి తప్పులకు ఇప్పుడు లెంపలు

• ఓ ఐఎఎస్ నిర్వాకంతో తలనొప్పులు • సర్కార్‌పై రూ.1000 కోట్ల భారం



మన తెలంగాణ/హైదరాబాద్ : మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, నీటి పారుదల ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేస్తున్నది. కొత్త అప్పులు కావాలంటే తాము కోరిన విధంగా రూ.1043 కోట్ల మొండి బకాయిలు చెల్లించాల్సించాల్సిందేనని బ్యాంకులు పట్టుబట్టాయి. బ్యాంకుల మెలికతో రాష్ట్ర ప్రభుత్వం దిగి రాక తప్పలేదు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఒటిఎస్) కింద అప్పులు తీర్చేందుకు సిద్ధమై సగానికి పైగా చెల్లించాయి. ఈ మేరకు గతేడాది నాలుగు దఫాలు బ్యాంకర్లతో సమావేశమయ్యారు. మార్చి 9, 22, నవంబర్ 4, 5వ తేదీలలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, బ్యాంకర్లు సమావేశమయ్యారు. 2009 సంవత్సరం నుంచి చేసిన అప్పులకు వడ్డీతో పాటు మూల అప్పు చెల్లించడం లేదన్నారు. అప్పు రూ. 919.31 కోట్లు, వడ్డీ రూ.124 కోట్లు కలిపి మొత్తం రూ.1043 ఉందన్నారు. చర్చలు ఫలప్రదం కావడంతో గతేడాదే రాష్ట్ర ప్రభుత్వం రూ. 595 కోట్లు బ్యాంకులకు చెల్లించింది. మిగతా మొత్తాన్ని కూడా త్వరలో చెల్లిస్తామని చెప్పడంతో బ్యాంకులు ఊపిరిపీల్చు కున్నాయి. సగానికి పైగా అప్పులు వసూలు కావడంతో బ్యాంకులు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, నీటి పారుదల ప్రాజెక్టులకు విడతల వారీగా రుణాలు మం జూరు చేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఏర్పాటు అయింది. మధ్య తరగతి ప్రజల కోసం రాష్ట్రవ్యాప్తంగా గృహాలు నిర్మించేందుకు ఏర్పాటయిన సంస్థ తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయింది. కొనుగోలుదారుల అంచనాలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించలేక, బ్యాంకుల రుణాలు తీర్చలేక సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఒక ఐఎఎస్ అధికారి వ్యవహార శైలి, అప్పటి ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం కారణంగానే అప్పులు ఊబిలో కూరుకుపోయిందంటున్నారు. మధ్య తరగతి ప్రజలకు శాశ్వత గూడు కల్పించేందుకు ఎపి హౌసింగ్ బోర్డు లేఅవుట్లు అభివృద్ధి చేయడంతో పాటు ఇళ్లను నిర్మించి విక్రయించేది. బహిరంగ మార్కెట్ ధరకు తక్కువగా, మన్నికగా లభించడంతో పలువురు హౌసింగ్ బోర్డు స్థలాలు, ఇళ్లను కొనుగోలు చేసేవారు. ఈ సంస్థ ఆధీనంలో దిగువ మధ్య తరగతి ప్రజల కోసం ఇళ్లు నిర్మించేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించింది. ఒక ఐఎఎస్ అధికారి వైఖరి కారణంగా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేయక తప్పలేదు. కార్పొరేషన్ ప్రారంభం మొదలు ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రాజెక్టు కూడా విజయవంతం కాలేదు. నగరం చుట్టు పక్కల బండ్లగూడ, పోచారం, జవహర్ నగర్‌తో పాటు పలు జిల్లాలలో పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలను చేపట్టింది. దరఖాస్తుదారులు (ప్రజల) సమ్మతిని, డిమాండ్‌ను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టిన ఇళ్లు ఎందుకూ అక్కరకు రాకుండా పోయాయి. వేలాది ఇళ్లు దయ్యాల కొంపలుగా మారాయి. కాలనీల ప్రవేశ ద్వారం కోసం రూ.1 కోటి వరకు ఖర్చు చేశారంటే నిధులు ఎంతగా దుబారా చేశారో అర్థమవుతోంది. వాస్తు ప్రకారంగా లేకపోవడం, ధరలు అధికంగా ఉండడంతో బండ్లగూడలో ఇళ్లను కొనేందుకు ఇప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదు. నిర్మాణం పూర్తయి నాలుగు సంవత్సరాలు దాటుతోంది. కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో బ్యాంకుల అప్పులకు తోడుకావడంతో వడ్డీ భారం పెరిగింది. ఆరోపణలు రావడంతో ఉమ్మడి ప్రభుత్వ పెద్దలు బ్యాంకు అప్పులు, ఐఎఎస్ అధికారి పాత్రపై విచారణకు ఆదేశించారు. రాష్ట్రం విడిపోయే ముందు విజిలెన్స్ కమిషన్ నివేదిక కూడా అందచేసింది. నివేదిక ప్రకారం సదరు ఐఎఎస్ అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన తరుణంలో బ్యాంకులు మెలికపెట్టడడం ఆ అధికారికి కలిసి వచ్చిందనే చెప్పాలి. విజిలెన్స్ నివేదిక ప్రకారం సిఎం కెసిఆర్ ఆ అధికారిని సచివాలయంలో ప్రాధాన్యం లేని కుర్చీలో నియమించారు. కాని బ్యాంకు అప్పులు చెల్లించక తప్పలేదు.

బ్రిటీష్ చట్టాలతో అణచివేత విధానం

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు పూర్తవుతున్నా బ్రిటిష్ చట్టాలు, అణచివేత విధానాలు అమల వుతున్నాయని సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ (సిఎల్‌ఎంసి) ఆందోళన వ్యక్తం చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో సిఎల్‌ఎంసి ప్రధాన కార్యదర్శి లతీఫ్ మహ్మద్ ఖాన్, కన్వీనర్ సైదా సదఫ్, సభ్యులు ఏశాల శ్రీనివాస్ మాట్లాడారు. భారత ప్రజల హక్కులను హరించేందుకు, అణచివేసేందుకు నాటి బ్రిటీష్ పాలకులు ఏ చట్టాలనైతే ఉపయోగించుకున్నారో అవే చట్టాలు నేటి పాలకులు ఉపయోగించుకోవడం బాధాకరమన్నారు.

ఇలాంటి చర్యలు భారత ప్రజాస్వామ్యానికి నష్టం చేస్తాయన్నారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖండించాలని వారు డిమాండ్ చేశారు. నేరెళ్ల, గరకరపర్రు బాధితుల గురించి ముఖ్యమంత్రి కెసిఆర్ నోరు విప్పాలని, ఇసుక మాఫియాపై వివరణ ఇవ్వాలన్నారు. ప్రజాస్వామికవాదులు, మేధావులు అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఘర్ వాపసీ, గోరక్షణ దళాలు, బలవంతపు మతమార్పిడి, జాతి, జాతీయత, అసహనం, పవిత్రతల పేరిట ప్రజలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 2015లో అఖ్లాక్ హత్యతో మొదలై 64 మతోన్మాద దాడులు, హత్య లు జరిగాయని, అందులో నలుగురు దళితులు, 28 మంది ముస్లింలు చనిపోయారని అన్నారు. నమోదు కాని వీటికి రెట్టింపు ఉండొచ్చన్నారు. రాష్ట్రంలోనూ దళితులు, ముస్లింలపై దాడులతో పాటు లాకప్ మరణాలు పెరిగాయన్నారు. 2015లో పోలీసుల అధీనంలో ఉన్న ఐదుగురు ముస్లింలను ఎన్‌కౌంటర్ పేరుతో చంపారని, నాటి నుండి నేటి వరకు 25 లాకప్ మరణాలు జరిగాయన్నారు.

లౌకికత్వ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తెలంగాణ కోరుకున్నామన్నారు. హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా అందరూ ఒక్కటిగా పోరాడాలన్నారు. మతపరమైన దాడు ల నివారణకు ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో అభద్రత నెలకొని ఉందన్నారు. దేశం సంక్లిష్ట సమయంలో ఉందన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ ఉన్న భావన ప్రజల్లో పాదుకొల్పాలని వారు కోరారు.

లోతైన అధ్యయనం.. సూటిగా విమర్శలు : కుంతియా



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని టిఆర్‌ఎస్, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కంఠక పాలన, నిర్బంధం, అవినీతి అంశాలపై టిపిసిసి అధికార ప్రతినిధులు ఎప్పటికప్పుడు స్పం దించాలని, అంశాలను లోతుగా అధ్యయనం చేసి విమర్శలు సూటిగా చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రామచంద్ర కుంతియా అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియా కమిటీ చైర్మన్, పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి అధ్యక్షతన అధికార ప్రతి నిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కుంతియా మాట్లాడుతూ అధికార ప్రతినిధుల పాత్ర చాల కీలకమైందన్నారు. టిఆర్‌ఎస్ అవలంభిస్తున్న విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేసి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. వివిధ అంశాలపై చర్చ సందర్భంగా లోతైన అధ్యయనం చేయాలన్నారు. ఎఐసిసి పత్రికా సమావేశాలను అనుసరించాలన్నారు. ప్రతి క్షణం సమాచారం తెలుసుకోవాలని, అధికార ప్రతినిధులు ఎంత ఎక్కువగా కష్టపడితే పార్టీకి అంత లాభం జరుగుతుందన్నారు.



నవంబర్16న విద్యార్థి మహాగర్జన

మన తెలంగాణ/హైదరాబాద్: బిసి విద్యార్థుల డిమాండ్ల సాధనకు నవంబర్ 16న హైదరాబాద్‌లో విద్యార్థి మహాగర్జన నిర్వహించాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. కళాశాల నుంచి విశ్వవిద్యాలయల వరకు అలుపెరగని పోరాటం చేయాలని తీర్మానించింది. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో ఆదివారం బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిగా హాజరై ప్రసింగించారు. ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ విద్యా ర్థుల తరహాలోనే బిసి విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థలలో బడుగు, బలహీన వర్గాలకు 25 శాతం సీట్లను కేటాయించాలన్నారు. కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. బిసి జనాభా ధమాషా ప్రకారం మరో 500 బిసి గురుకులాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 30 నుంచి బిసి విద్యార్థి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలని, సెప్టెంబర్ 12 నుంచి విద్యార్థి సంఘం జిల్లా సదస్సులను, అక్టోబర్ 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి చైతన్య యాత్రాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి బిసి విద్యార్థ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా కార్య నిర్వాహఖ అధ్యక్షులు గండిచెర్వు వెంకన్న, బిసి సమా ఖ్య రాష్ట్ర అధ్యక్షులు దుర్గయ్యగౌడ్, యువజన సంఘం నాయకులు కనకల శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డుకు బెస్ట్ డిజిటల్ ఇన్షియేటివ్ అవార్డు



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ఇంటర్మీడియేట్ బోర్డుకు 'బెస్ట్ డిజిటల్ ఇన్షియేటివ్ ఇన్ గవర్నమెంట్' అవార్డు లభించింది. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో శ్రీలంక విద్యామంత్రి వి.ఎస్.రాధాకృష్ణన్ చేతుల మీదుగా ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్ ఈ అవార్డును అందుకున్నారు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నందుకు తమకు ఈ అవార్డు లభించిందని అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కోదండరామ్‌ది కాంగ్రెస్‌ను బతికించే యాత్ర : నాగేందర్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: అమరుల స్ఫూర్తి యాత్ర పేరుతో తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొ. ఎం.కోదండరామ్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ బతికించే ప్రయత్నం చేస్తున్నారని టిఆర్‌ఎస్ ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను ఆశిస్తే నదీజలాల వాటా, ఉద్యోగుల విభజన, హైకోర్టు విభజనపై ఢిల్లీ యాత్ర నిర్వహించాలని ఆయన కోదండరామ్‌కు సూచించారు. అమరవీరుల కుటుంబాలను పరామర్శించకుండా, అమరుల ఆశయాలకు తూట్లు పొడుస్తూ అమరుల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వంపై విషం చల్లే కార్యక్రమాలను మానుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో కోదండరామ్ కాస్త కోధర్నారామునిగా నిలిచిపోతారని తెలిపారు.



చైనాలో కొత్త తరం రైలు

బీజింగ్: అయస్కాంత లెవిటేషన్ విధానంతో నడిచే కొత్తతరం రైలును చైనా ప్రయోగాత్మకంగా నడిపింది. ఒకమోస్తరు నుంచి తక్కువ వేగంతో నడిచే ఈ రైలు.. ఏడాదిలోగా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మ్యాగ్‌లెవ్ రైలు ప్రాజెక్టు 8 ఏళ్ల కిందట మొదలైంది. కొత్త తరం అయస్కాంత సస్పెన్షన్ వ్యవస్థ సహా అనే అంశాల్లో తాము పట్టు సాధించినట్లు చైనా రైల్వే రోలింగ్ స్టాక్ కార్పొరేషన్ (సీఆర్‌ఆర్‌సీ) డాలియన్ తెలిపారు. షాంఘైలో జరిగిన తాజా పరీక్షలో ఈ రైలు గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. సంప్రదాయ రైలుతో పోలిస్తే ఇది ఒకింత నెమ్మదిగా నడుస్తుంది. అయితే తక్కువ ధ్వనిని వెలువరిస్తుంది. ఎగువ ప్రాంతంలోకి మెరుగ్గా వెళుతుంది. దీర్ఘకాలం మన్నుతుంది.

భూసేకరణ నుండే బాలారిష్టాలు

- **జిల్లా కలెక్టరేట్ల నిర్మాణాల్లో స్తబ్దత!**
- **12 జిల్లాల్లో కొనసాగని పనులు**
- **ఆరు జిల్లాల్లో సేకరించిన భూమి నిరుపయోగం**



మన తెలంగాణ / హైదరాబాద్ : కొత్త జిల్లా కలెక్టరేట్ల నిర్మాణ పనుల్లో స్తబ్ధత నెలకొంది. మొత్తం 31 జిల్లాలకు గాను 26 జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ డిస్టిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐడిఓసిఎస్)ల ను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 11 ప్యాకేజీల్లో నిర్మాణం చేపపడుతున్న సమగ్ర కలెక్టరేట్ల కాంప్లెక్స్‌ల పనులను రెండు నుండి మూడు జిల్లాలకు ఒక ప్యాకేజీగా వర్గీకరించి చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఒక్కో కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను రూ. 1 కోటి అంచనా వ్యయంతో చేపడుతున్నారు. వీటిలో 14 జిల్లాల్లో ఇప్పటికే పనులు ప్రారంభం కాగా, ఇతర చోట్ల వివిధ కారణాలతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న చోట్ల భూముల లభ్యత లేక పోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. భూసేకరణ పూర్తి అయిన చోట్ల కూడా పనులు నిదానంగానే సాగుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ డిజైన్‌కు అనుగుణంగా భూ విస్తీర్ణం 500 అడుగుల పొడవు, 500 అడుగుల వెడల్పు స్థలం ఉండాల్సి ఉండగా ఆ ప్రకారంగా లభించ లేదు. దీంతో జిల్లా కలెక్టర్లు భూసేకరణ చేసి పంపిన ఈ జిల్లాల్లో సమగ్ర కలెక్టరేట్ భవనాలు నిర్మించాలా? వద్దా అన్న డైలమా నెలకొంది. ఈ కారణంగా జిల్లా కలెక్టర్లు సేకరించిన ఆయా భూముల వివరాలను ఆర్ అండ్ బి అధికారులు ఉన్నతాధికారులకు తెలిపారు. రెవెన్యూ అధికారులు త్వరగా భూసేకరణ పూర్తి చేసి తమకు స్థలాలు అప్పగించేలా చూడాలని ప్రభుత్వానికి నివేదించారు. ఇలాంటి చోట్ల డిజైన్ ప్రకారం నిర్మాణం సాధ్యం కాదని, దీనికి పరిష్కార మార్గాలను తెలియజేయాలని వారు విన్నవించారు. ఈ జిల్లాల్లో భవనాల నిర్మాణాలను చేపట్టాలా? వద్దా అని కూడా రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపారు.భూ లభ్యత లేని కారణంగా హైదరాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాలో భవన నిర్మాణ పనులు చేనపట్టడం లేదు. సూర్యాపేట జిల్లాలోని స్థలాలు నిర్మాణయోగ్యంగా లేవని, అంతా గోతులు, ఎత్తు పల్లాలు ఉన్నాయని గుర్తించారు. ఖమ్మం జిల్లా విషయానికి వస్తే భూసేకరణ చేసిన స్థలం ఖమ్మం బైపాస్ రోడ్డులో ఉందని, ప్రజలకు దూరంగా ఉండడం, సైట్ కూడా వంకర టింకర ఉన్నట్లు గుర్తించారు. అలాగే మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్ రూరల్‌లో కొత్త జిల్లా కలెక్టరేట్ల కోసం సేకరించిన భూములు సరిగ్గా లేవని తేలింది. మహబూబ్‌నగర్‌లో ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ భవనం హెరిటేజ్ భవనం కావడంతో దాన్ని కూల్చడానికి నిబంధనలు అడ్డు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. భూములు సేకరించిన ఇతర జిల్లాల్లో ఇలాంటి సమస్యలే ఉత్పన్నమవుతున్నాయి. మంచిర్యాలను తీసుకుంటే జిల్లా కలెక్టరేట్ కోసం సేకరించిన భూమి గోదావరి నది పరీవాహక ప్రాంతంలో ఉందని, భారీ వర్షాలు, వరదలు వస్తే ఆ నీళ్లు ప్రస్తుతం సేకరించిన స్థలం దాకా వస్తాయని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఫ్లడ్ లెవల్ కంటే 500 మీటర్ల దిగువనే మంచిర్యాల కలెక్టరేట్ స్థలం ఉందని తేల్చారు. సూర్యాపేట కలెక్టరేట్ కోసం జిల్లా అధికారులు చూపించినది అసైన్డ్ భూమి కావడం, న్యాయస్థానాల్లో కేసు ఉన్నట్లు తేలింది. ఎంపిక చేసిన స్థలాలు బాగున్నాయని, న్యాయపరమైన చిక్కులను తాము చూసుకుంటామంటూ పలు జిల్లాల కలెక్టర్‌లు ప్రభుత్వానికి తెలియజేస్తున్నా.. ఇలాం టి వివాదాస్పద భూములను తీసుకోకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి ఆర్ అండ్ బి వచ్చినట్లు తెలిసింది.

పనులు ప్రారంభమైనవి : పెద్దపల్లి , జగిత్యాల, వరంగల్ అర్బన్, గద్వాల జోగులాంబ, వనపర్తి, నిజామాబాద్ , కామారెడ్డి, సిద్ధిపేట


పనులు ప్రారంభం కానివి : కొత్తగూడెం, ఆసిఫాబాద్, సిరిసిల్ల రాజన్న, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, నాగర్‌కర్నూలు, మెదక్ , మేడ్చల్ , శంషాబాద్, వికారాబాద్, యాదాద్రి..భువనగిరి

నిర్మాణానికి అనువుగా లేని జిల్లాలు : నిర్మల్, మంచిర్యాల, ఖమ్మం, వరంగల్ రూరల్ , మహబూబ్ నగర్ , సూర్యాపేట

ఆన్‌లైన్‌లో ఆయకట్టు వివరాలు

- **ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్**
- **ఒక్కతాటిపైకి సాగు లెక్కలు**

మన తెలంగాణ/హైదరాబాద్: ఆయకట్టు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. సాగు విస్తీర్ణంపై ఉన్న రకరకాల లెక్కలను ఓ కొలిక్కి తెచ్చి, వాస్తవ సమాచారం రికార్డు చేయనున్నారు. రాష్ట్రంలో ఉన్న మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఒకే గొడుకు కిందకు తీసుకు వస్తున్నారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సమాచారాన్ని త్వరలోనే అందరికీ అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కింద గల ఆయకట్టు పరిధిలో సాగవుతున్న పంటల వివరాలు తెలుసుకోవచ్చు. ఏడాది క్రితం దేశంలోనే తొలిసారి నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్‌ఎస్‌ఆర్‌సి), ఇస్రోలతో ప్రభుత్వం ఎంఓయు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ జలవనరుల సమాచార వ్యవస్థ రూపకల్పనలో ఇస్రో ప్రతిష్టాత్మక వెబ్ పోర్టల్‌ను ఉపయోగించుకుంటున్నారు. వెబ్‌పోర్టల్‌లో క్లిక్ చేస్తే మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల సరిహద్దుల వివరాలు, సమస్త సమాచారం కనిపించేలా పొందుపరిచారు. వెబ్ పోర్టల్‌లో ఉపగ్రహ చిత్రాలతో కూడిన నదీ బేసిన్ల వివరాలు, రిజర్వాయర్లలో నీటి వివరాల నమోదు, 15 రోజులకోసారి అప్‌డేట్ చేసే సమాచారం ఉంటుంది. దీనికి తోడు ఎప్పటికప్పుడు వర్షపాతం వివరాలు నమోదు చేస్తారు. ప్రాజెక్టుల ఎగువ, దిగువ భాగాల్లో పడే వర్షం వివరాలు తెలుసుకుంటూ వరదలపై ఓ అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది. దీనికి తోడు భూగర్భ జలవనరుల శాఖ పరిధిలోని 857 స్టేషన్ల వివరాల అనుసంధానంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల పెరుగుదల, తగ్గుదల ఎలా ఉందో నెలవారీ గ్రాఫ్‌లుగా సమాచారం అందుబాటులో వస్తుంది. దీనికి తగ్గట్లుగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవచ్చు. రాష్ట్రంలోని 66 ప్రాజెక్టుల వారీగా సాగు వివరాలు పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. గత సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద 2,67,534 హెక్టార్లలో వరి, 1,44,499 హెక్టార్లలో ఇతర పంటలు సాగయ్యాయని ఉపగ్రహ చిత్రాల ద్వారా తేల్చారు. మరో వైపు సాగర్ ఎడమ



కాలువ కింద 1,09,041 హెక్టార్లు వరి, 45,867 హెక్టార్లు ఇతర పంటలు సాగైనట్లు గుర్తించారు. ఇదే తీరులో సీజన్లు, సంవత్సరాల వారీగా గ్రాఫ్‌ల రూపంలో పొందుపరిచే అవకాశం ఉంది. ఇందులో వరి, వరేతర పంటల వివరాల సాగును కూడా తెలుసుకునే అవకాశం ఉంది. అతి త్వరలోనే మరికొన్ని హంగులు, సమాచారం చేర్చి సమగ్ర వెబ్‌పోర్టల్‌ను త్వరలోనే ఇరిగేషన్ శాఖ ప్రారంభించనుంది.

ఆ త్రివర్ణ పతాకం...
చాలా స్పెషల్

చెన్నయ్ : భారతదేశానికి స్వరాజ్యం సిద్ధించిన రోజు ఎగురవేసిన త్రివర్ణ పతాకం ఇప్పటికీ భద్రంగా ఉంది. దేశంలో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న ఏకైక పాతకాలపు జాతీయ జెండాగా అది గుర్తింపు పొందింది. ఆగస్టు 15, 1947న ఇక్కడ ఫోర్ట్ సెయింట్ జార్జ్‌పై ఎగురవేసిన ఆ జెండాని పలు రకాల ప్రయత్నాల ద్వారా భారతదేశ పురాతత్వ సర్వే (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా–ఎఎస్‌ఐ) భద్రపరుస్తూ వస్తోంది. దశాబ్దాలుగా ఎఎస్‌ఐ సంరక్షణలో ఉన్న ఈ జెండాని తొలిసారిగా జనవరి 26, 2013న ఇక్కడ ఫోర్ట్ సెయింట్ జార్జ్ కాంప్లెక్స్‌లోని మ్యూజియంలో ప్రజల సందర్శనార్థం ప్రదర్శించారు. ఒక పతాకాన్ని భద్రపరచడం అనేది అంత తేలికైన పనేమీ కాదు. దానిని ఒక గాలి ప్రవేశించని రీతిలో తయారు చేసిన వుడెన్‌గ్లాస్ షోకాజ్‌లో భద్రపరిచారు. తేమ నియంత్రణ కోసం జెండా చుట్టూ ఆరు కలశాల సిలికా జెల్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాక కాంతి తీవ్రతను కొలవడానికి ఉపయోగించే లక్స్ మీటర్‌ని కూడా షోకాజ్ లోపల అమర్చారు. 24 గంటల పాటు అవసరమైన మేర ఉష్ణోగ్రతను నిర్వహించేలా ఎసిని కూడా బిగించారు. ఆధునిక పరిజ్ఞానంతో పనిచేసే ఎల్ఇడి లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. షోకాజ్‌పై సహజమైన కాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని మ్యూజియంతో సంబంధమున్న ఒక అధికారి నామ గోప్యతను కోరుతూ పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. బ్రిటీష్ యూనియన్ జాక్‌ని కిందకు దింపి దాని స్థానంలో ఆగస్టు 15, 1947న ఉదయం 5.05 గంటలకు ఈ 12 అడుగుల 8 అంగుళాల పొడవైన ఈ స్వచ్ఛమైన సిల్కు జెండాని ఫోర్ట్ సెయింట్ జార్జ్‌పై ఎగురవేశారు.



ఐఐఐటి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్లకు లక్షల్లో జీతాలు

హైదరాబాద్ : ఏడాదికి రూ.13.4 లక్షలు– రూ.18.8 లక్షల మధ్య జీతాలను కొన్ని కంపెనీలు ఇక్కడ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి–హైదరాబాద్)కి చెందిన బిటెక్ గ్రాడ్యుయేట్లకు ఆఫర్ చేశాయి. వారితో పాటు ఐటిలో పిజి చేసిన వారు కూడా ఏడాదికి సగటున రూ.14 లక్షలు–రూ.17.7 లక్షల మధ్య జీతాల ఆఫర్లను అందుకున్నారని ఐఐఐటి–హైదరాబాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉద్యోగాల నియామకాల కోసం సుమారు 116 కంపెనీలు నమోదు చేసుకున్నాయి. తమ విద్యార్థులందరూ ఉద్యోగాలను పొందారని తెలిపింది. 'ఐఐఐటి–హైదరాబాద్ మళ్లీ వందశాతం ఉద్యోగాలను దక్కించుకుంది. ఐటిలో పిజి చేసిన మా విద్యార్థులు పలు ప్రముఖ కంపెనీల నుండి ఏడాదికి సగటున రూ.14 లక్షల నుండి రూ.17.7 లక్షల మధ్య జీతాలకు ఆఫర్లు అందుకున్నారు' అని సంస్థ తన ప్రకటనలో తెలిపింది. సాంకేతిక, ఉత్పాదక రంగాలకు చెందిన కంపెనీల నుండి తమ విద్యార్థులకు ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొంది. ఐఐఐటి–హైదరాబాద్ 16వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కంపెనీ సిఇఒ జివి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఐఐఐటి–హైదరాబాద్ పాలక మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ రాజ్ రెడ్డి అధ్యక్షత వహించారు.

సభలు జరుపుకునే హక్కుపై ప్రభుత్వం దాడి : కోదండరామ్

మన తెలంగాణ/ హైదరాబాద్ : సభలను, సమావేశాలను నిర్వహించుకునే హక్కుపై ప్రభుత్వం దాడికి పాల్పడిందని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొ. ఎం.కోదండరామ్ ఆరోపించారు. జెఎసి నాల్గవ దశ స్ఫూర్తి యాత్రను అడ్డుకున్న టిఆర్ఎస్ కార్యకర్తలకు అధికార యంత్రాంగం పూర్తిగా సహకరించిందని, అయినా తమ యాత్రను నిర్వహించేందుకు ప్రయత్నించామన్నారు. ఒకటి రెండు రోజుల్లో స్టీరింగ్ కమిటీ సమావేశమై తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు కోదండరామ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ అధికారాలను తెలుసుకుంటేనే ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను అమలు చేయడంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసమే జెఎసి చట్టబద్ధంగా ఎదురించిందన్నారు. చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు జెఎసి యాత్రకు అండగా నిలిచి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎం.ఎల్ న్యూడెమోక్రసి), టిడిపి, బిజెపితో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గవర్నర్ జన్మాష్టమి శుభాకాంక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్ : జన్మాష్టమి భగవద్గీత అందించే ఆధ్యాత్మిక ఎదుగుదలను గుర్తు చేసే పర్వదినమని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసిహన్ అన్నారు. అవనిపై శ్రీకృష్ణుని జన్మదినమైన శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆయన రెండు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గోకులాష్టమిగా కూడా పిలిచే పవిత్ర ఉత్సవం భక్తి, ఉత్సాహాలతో జరుపుకోవాలని ఆయన అన్నారు. ఉత్సవం ప్రజల నడుమ మనశ్శాంతిని, భౌతికాభివృద్ధిని, సహోదరత్వాన్ని , స్నేహభావాన్ని పెంపొందించే ఒక దూతలాంటిదని అభివర్ణించారు.

త్వరలో రాష్ట్రంలో భారీ వర్షాలు!

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే బుధ, గురు వారాల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం రాయలసీమ నుంచి తమిళనాడు తీర ప్రాంతాల వరకు ఆవరించింది. ఇది సముద్రమట్టానికి 900 మీటర్ల ఎత్తున ఉంది. ఉపరితల ఆవర్తనం ఉత్తర తమిళనాడు నుంచి దక్షిణ ఆంధ్రప్రదేశ్ వరకు సముద్ర మట్టానికి 1.5 నుంచి 3.6 కిలోమీటర్ల ఎత్తున పయనిస్తోంది. మరో ఆవర్తన ద్రోణి ఒడిషా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర మీదుగా వెళుతోంది. ఫలితంగా వచ్చే నాలుగైదు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఆగస్టు 16, 17వ తేదీల్లో భారీవర్షాలు కురుస్తాయని అన్నారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో రాష్ట్రంలో గోల్కొండలో 4, బోథ్, నాగరెడ్డిపేటలో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నారాయణఖేడ్, సరూర్‌నగర్, హైదరాబాద్, సంగారెడ్డి, ఉట్నూరులో 2, రాజేంద్రనగర్, బిక్నూరు, రామాయంపేట, మెదక్, మహబూబాబాద్, యాచారం, లింగంపేట్, బాన్సువాడ, పిట్లం, ఖమ్మం, ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, హకీంపేట, మేడ్చల్, కోటగిరి, సారంగాపూర్, రుద్రూరు, కంపాసాగర్, నల్గొండ, నిజామాబాద్, తాడ్వాయి తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ దరఖాస్తులకు ఆహ్వానం

మన తెలంగాణ/హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉత్తమ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు అవార్డుల కోసం కేంద్ర పంచాయతీరాజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నాడు ఎంపిక చేసిన స్థానిక సంస్థలకు అవార్డులు ప్రధానం చేస్తారు. 2016–17 సంవత్సరానికి గాను 'పంచాయత్‌అవార్డ్.గవ్.ఇన్' వెబ్‌సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మొత్తం మూడు కేటగిరీలుగా ఈ అవార్డులు ప్రధానం చేస్తారు. ఇందులో దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయతీ సశక్తికరణ్ పురస్కార్ కింద ఒక జిల్లా పరిషత్, రెండు మండలాలు, నాలుగు గ్రామపంచాయతీలకు అవార్డులు దక్కుతాయి. రెండో విభాగంలో నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ పురస్కార్‌ను రాష్ట్రంలోని ఒక పంచాయతీకి ఇస్తారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను సమర్థవంతంగా అమలు చేసిన పంచాయతీకి ఉపాధిహామీ అవార్డు ఇస్తారు. అవార్డులతో పాటు రూ.8 నుంచి 12 లక్షల వరకు విభాగాల వారీగా నగదు పురస్కారాన్ని కేంద్రం ఇస్తుంది.

ఏడు నెలల్లో ఉగ్రవాదులుగా 70 మంది యువకులు

జమ్ము : గత ఏడు నెలల్లో 70 మంది యువకులు ఉగ్రవాద సంస్థల్లో చేరారని ఒక సీనియర్ అధికారి వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించే ఉగ్రవాదులకు కేంద్రమైన దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా, సోపియాన్, కుల్గామ్ జిల్లాల్లోనే కొత్త నియామకాలు ఎక్కువగా జరిగాయని ఆయన అన్నారు. 'ఈ ఏడాదిలో గత ఏడు నెలల కాలంలో సుమారు 70 మంది కశ్మీర్ యువకులు ఈ ప్రాంతంలోని ఉగ్రవాదంలో చేరారు' అని సీనియర్ భద్రతా అధికారి ఒకరు పిటిఐ వార్తా సంస్థకు చెప్పినట్లు అధికారిక గణాంకాలు ఉటంకించాయి. 2016లో 88 మంది కశ్మీరీ యువకులు ఉగ్రవాదంలో చేరారని ఆయన చెప్పారు. 2014 నుండి ఉగ్రవాదంలో చేరుతున్న వారి సంఖ్య స్థిరంగా పెరుగుతూ వస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2015లో 66 మంది, 2014లో 53 మంది ఉగ్రవాదంలో చేరారని భద్రతా సంస్థలు తయారు చేసిన తాజా డేటా ద్వారా వెల్లడయింది. 2010లో 54 మంది ఉగ్రవాదంలో చేరగా ఆ సంఖ్య 2011లో 23కి తగ్గింది. ఆ సంఖ్య 2012లో మరింత తగ్గి 21కి, 2013లో 16కి చేరుకుందని ఆయన చెప్పారు. పుల్వామా, షోపియాన్, కుల్గామ్ ప్రాంతం స్థానిక ఉగ్రవాదులకు అనుకూలమైనదిగా అవతరించిందని ఆయన తెలిపారు.

కాల్పులతో సొంతిళ్లకు దూరంగా సరిహద్దు గ్రామాల ప్రజలు

రాజౌరి/జమ్మూ: పాకిస్థాన్ తరచుగా కాల్పులకు పాల్ప డుతుండటంతో నౌషేరా సెక్టార్ లో సొంతూళ్లకు వెళ్లేందుకు సరిహద్దు గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. ఐదు స్కూళ్లలో తాత్కాలిక శిబిరంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలు కాల్పులు ఆగిపోయిన మూడు నెలల తర్వాత కూడా తమ ఇళ్లకు వెళ్లేందు నిరాకరిస్తున్నారు. రాజౌరి సెక్టార్‌లో పలు ప్రాంతాలలో కొద్దీ రోజుల క్రితం పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో నలుగురు పౌరులు మృతి చెందారు. ఐదుగురికి గాయాలయ్యాయి. తమ గ్రామాలపై అనేక దశాబ్దాలుగా పాకిస్థాన్ దాడి చేస్తోందని, గత రెండేళ్లుగా తీవ్ర భయానక పరిస్థితి నెలకొందని నౌషేరా సెక్టార్‌లోని జీరో లైన్‌లోని జాంగార్ గ్రామ సర్పంచ్ పరుశోత్తమ్ లాల్ తెలిపారు. నియంత్రణ రేఖ వద్ద ప్రజల రక్షణ కోసం దాదాపు 7 వేల వ్యక్తిగత, కమ్యూనిటీ భూగర్భ బంకర్లను నిర్మించే ప్రతిపాదనను కేంద్ర ఆమోదానికి పంపినట్లు జిల్లా అభివృద్ధి కమిషనర్ షహీద్ ఇక్బాల్ చౌదరి తెలిపారు. నౌషేరా జిల్లాలో 100 బంకర్ల నిర్మాణం చేపట్టిందన్నారు.

బొగత జలపాతం పరవళ్లు...



ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు జయశంకర్ జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. పర్యాటకులను తన అందాలతో ఆకట్టుకుంటోంది. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల టూరిస్టులే కాకుండా వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి ఇక్కడికి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.
– మనతెలంగాణ/వాజేడు

స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేది వీరే

మన తెలంగాణ/హైదరాబాద్ : జిల్లా కేంద్రాల్లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లాల వారీగా పాల్గొనే మంత్రులు, ప్రజా ప్రతి నిధులు, ఉన్నతాధికారుల పేర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లాల వారీగా వేడుకల్లో శాసన సభ స్పీకర్ సిరికొండ మధు సూదనా చారి), మహబూబాబాద్ (ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య), వరంగల్ అర్బన్ (ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి), వరంగల్ రూరల్ (ప్రభుత్వ విప్ పల్లె రాజేశ్వర్ రెడ్డి), జనగాం (ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు), రాజన్న సిరిసిల్ల (మంత్రి కె.తారక రామారావు), కరీంనగర్ (మంత్రి ఈటల రాజేందర్), జగిత్యాల (ప్రభుత్వ ఛీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్), పెద్దపల్లి (పాతూరి సుధాకర్ రెడ్డి), ఆదిలాబాద్ (మంత్రి జోగు రామన్న), నిర్మల్ (మంత్రి ఎ.ఇంద్రకరణ్ రెడ్డి), మంచిర్యాల (ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు), కుమురం భీం ఆసిఫాబాద్ (శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్), సిద్ధిపేట్ (మంత్రి టి.హరీశ్ రావు), మెదక్ (శాసనసభ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మాదేవేందర్ రెడ్డి), సంగారెడ్డి (రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.ఆర్.మీనా), నిజామాబాద్ (మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి), కామారెడ్డి (ప్రభుత్వ విప్ గంపా గోవర్ధన్), మహబూబ్‌నగర్ (మంత్రి సి.లక్ష్మారెడ్డి), నాగర్‌కర్నూల్ (మంత్రి జూపల్లి కృష్ణారావు), వనపర్తి (ప్రణాళిక బోర్డు వైస్ ఛైర్మన్ ఎస్.నిరంజన్ రెడ్డి), జోగులాంబ గద్వాల (మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్), ఖమ్మం (మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు), భద్రాద్రి కొత్తగూడెం (మంత్రి టి.పద్మారావు), నల్గొండ (శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ రావు), సూర్యాపేట్ (మంత్రి జి.జగదీశ్ రెడ్డి), యాదాద్రి భువనగిరి (ప్రభుత్వ విప్ గొంగిడి సునీత), వికారాబాద్ (మంత్రి పి.మహేందర్‌రెడ్డి), రంగారెడ్డి (ఉప ముఖ్య మంత్రి మహ్మద్ మహమూద్ అలీ), మేడ్చల్ (మంత్రి నాయిని నర్సింహారెడ్డి).

గిరిజనుల సంక్షేమానికి కృషి

మనతెలంగాణ/భూపాలపల్లి ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలోని లంబాడి గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రామ్‌నగర్‌లో లంబాడి గిరిజనుల సాంప్రదాయ పండుగైన తీజ్ ఉత్సవాల్లో స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతులను ఆప్యాయంగా పలకరించి సంప్రదాయంగా జరుపుకునే తీజ్ ఉత్సవాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సిఎం కెసిఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చుతూ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పాటుపడుతున్నారన్నారు. విద్యా, వైద్య రంగాల్లో అత్యధికంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నాడని తెలిపారు. శిశు సంక్షేమ శాఖ మహిళా ఆర్గనైజర్ భారతక్క, నగరపంచాయతీ చైర్‌పర్సన్ బండారి సంపూర్ణ రవి,ఎంపిపి కల్లెపు రఘుపతిరావు, జెడ్పిటిసి మీరాభాయ్ లింగానాయక్,టిఆర్ఎస్ మండల అధ్యక్షులు మందల రవిందర్ రెడ్డి,నాయకులు మేకల సంపత్,సాంబమూర్తి,పైడిపల్లి రమేష్,సేనాపతి,పాల్గొన్నారు.



ప్రకృతిని పూజించడమే 'తీజ్'





ఈ నెల నాలుగో తేదీ నుండి మొదలైన తీజ్ సందడి నేడు జరిగే నిమజ్జనంతో ముగుస్తుంది. తీజ్ ఉత్సవాన్ని తెలంగాణ తండాల్లోని పెళ్లికాని ఆడపిల్లలు చేస్తారు.వర్షాకాలం తొలకరి సమయంలో కనిపించే ఎర్రని ముఖమల్ లా ఉండే ఆరుద్ర పురుగును తీజ్ అంటారు. గోండు గిరిజనులు గోధుమ మొలకలను కూడా తీజ్ అని పిలుస్తారు.బతుకమ్మను తంగేడు పూలతో అలంకరించినట్టే, తీజ్‌ను గోధుమ మొలకలతో పేర్చుతారు.వర్షాకాలం మెదలై నాట్లు పూర్తయిన తరువాత తీజ్‌ను జరుపుతారు. ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి మండలం, దొడందా,గట్టేపల్లి తండాల్లో గోండు, మధురా,కొలాం తెగల ఆదివాసీలు జరుపుకుంటున్న 'తీజ్' పండుగ సందడి ఇది. క్రిమిసంహారక మందులతో పొలాల్లో మట్టి కలుషితమై పోతుండటంతో గిరిజన ఆడబిడ్డలు పవిత్రమైన మట్టి కోసం అడవుల్లో పుట్టను తవ్వి మట్టిని సేకరించి తీజ్ పండుగను జరుపుకుంటారు. వానలు కురిసి పంటలు పండాలని తమ బతుకులు బాగుండాలని ప్రకృతిని ప్రార్థించడమే తీజ్ వెనుక పరమార్థం.

పండుగ ఇలా...

గిరిజన తండాల్లోని యువతులంతా కలిసి పెద్దవాళ్ల ఆశీస్సులు తీసుకున్న తరువాత ఇంటింటికి తిరిగి వేడుకల కోసం వారు ఇచ్చినంత విరాళం తీసుకుంటారు. ఆ డబ్బుతో గోధుమలు,ఇతర సామాగ్రి తెచ్చుకుంటారు. సాయంత్రం గోధుమలు నీటిలో నానపెడతారు.మరుసటి రోజు దుసేరు తీగతో అల్లిన చిన్న బుట్టలలో పుట్టమట్టిని తెచ్చి అందులో ఆదివాసీల దేవతలు సేవాభయా,దండియాడి పేర్లతో మొదటగా తండా నాయకుడి చేత ఎరువు కలిపిన మట్టిని పూయిస్తారు. ఈ బుట్టలన్నింటినీ ఒక పందిరి కింద ఉంచి,వాటిపై నీళ్లు చల్లుతూ, అక్కడ రోజూ ఆడపిల్లలంతా కలిసి ఆడుతూ పాడతారు. ''గోధుమలను బుట్టలో చల్లే రోజు సాయంత్రం బోరడి గక్మేరో నిర్వహిస్తారు. పెళ్లికాని ఆడపిల్లలంతా రేగుముళ్లకు సెగలు గుచ్చేటపుడు వరుసైన మగాళ్లు వాటిని కదిలిస్తూ ఆటపట్టిస్తారు.అయినప్పటికీ సెగల్ని గుచ్చాల్సిందే. కొన్ని తెగల్లో అన్నలు కూడా చెల్లెలను ఏడిపిస్తారు.'' అని తీజ్ పండుగలోని ఒక ముచ్చటను వివరించింది దొడందా తండాకు చెందిన డిగ్రీ గోండు విద్యార్థిని.

చుర్మో....కడావో

''రొట్టెలు,బెల్లం కలిపిన ముద్దను దేవుడికి సమర్పించడాన్ని చుర్మో (కొన్ని తెగలు ధమోళి అంటారు) అంటారు. ఇది ఏడవ రోజున జరి పే కార్యక్రమం. అందరూ సేక రిం చిన బియయంతో పాయసం (కడావో) వండుతాం. ఎనిమిదో రోజున మా ఆదివాసీ ఆరాధ్య దేవతలను మట్టితో చేసి వాటికి పెళ్లి చేస్తాం.''అని గట్టేపల్లి గ్రామస్థులు తెలిపారు.

నిమజ్జనమిలా...

తొమ్మిదో రోజున తీజ్ నిమజ్జనానికి బంధువులను పిలుస్తారు.తండాలన్నీ పండుగ వాతావరణం సంతరించుకుంటాయి.కొత్త దుస్తులు ధరించి సేవాలాల్,మేరామా భవానీ కి పూజలు చేసి తొమ్మిది రోజుల పాటు పెంచిన గోధుమ పిలకల బుట్టల ముందు కొబ్బరి కాయలు కొట్టి మొదటి తీజ్‌ను నాయక్ రుమాలులో పెట్టిన తరువాత ఆపదల నుండి తమను కాపాడాలని అన్న దమ్ములకు గోధుమ నారు ఇచ్చి దీవెనలు తీసుకుంటారు. అమ్మాయిలంతా తీజ్ బుట్టలు పట్టుకొని వరుసగా నడుస్తూ పాటలు, కేరింతలు,డప్పుల మధ్య సమీపంలోని నీటి చెలమల్లో తీజ్ నిమజ్జనం చేస్తారు.

– శ్యాంమోహన్(రూరల్‌మీడియా)
ఫోటోలు.కె.రమేష్‌బాబు

నిరుద్యోగుల ఆశలు
కోచింగ్ సెంటర్లకు కాసులు

- **నోటిఫికేషన్ల కోసం విద్యార్థుల ఎదురుచూపులు**
- **ఏళ్ల తరబడి అభ్యర్థుల శిక్షణ**

మనతెలంగాణ/హైదరాబాద్ : సర్కారు కొలువుల కోసం వేయికళ్లతో నిరుద్యోగులు చూస్తున్న ఎదురుచూపులే కోచింగ్ సెంటర్లకు అవకాశంగా మారింది. నోటిఫికేషన్లు ఆలస్యమైనా ఫర్వాలేదు.. కానీ త్వరలోనే వస్తాయన్న అంచనాలు మాత్రం కోచింగ్ సెంటర్లకు ఊతమిస్తున్నాయి. ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూసే అభ్యర్థుల అవసరాలే ఆసరాగా ఇన్‌స్టిట్యూట్‌లు నడుస్తున్నా యి. కనీస సౌకర్యాలు లేకుండా కిక్కిరిసిన గదుల్లో ఖాళీ లేకుండా కుర్చీలు వేసి పాఠాలు చెబుతున్నారు. కొన్ని సెంటర్లు అయితే ఏకంగా ఫంక్షన్ హాళ్లు, ఆడిటోరియంలలోనే కోచింగ్‌లు కొనసాగిస్తున్నాయి. తమ వద్ద కోచింగ్ తీసుకుంటే జాబ్ గ్యారంటీ అని... జాబ్ రాకపోతే ఫీజు వాపస్ అని ఒక్కో సెంటర్ ఒక్కో విధంగా ప్రచారం చేసుకుంటూ అభ్యర్థుల ఆశలను సొమ్ము చేసుకుంటున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలకు పెద్ద సంఖ్యలో నోటిఫికేషన్లు వస్తాయని ఆశించిన అభ్యర్థులు చాలామంది పోటీ పరీక్షలకు కోచింగ్‌లు తీసుకోవడానికి హైదరాబాద్‌కు వచ్చారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ ఉంటుందన్న అంచనా, నోటిఫికేషన్ల జారీకి రంగం సిద్ధమవుతుందంటూ ఎప్పటికప్పుడు వెలువడుతున్న ప్రకటనలతో అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తు తున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా... నోటిఫికేషన్ల జారీలో ఆలస్యమవుతున్నా..వారు మాత్రం ఇక్కడే హాస్టళ్లలో ఉంటూ ఒక్కో అభ్యర్థి రెండు, మూడు కోచింగ్ సెంటర్లలో కోచింగ్‌లు తీసుకుంటున్నారు. కొన్ని సెంటర్లు ప్రత్యేకంగా గ్రూప్స్‌కే కోచింగ్‌లు ఇస్తుండగా, మరికొన్నింటిలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం గత సంవత్సరాలుగా బ్యాచ్‌లకు బ్యాచ్‌లు కోచింగ్‌లు తీసుకున్నాయి. ఇంకొన్ని చోట్ల ప్రత్యేకంగా ఎస్.ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ప్రత్యేకంగా కోచింగ్‌లు ఇస్తున్నాయి. ఈ కోచింగ్ సెంటర్లకు అనుబంధంగా హాస్టళ్లు, బుక్‌స్టాళ్లు నెలకొల్పుకుని రూ. కోట్ల టర్నోవర్లతో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

కళకళలాడుతున్న అశోక్‌నగర్ :

రాష్ట్రంలోనే సివిల్స్, గ్రూప్1, గ్రూప్2 కోచింగ్‌లకు అశోక్‌నగర్ ఫేమస్. ఇక్కడ సుమారు 3050 కోచింగ్ కేంద్రాలలో గ్రూప్స్ కోచింగ్ ఇస్తుంటారు. ఇందులో 78 కోచింగ్ కేంద్రాలు ప్రముఖమైనవి. ఈ కేంద్రాలు గ్రూప్2 కోచింగ్‌కు ఒకో బ్యాచ్‌కు సుమారు 1,500 మంది అభ్యర్థులను చేర్చుకుని, ఒక్కొక్కరి నుంచి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. చాలా ఇన్‌స్టిట్యూట్లు ఫస్ట్,సెకండ్, థర్డ్ బ్యాచ్ అంటూ అందరినీ కలిపి ఒకే హాలులో కుక్కి పాఠాలు చెబుతున్నారు. వందలాది మందిని ఒకే గదిలో కుక్కి, మైకు, స్పీకర్లు ఏర్పాటు చేసుకుని బోధిస్తున్నారు. కోచింగ్‌లో చేర్చుకునే సమయంలో ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు అని చెప్పి, కొన్ని రోజుల తర్వాత రోజం తా తరగతులు నిర్వహిస్తున్న సంస్థలు ఉన్నాయి.



టీచర్ పోస్టులకు ఏళ్ల తరబడి కోచింగ్ :

రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుండటంతో అభ్యర్థులు ఏళ్ల తరబడి కోచింగ్‌లు తీసుకుంటూనే ఉన్నారు. టీచర్ అభ్యర్థులు 2012 నుంచి టెట్, డిఎస్సీకి కోచింగ్‌లు తీసుకుంటూ నోటిఫికేషన్ల కోసం కళ్లు కాయలుకాచేలా ఎదురుచూస్తున్నారు. టీచర్, గురుకుల టీచర్ ఉద్యోగాలకు కోచింగ్‌లు ఇచ్చే కేంద్రాలు ఎక్కువగా దిల్‌సుఖ్‌నగర్‌లో ఉన్నాయి. ఈ కోచింగ్‌లకు ఒక్కో బ్యాచ్‌కు సుమారు 300600 వరకు అభ్యర్థులను చేర్చుకుంటున్నారు. టీచర్ పోస్టులకు లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు ఒక్కో అభ్యర్థి నుంచి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఫీజులు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో సుమారు 3.5 లక్షల మంది టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఉండగా, అందులో సుమారు 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది అభ్యర్థులు ఇప్పటికే పలుమార్లు కోచింగ్‌లు తీసుకుని ఉన్నట్లు అంచనా. అయితే టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటివరకు టిఎస్‌పిఎస్‌సి సిలబస్ విడుదల చేయలేదు. అయినా కోచింగ్‌లు మాత్రం కొనసాగుతూనే ఉన్నా యి.

పోలీసు ఉద్యోగాల కోచింగ్‌కు భలే గిరాకీ :

ఎస్.ఐ, కానిస్టేబుల్ వంటి ఉద్యోగాల కోసం నిరంతరం కోచింగ్ లు కొనసాగుతూనే ఉన్నాయి. పోలీసు ఉద్యోగాలకు కోచింగ్‌లు ఇచ్చే ఇన్‌స్టి ట్యూట్‌లు రామంతాపూర్, దిల్‌సుఖ్‌నగర్‌లో ఎక్కువగా ఉన్నాయి. ఈ కోచింగ్‌లకు ఒక్కో బ్యాచ్ 100200 మంది అభ్యర్థులను చేర్చుకుంటు న్నారు. ఎస్.ఐ కోచింగ్‌కు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తుండగా, కానిస్టేబుల్ కోచింగ్‌కు రూ.1015 వేల వరకు ఫీజులు తీసుకుంటున్నారు.


రూ. 41 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం

సూరత్: నకిలీ కరెన్సీని ముద్రించి చలామణీ చేస్తున్న నలుగురు వ్యక్తులను స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఒజి) ఆదివారం అరెస్టు చేసింది. వారి నుంచి రూ. 40.73 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్టు పోలీ సులు వెల్లడించారు. సానియా గ్రామానికి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో ఎస్ఒజి సోదాలు జరపగా, భారీ మొత్తంలో రూ. 2వేలు, రూ. 500, రూ. 100 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుంది. ఇటీవల నకిలీ కరెన్సీని చలామణీ చేసేందుకు యత్నించిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేయగా, రవి గాంధీ (30) అనే వ్యక్తి నుంచి ఈ కరెన్సీని పొందినట్టు వారు పోలీసులకు తెలిపారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు సానియా గ్రామంలోని గాంధీ నివాసంలో కూడా సోదాలు నిర్వహించారు. అతని నివాసంలో ఒక ప్రింటింగ్ మిషన్, కటింగ్ మిషన్, ల్యాప్‌టాప్, నోట్ల తయారీ కాగితాలతో పాటు రూ. 15.38 లక్షల నకిలీ కరెన్సీని కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవి గాంధీని కూడా పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఎస్ఒజి అధికారులు మొత్తం రూ. 40.73 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిందితుడు గాంధీ రూ. 80 లక్షల రుణాన్ని వెంటనే చెల్లించాల్సిన అవసరం ఏర్పడటంతో అతడు నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించాలని నిర్ణయించుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఎస్ఒజి పేర్కొంది.

మాజీ మంత్రి తనయుడు మృతి

న్యూఢిల్లీ: మణిపూర్ మాజీ మంత్రి తనయుడు ఢిల్లీలోని ఓ రెస్టారెంట్‌పై నుంచి కింద పడి మృతి చెందారు. మాజీ హోం, విద్యాశాఖ మంత్రి ఎం ఒఖేంద్రు తనయుడు సిద్ధార్థ్ (19), శనివారం హౌజ్‌ఖాస్ గ్రామంలోని ఓ రెస్టారెంట్ రెండంతస్థులపై నుంచి కింద పడినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలైన సిద్ధార్థ్‌ను సమీపంలోని సఫ్దర్‌గంజ్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలం నుంచి పోలీసులు పగిలిన పెంకులు, పర్సు, మొబైల్ ఫోన్, కళ్ల అద్దాలు స్వాధీనం చేసుకున్నారు. సఫ్దర్‌గంజ్ డెవలప్‌మెంట్ ఏరియాలో నివసిస్తున్న సిద్ధార్థ్, తన స్నేహితులతో కలిసి రెస్టారెంట్‌కు వచ్చారు. తన సోదరుడి మృతి అనుమానాస్పదంగా ఉందని బాధితుడి సోదరి తెలిపారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒక అమ్మాయి-అంతరంగం



ముప్వన్నెల జెండా కోసం
దేశ భక్తిని ఊపిరిగా పీలుస్తున్న
వీర జవాన్‌ను
నేను ప్రేమిస్తున్నాను

కన్నీళ్లు తాగుతూ కూడా
బీళ్లను పండిస్తున్న అన్నదాతను
నేను ప్రేమిస్తున్నాను

మంచు రక్కసి మెడలు వంచి
ఎవరెస్టు ఎక్కుతున్న యువతను
నేను ప్రేమిస్తున్నాను

కాని
ఒక్కొక్క ఇటుకతో
భవిష్యత్తును నిర్మించుకుంటున్న అమ్మాయితో
'నిన్ను పటాయించి తీరుతానే'
అంటూ రంకెలు వేస్తున్న
డ్రంక్ అండ్ డ్రగ్గే సినిమా జీరోను మాత్రం
నేను ద్వేషిస్తున్నాను.

అమ్మంగి వేణుగోపాల్
9441054637

ఏడుపదుల స్వతంత్రం

ఏడుపదుల స్వతంత్రం
ఎండమావి వసంతం
చెట్టుమీద స్వేచ్ఛ పక్షి
చెదురుతున్న ప్రశాంతం

జాతిపిత గాంధీ కీర్తి
స్వరాజ్యం పోరు స్ఫూర్తి



నెహ్రూ లౌకికత్వ వ్యాప్తి
నేడు కాలగర్భ శక్తి

గాడ్సే తీవ్రవాద హితం
గాన సుప్రభాత మతం
దైవభక్తే దేశభక్తి
ధర్మమనే రాజ్యయుక్తి

ఆహారపు అలవాట్లు
సాంప్రదాయ పరిమిట్లు
సాగుతున్న తీరుపైన
చట్టసభల కత్తిపోట్లు

రెక్కలిరిగి పక్కకొరిగి
పయనించని ప్రజల స్వేచ్ఛ
ఆధిపత్య మతం అంశ
అసహనం దాడి హింస

బహుళత్వంలో భారత
ఏకత్వం ఇంద్ర ధనస్సు

దర్శించే కళ్లపైన
దాడిపెంచుతున్న కుళ్లు

శాంతి సామరస్య ఇల్లు
సమతాశయ పరవళ్లు
అహింసా సహన వేళ్లు
అన్ని ధ్వంస ఆనవాళ్లు

పల్లె బతుకు బంధం
పైరు పచ్చ అందం
కులవృత్తుల చందం
కార్పోరేటు గంధమయం

వ్యవసాయం సంక్షోభం
వెన్నువిరిచె సంక్షేమం
దేశరైతు కంట నీరు
దారయ్యి పారే ఏరు

అభివృద్ధి సంపన్నం
అంతరాల పరమాన్నం
అనుభవించె ధనిక జనం
అందుకోని పేద జనం

అహంకార లోతులు
అధికారం గోతులు
అవే పార్టీ నీతులు
అయ్యే రాజ్య రీతులు

రాజకీయ స్వార్థహితం
రాజనీతి స్వంతమతం
కాలుష్యం కాల్చుతున్న
ప్రజాస్వామ్య భారతం

ప్రజల కొరకు సాగుతున్న
పరిపాలన భారతం
స్వచ్ఛకాని స్వేచ్ఛలేని
సాగుతున్న భారతం

వేల్పుల నారాయణ, 9440433475

సినారె ఇంటికి సాహితీ యాత్ర



మాడిశెట్టి గోపాల్
9440238852

అనేక రోజులుగా మనసులో మెదులుతున్న ఆలోచనకు కార్యరూపం ఇచ్చిన రోజు జులై 29. ఇరవై ఏడు సంవత్సరాలుగా వివిధ సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ చేరువైన కరీంనగర్ సమైక్యసాహితి ఆధ్వర్యంలో సాహితీ యాత్రకు ఆ రోజు శ్రీకారం చుట్టడం జరిగింది. సాధారణంగా కవులు, రచయితలకు సంబంధించిన కార్యక్రమాలు పట్టణంలో ఏదో ఒక సమావేశ మందిరంలో జరుగుతుంటాయి. అలా కాకుండా వారి గ్రామానికి వెళ్లి, వారు నడయాడిన ప్రదేశాలు చూసి, అక్కడే వారికి సంబంధించిన సాహిత్యాన్ని చర్చించుకునే విధంగా సమైక్యసాహితి మిత్రులందరం కలిసి ఒక ఆలోచన చాలా రోజులనుండి చేయడం, అది జ్ఞానపీఠ గ్రహీత డా.సినారె జయంతి రోజునుండే ప్రారంభించాలని ధృఢంగా ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆ కార్యక్రమానికి ఏం పేరుపెడితే బాగుంటుందని అనుకుంటున్న సమయంలో ప్రముఖ సాహితీ వేత్త డా.గంధ్ర లక్ష్మణరావు 'సాహితీ పర్యటన' అనే పేరును సూచించారు. అంతిమంగా అదే పేరును నిశ్చయించి ప్రత్యేకంగా ఒక బ్యానర్ రాయించి తొలి పర్యటనగా సినారె స్వగ్రామం హనుమాజిపేటకు వెళ్లాలని కార్యక్రమాన్ని రూపొందించాం. సినారె మరణించిన తర్వాత వచ్చిన తొలి జన్మదినం కావడంతో ఒక రకమైన ఉద్వేగం అందరిలో ఉంది. కరీంనగర్ మానేర్ పాఠశాల అధినేత అనంతరెడ్డి సౌజన్యం సమకూర్చగా అందరం ఆ పాఠశాలలోనే ఉదయం కలుసుకున్నాం. పర్యటన కార్యక్రమాన్ని అనంతరెడ్డి లాంఛనంగా ప్రారంభించగా, ఒక ప్రత్యేక వాహనంలో దాదాపు 35మంది రచయితలం,కొందరు కళాకారులు కలిసి బయలుదేరాం. ఇదే కాకుండా రెండు కార్లలో 10 మంది కార్యక్రమానికి బయలుదేరారు. హనుమాజిపేట వేములవాడకు సమీపంలో కరీంనగర్ జిల్లా కేంద్రంనుండి దాదాపు 45కిలోమాటర్ల దూరంలో ఉంది. వాహనంలో బయలుదేరిన వారు సినారెకు సంబంధించిన పాటలు పాడుతూ, వారి రచనలు గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా ముందుకువెళ్లాం. వేములవాడ దాటి హనుమాజిపేటకు వెళ్తున్నప్పుడు సినారె తరచుగా పేర్కొనే మూలవాగును చూశాం. అందరిలో ఒక రకమైన అనుభూతి. హనుమాజిపేట కు చేరగానే సిరిసిల్ల జిల్లా డీ ఆర్వో శ్యాంప్రసాద్ లాల్ సూచనల మేరకు




కరీంనగర్ సమైక్య సాహితి వారి 'సాహితీ పర్యటన'

వీ ఆర్వో ఛోటేమియా మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. పచ్చని చెట్ల మధ్య ఉన్న సినారె ఇల్లును చూడగానే ఈ ఇల్లే కదా దేశం గర్వించదగిన జ్ఞానపీఠపురస్కార గ్రహీతను అందించిందని అనిపించింది. ఇంటి ముందు సినారె పేరు, ఇంటినంబర్ ఉంది. దాదాపు 2 ఎకరాల విశాలమైన స్థలం. ఆయన ఇంటిని గ్రంథాలయానికి ఇవ్వడం ఆయన ఔదార్యానికి మచ్చుతునక. సినారె నడయాడిన ఆ ఇల్లు చూసి అందరం పులకరించిపోయాం. 'ఇచ్చట పుట్టిన చిగురు కొమ్మైన చేవ' అనే పంక్తి గుర్తుకు వచ్చింది. ఇంటి ఎనకాల గల పెరటి స్థలంలో చింతచెట్ట క్రింద వీఆర్వో వలయాకారంలో కుర్చీలు వేశారు. అందరికీ నీళ్లు, ఛాయ్ ఇచ్చారు. ఆ పక్కనే మూడు సమాధులు వరుసగా ఉన్నాయి. సినారె అమ్మానాన్న బుచ్చమ్మ, మల్లారెడ్డి, మరియు సినారె భార్య సుశీల సమాధులు పేర్చినట్లుగా ఉన్నాయి. వాటికి సమీపం లోనే కూలీలు సినారె సమాధిని నిర్మిస్తున్నారు. తొలుత సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి అందరం నివాళులర్పించాం. దాదాపు 40 మంది కవులు సినారె పైన రాసిన కవితలు చదివారు. సినారె కవిత్వం, ఆయన బహుముఖ ప్రతిభ గురించి చాలా మంది మాట్లాడారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, అనంతాచార్య లు మాట్లాడుతూ సంస్థ పక్షాన తరచుగా సాహితీ యాత్రలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా ఇది మొదటి పర్యటన అని పేర్కొన్నారు. కవులు, రచయితలు గొప్ప కవుల ప్రదేశాలతో మమేకమై వారి స్ఫూర్తిని అందిపుచ్చుకోవడానికి ఈ యాత్రలు దోహదం చేస్తాయని అన్నారు. సంగీత పరికరాలతో వచ్చిన కళాకారులు కెబి శర్మ మరియు సుకృతి మేఘమాల సినారె రాసిన ఆణి ముత్యాలవంటి గీతాలను పాడి తమ గానంతో అందరినీ అలరించారు. వాహనాన్ని సమకూర్చిన మానేరు పాఠశాల అధినేత మాట్లాడుతూ ఈ యాత్రను ఒక చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా చక్కని పాట పాడిన గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శంకర్ కు ఆయన స్పందించి 1000 రూపాయలు అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. విజన్ స్వచ్ఛంద సంస్థ అధినేత తుమ్మల రమేశ్ రెడ్డి మాట్లాడుతూ తన సాహిత్యం ద్వారా ప్రజలను ప్రభావితం చేసిన సినారె చిరస్మరణీయుడన్నారు.

సినీ విమర్శకులు, కవి వారాల ఆనంద్ మాట్లాడుతూ అధ్యయనం ద్వారా మాత్రమే కవులు మరింత ప్రభావవంతంగా కవిత్వాన్ని రాయగలరని అందుకే చదవడం చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. సాటి కవుల రచనలు చదివి ప్రోత్సహించడం అలవరచుకోవాలని అన్నారు. సంస్థ అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ మాట్లాడుతూ భారత పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం తనకు ఇష్టమైన బోధన చేస్తూనే కన్నుమూసినట్లుగా, సినారె ఆ కోవలోనే ఊపిరున్నంతవరకు రచనా వ్యాసంగాన్ని కొనసాగించారన్నారు. విమర్శకులు, రచయిత దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ వర్ధమాన కవులను ప్రోత్సహించే లక్షణం పుష్కలంగా గల సినారె వేలాది కవుల పుస్తకాలకు ముందుమాటలు రాసి ధన్యుడయ్యాడన్నారు. సమైక్యసాహితి ఇలాంటి వినూత్న కార్యక్రమాలను తలపెట్టడాన్ని ప్రశంసించారు. జర్నలిస్టులు పిఎస్ రవీంద్ర, నాగేంద్రశర్మలు సినారె తో గల సాన్నిహిత్యాన్ని నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కవులు సుజాత,పద్మశ్రీ, అనిత, హరిప్రియ, గజేందర్ రెడ్డి, వేణుశ్రీ, సంపత్ కుమార్, దయాకర్, గంగాధర్, కిషన్, ఉమాపతి, హరిదాస్, వితల శర్మ, గిరిధర రావు, పవన్, రామయ్య, దనేష్, అనిల్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఫిలిగ్రీ కళాకారులు, కవి, గాయకుడు రావుల పవన్ సినారెపై రాసిన గీతాన్ని ఆలపించి ఆహూతులను ఆనందపరిచారు. స్థానిక పాఠశాలలో నిర్వహించిన సినారె జయంతి కార్యక్రమంలోసైతం అందరం పాల్గొని, తిరుగు ప్రయాణంలో వేములవాడలో ఆలయ ఈవో దూస రాజేశ్వర్ భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు అందరికీ స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. పత్రికా ప్రతినిధులు కూడా ఆసక్తిగా కార్యక్రమం చివరి వరకు పాల్గొనడం విశేషం. సినారె గ్రామస్తులు సైతం ఈ కార్యక్రమం చేపట్టడం పట్ల అభినందనలు తెలిపారు. ఆ జ్ఞాపకాలు అందరూ పంచుకొని మళ్లీ బస్సులో పాటలు పాడుకుంటూ కరీంనగర్ చేరుకున్నాము.

సమాజ హితం కోసమే ఈ కవిత్వం



ఏశాల శ్రీనివాస్
9603402858

సాహిత్య ప్రక్రియలో కవిత్వం మార్మికతగా వస్తువును చెప్పడం ఒకప్పటి ఆనవాయితీ. సంప్రదాయ కవిత్వం గ్రాంధిక భాషను వాహికగా చేసుకొని జీవించింది, ప్రజల భాషలో కవిత్వం రాయటం మొదలయి నప్పుడు అభ్యుదయ కవిత్వం, మార్క్సిస్టు భావజాలంతో కూడిన కవిత్వం వచ్చింది. మండల్ కమీషన్ ఉద్యమం తరువాత మహాత్మ జ్యోతీరావ్ పూలే, డా.అంబేద్కర్‌ల భావజాలంతో కవిత్వం రావటం ఆరంభమయింది. నానీల ప్రక్రియ మొదలయింది.

ఎన్ని రకాల కవిత్వం వచ్చినా సాహిత్యానికి వస్తువు అంతిమంగా మనిషితో మొదలై, మనిషితోనే ముగిస్తుందనే అభిప్రాయం బహుజనవాదంతోనే వచ్చింది. ఎందుకంటే, మార్క్సిజానికి సమాజం ముఖ్యం, మనిషి (వ్యక్తి) రెండవ అంశంగా గుర్తిస్తుంది. సామూహికత్వానికి ప్రాధాన్యత తగ్గి కుల సమూహాలను గుర్తించడం, వారి కష్టనష్టాలకు కారణాలను వెతకడం ఆరంభమైంది. ఇది భారత దేశానికి వున్న ప్రత్యేకమైన కులం, అది సృష్టించి అఘూతాలను వెలుగులోకి తెచ్చింది.

ఆధునిక సమాజ విమర్శకు అద్భుతమైన నిర్వచనం ఈ ''దిమాక్ ఖరాబ్'' పుస్తకం. ఆధునిక సమాజం మన ముందు ఎన్ని సౌకర్యాలు ఏర్పరుస్తుందో, అంత కంటే ఎక్కువే మన దగ్గర నుండి అన్ని రకాలుగా దోపిడీ చేస్తుంది. అది అన్ని సందర్భాలలో బహిరంగంగా కనిపించదు, కొన్ని సార్లు ఎవరు మన స్వేచ్ఛ, మన హక్కులను తీసివేస్తున్నారో, దానికి యజమాని ఎవరోకూడా అర్థం కాదు. పెట్టుబడిదారీ సమాజం ఇలాగే వుంటుంది, ఇందులో మనిషిని, మనిషి దోపిడి చేసుకొని బతకటం తప్ప వేరే మార్గం లేదు అని చెప్తుతుంటారు. ఇలాంటి సమాజాన్ని ఎంతో ఓర్పుతో, నేర్పుతో తనదైన శైలితో రచనలు చేసిన మోహన్ రుషి కవి, విమర్శకుడు, దార్శనికుడు.

ఇందులోని ఒక్కో వాక్యంతో ఒక్కో వ్యాసాన్ని



రాయవచ్చు. అంత లోతుగా వుంది కవి పరిశీలన. ఈ పుస్తకంలోని మొట్టమొదటి వ్యాఖ్య ''ఉద్యమ ఫలాలు ఫ్రూట్ మార్కెట్లో దొరకవంటే వినవు కదా?!'' తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత జరిగిన పరిణామాలను ఒక్క వాక్యంతో చెప్పాడు. ఉద్యమంలో ముందుండి పోరాడడం వేరు, ఉద్యమం సఫలం అయినాక అందులో భాగస్వామ్యం కావడం అందరివల్ల కాదు అనేది మన ముందున్న సత్యం. ఎన్నడు ఉద్యమంలో లేనివాళ్ళు, ఉద్యమానికి వ్యతిరేకంగా పని చేసిన వాళ్ళు, ఉద్యమంలో ఏనాడు ముందుండని, త్యాగాలు చేయని అగ్ర కుల సామాజిక వర్గం ఈ రోజు పాలక పక్షంలో ముందుంది, పాలకులకు సలహాదారులుగా ముందు వరుసలో వున్నారు. ''చేప, మందు ఫ్రీగా ఇచ్చినప్పుడే, బంగారు తెలంగాణ వచ్చినట్టు!'' తెలంగాణకు ప్రత్యేకమైన చేపమందు ఉచిత పంపిణీ పథకాన్ని, ఒక ''కామా'' గుర్తుతో దాని అర్థమే మార్చిన భాష రచయిత ప్రావీణ్యానికి చిహ్నం.''ఇంజనీరింగ్ విద్య ఇప్పుడు మోక్షగుండం కాదు, అగ్ని గుండం!'' ఈ వ్యాఖ్య ఆధునిక సమాజం మనిషిలో ఎన్నో ఆశలు రేపుతుంది. నా కొడుకు, నా బిడ్డ ఇంజనీరు అని, పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి అని గొప్పగా చెప్పుకునే రోజు పోయింది. ఇప్పుడు నాకొడుకు, నాబిడ్డ ఇంజనీరింగ్ చేసిండు కానీ ఉద్యోగం రాలేదు.

ఇందులో తప్పెవరిది చదివిన విద్యార్థిదా, నాణ్యత లేని కాలేజీలు నడిపిన యాజమాన్యాలదా, లేక కండ్లుమూసుకొని వున్న ప్రభుత్వాలదా! ఇదే మోహన్ రుషి ఆవేదన అంతర్లీనంగా వుంది.''నేతల్ని మించిన కళాకారులు వుండే అవకాశం లేదు!'' ఇంత కంటే గొప్ప సెటైర్ రాజకీయ వ్యవస్థ మీద వెయ్యగలమా. ఒక సామాజిక అంశాన్ని ఒక పేజీ వివరించినంతగా దాన్ని కుదించి ఒక వ్యాఖ్యలో చెప్పటం అనే కళ ''మైక్రో ఆర్టు'' ఈ వ్యాఖ్యకు ఎన్ని వివరణలు, ఉదాహరణలు అయినా ఇవ్వవచ్చు. రాజకీయ వ్యవస్థ మీద మరో సెటైర్ ''రాజ్యాంగేతర శక్తుల్ని రాజ్యాంగ శక్తులుగా మార్చడమే ప్రజాస్వామ్యం!'' ఇప్పుడున్న హిందూ భావజాలంతో కూడుకున్న రాజ్యాధికార వ్యవస్థ చేస్తున్న అన్ని చట్ట వ్యతిరేక దాడులమీద ఒక సెటైర్.

''బుద్ధి మంతుడిగా వుండడమంత బుద్ధి లేనితనం లేదు!'' ఈ దేశంలో బుద్ధిమంతుడు అంటే ఎవరు అనే ప్రశ్న ముందు వేసుకొంటే దీనికి అర్థం వస్తుంది. ఈ దేశంలో బుద్ధిమంతుడు కులం ఆధిపత్యాన్ని, మతం ఆధిపత్యాన్ని, జెండర్ వివక్షను ప్రశ్నించకుండా వుండేవాడు బుద్ధిమంతుడు అంటుంది. మన ప్రస్తుత కుల, మత, వర్గ, జెండర్ సమాజం. ఒక వేళ ప్రశ్నిస్తే సమాజం దృష్టిలో చెడిపోయినవాడు, సంప్రదాయ వ్యతిరేకి అంటుందీ ఈ సమాజం.ఇలా ఎన్ని వ్యాఖ్యలు తీసుకొని అయినా విశ్లేషించవచ్చు. మోహన్ రుషి ఈ రచనలు విమర్శ కోసమే రాయలేదు అనేది నా అభిప్రాయం. రచయిత తనకు కనపడిన సమాజాన్ని ప్రజలకు పరిచయం చేస్తూనే దాని అవలక్షణాలనుబట్ట బయలుచేసే క్రియ మొదలవుతుంది. ఈ పుస్తకం ఆధునిక సమాజ అవలక్షణాలతో పాటుగా దాని ఎంత వరకు వీలైతే అంత లోతుగా మన ముందుంచాడు. మన పని ఈ పుస్తకం చదివి ఎంత వరకు జ్ఞానాన్ని పెంచు కుంటామో అంత సూటిగా సమాజాన్ని, రాజ్యాన్ని, మనిషిలోని అవలక్షణాలను ప్రశ్నించగలం.

(ఈ పుస్తకం ఈ నెల 20న ఆవిష్కరిస్తారు)

షబ్నవీస్ బతికే ఉంటాడు...



నర్రా ప్రవీణ్ రెడ్డి
9393636405

చాలా మంది పుడుతుంటారు, చస్తూ ఉంటారు కొందరే చరిత్రలో నిలిచిపోతారు. భవిష్యత్తుకు మార్గదర్శకులవుతారు. అది వారు చేసే పనులను బట్టి నిర్ణయించబడుతుంది. తెలుగు సాహిత్యంలో కూడా అదే జరిగింది. జరుగుతూ ఉంది. నాటి నుండి నేటి వరకు చాలా తక్కువ మంది రచనాకారులే సాహితీ జగత్తు నేలారు. గొప్ప గొప్ప స్థానాలను అలంకరించారు. సాహిత్యానికి మెరుగులు దిద్ది మెరుపులా మెరిసారు. అలాంటి కొందరిలో షబ్నవీస్ వెంకట రామనర్సింహారావు గారొకరు. పోరుగడ్డ నల్లగొండలో 1896 సం॥లో జననం పొందిన ఆయన దేశాభివృద్ధికి, భాషాభివృద్ధికి విశేషకృషి సల్పారు. అందులో భాగంగానే తెలంగాణా వాదాన్ని నిలబెట్టడంలోను సమర్థులయ్యారు.



షబ్నవీస్ వెంకటరామనరసింహారావు

తొలుత విద్య అందరికి అందాలని సత్సంకల్పంతో 1918, మార్చి18న నల్లగొండలో ఆంధ్రసరస్వతి నిలయమనే గ్రంథాలయం స్థాపించారు. అలాగే తెలంగాణ చరిత్రలో మైలురాయిగా చెప్పుకునే సంఘటన నీలగిరి పత్రికాస్థాపన. తెలంగాణ వ్యాప్తంగా(నిజాం రాష్ట్రంలో) జరిగే జనసంఘం కార్యక్రమాలను మేధావులకు అందించే ప్రయత్నమే షబ్నవీస్‌గారి 'నీలగిరి' వారపత్రికాస్థాపన.

1922 ఆగస్టు 24న మాడపాటి హనుమంతరావు, టేకుమల్ల రంగారావు, అక్కినేపల్లి జానకిరామారావు వంటి వారి ప్రోత్సాహాలతో తెలంగాణ జాగృతే లక్ష్యంగా నీలగిరి వారపత్రికను షబ్నవీస్‌గారు స్థాపించి తెలంగాణ జాతి జనుల గుండెలను కదిలింపజేసే సమాచారాన్ని అందించారు. చైతన్యం దిశగా సాగారు. అందులో మచ్చుకు... 1926లో నిజాం ప్రాంత ప్రజలు వలసబోయిన ఆంధ్రులని పేర్కొంటూ ఏద్దూరి అన్నపూర్ణయ్య తీర్మానించారు. దాన్ని ఖండిస్తూ నీలగిరి పత్రిక చేసిన ఉద్యమం మరపురానిది మరచిపోనిది. ఇక ఒద్దిరాజు సోదరులు 'తెనుగు పత్రిక' ఆర్థిక ఇబ్బందులకు గురైనప్పుడు విరాళాలు సేకరించడంలో నీలగిరి పత్రిక యాజమాన్యం కృషిచేసి దయార్ద్ర హృదయతను చాటుకుంది. నిజాం వార్తలు, నీలగిరి గ్రంథాలయం, నవలా ప్రపంచం, తాళపత్ర గ్రంథాలు, వృత్తాంతాలు అలాగే హాస్యోక్తులతో సాగే 'కుప్పిలి పురాణం' శీర్షిక, కె.రాములు గారి 'బుద్ధుని సందేశం' శీర్షికలతో పాటు శేషాద్రి రమణకవులు, వెంకట రామానుజాచార్యులు, గంగుల శాయిరెడ్డి, కోదాటి రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావు వంటి వారి రచనలను అందించిన గొప్ప తెలంగాణ పత్రిక నీలగిరి. ఈ పత్రిక స్థాపన తర్వాతే తెనుగు, గోలకొండ వంటి పత్రికలు వెలువడ్డాయి. అలా పత్రికా రంగంలో కాక సమాచార ప్రసారంలో జనాదరణ పొందిన తొలి తెలంగాణ పత్రిక ఈ నీలగిరి.పత్రికలో సమాజానికి హితాన్ని చేకూరుస్తూనే 1921లో సంస్కారిణి గ్రంథమాలను, వీరేశలింగం కంఠాభరణం గ్రంథమాలను ఉస్మానియా ముద్రణాలయంను స్థాపించిన సాహిత్యోద్యమకారుడు షబ్నవీస్ గారు.

ఇందులో భాగంగా శేషాద్రి రమణకవులు మిత్రుడైన షబ్నవీస్ సతీవియోగం చెందినప్పుడు ఆమె స్మృత్యర్థం 'ఉదయ లక్ష్మి' (1923) శతకాన్ని ఆవిష్కరించారు. ఇక షబ్నవీస్ గారు రచించిన 'బాలికా విలాపం' (1921) నాటి దురాచారాలను ఎండగట్టి సంఘసంస్కరణ దిశగా సాగిన రచన అచ్చురూపం దాల్చింది. తర్వాత అనేక సాహితీ కార్యక్రమాలు చేపట్టారు షబ్నవీస్‌గారు.ఇంతటి ఘన చరిత్ర గలిగిన షబ్నవీస్ తెలంగాణలో తొలి పత్రికా స్థాపకుడిగా, సాహిత్యోద్యమ మూర్తిగా వెలుగొందిన వాడు షబ్నవీస్. ఆంధ్రుల పాలనలో ఎవరూ గుర్తుంచలేక పోయినా వారు ఈ మట్టిలో ఎప్పటికీ బతికే ఉంటారు. తక్కువ కాలం జీవించిన షబ్నవీస్ 1929న దివంగతులైనా చరిత్ర పుటల్లో, వ్యక్తుల హృదయాల్లో సజీవంగా బతికే ఉంటారు.

(తెలంగాణలో మొట్టమొదటి పత్రిక 'నీలగిరి' 1922 ఆగస్టు నెలలో ప్రారంభమైంది)

రుతు సంక్రమణం

మూలం: గోకుల దాస ప్రభు
అను: రంగనాథ రామచంద్రరావు
పుటలు: 115,
వెల రూ. 80/
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, (నాగోల్)
జి.యస్.ఐ.పోస్టు: హైదరాబాద్ 068



తెలుగు పత్రికలకు ఇంగ్లీష్ తెగులు



విశ్లేషణ : కె.ఎల్ రెడ్డి
పుటలు : 148
వెల రూ. 110/
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూ డ, (నాగోల్)
జి.యస్.ఐ.పోస్టు: హైదరాబాద్ 068

సుదర్శనం గారికి..

ఉత్తరాలు
సం॥ వసుంధరా దేవి
పుటలు: 192
వెల రూ. 150/
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్ ఆర్య సమాజ్ మందిర్ ఎదురుగా బడీ చౌడి, హైదరాబాద్



తెలుగు సమాజం - మార్క్సిజం

సం.ఎస్వీ సత్యనారాయణ
పుటలు: 92
వెల రూ. 75/
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, (నాగోల్)
జి.యస్.ఐ.పోస్టు: హైదరాబాద్ 068



సుందరి సుబ్రహ్మణ్యం

(రెండవ భాగము)
రచయితలు: సి.ఎన్. నాగేశ్వర రావు
సి.ఎన్. రాజకుమారి,
పుటలు 128
వెల రూ. 100/
ప్రతులకు:నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, (నాగోల్)
జి.యస్.ఐ.పోస్టు: హైదరాబాద్ 068



దిమాక్ ఖరాబ్ ఆవిష్కరణ

మోహన్ రుషి పుస్తకం దిమాక్ ఖరాబ్ ఆవిష్కరణ ఈ నెల 20న ఉదయం 10 గం.లకు మిర్యాలగూడలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో జరుగుతుంది. కట్టా శేఖర్ రెడ్డి, సుబ్బారావు, అంబటి సురేంద్ర రావు, గోరటి వెంకన్న, శంకర్ కార్టూనిస్ట్, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, పాండురంగారావు, పున్నా కృష్ణమూర్తి పాల్గొంటారు.

'అద్దంలో ఆభరణం' ఆవిష్కరణ

పెద్ద నోట్ల రద్దుపై వచ్చిన తొలి తెలుగు కవితా సంపుటి 'అద్దంలో ఆభరణం' ఆవిష్కరణ తేదీ 188 2017 శుక్రవారం సా.గం.6లకు హైదరాబాద్ రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కె.వి. రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సభలో నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. మామిడి హరికృష్ణ , పత్తిపాక మోహన్, కేతవరపు రాజ్యశ్రీ వక్తలుగా పాల్గొంటారు.

డా॥రాచపాళెంకు పురస్కారం

సెప్టెంబర్ 6న కాకినాడలో అద్దేపల్లి రామమోహన్ రావు పేరిట ఇచ్చే కవితా విమర్శ పేరిట ఇచ్చే పురస్కారాన్ని ప్రముఖ విమర్శకులు ఆం.ప్ర. అరసం అధ్యక్షులు డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డికి ఇస్తున్నారు. ఈ పురస్కారంలో పదివేల రూపాయల నగదు, మొమెంటో, శాలువా ప్రదానం చేస్తారు.

అనువాద కథల ఆవిష్కరణ

అనిల్ బత్తుల స్వేచ్ఛానువాదం చేసిన రష్యన్ జానపద కథానువాద సంపుటిని ప్రెస్‌క్లబ్, సోమాజిగూడ, హైదరాబాద్ నందు ఈ నెల 19న ఉ.గం॥ 10.30 లకు చిన్నారి, బబ్లు ఆవిష్కరిస్తారు. ఆర్టిస్టు మోహన్, కుమార్ కూనపరాజు, చైతన్య పింగళి అతిథులుగా పాల్గొంటారు.

వేయి మందితో కవి సమ్మేళనం

ప్రపంచ రికార్డు కవి సమ్మేళనం కరీంనగర్‌లో సెప్టెంబర్ 10వ తేదీన జరుగబోతుంది. ఒకే వేదికపై 1000 మంది కవులతో కార్యక్రమం ఉంటుంది. పాల్గొనే కవులకు బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్, శాలువా, మొమెంటో, ప్రశంసా పత్రం ఇస్తారు. టిఫిన్, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు.



కృష్ణం వందే జగద్గురుం



భద్రాద్రి రాముడి తమ్ముడు

ఈ భాగ్యనగర కృష్ణుడు

హైదరాబాద్‌కు 30కి.మీ. దూరంలో బీబీనగర్ మండలం మహదేవపురం గ్రామంలో పురాతన కృష్ణమందిరం ఉంది. 600ల సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర సాక్ష్యం పలుకుతోంది. 4ఎకరాల స్థలంలో 500 మీటర్ల పరిధిలో కాకతీయ రాజులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. ఈ గ్రామానికి చేరువలోని బొంతగుట్ట నుంచి ఆలయ నిర్మాణానికి రాళ్ళు సేకరించారని సమాచారం. ఈ నాటికీ బొంత గుట్టపై రాళ్ళు సేకరించిన ఆనవాళ్ళు కనబడతాయి. ఆ తర్వాతి కాలంలో నిజాం నవాబు తానీషా ఆస్థానంలో మంత్రులు, సేనాధిపతులుగా ఉన్న అక్కన్న, మాదన్నలు ఈ దేవాలయాన్ని దర్శించుకున్నారని, ఇక్కడ విడిది కూడా చేశారని చెబుతారు. అక్కన్న, మాదన్నలు ఈ గుట్ట కింద విశ్రాంతి తీసుకుంటూ ఉంటే స్వామి వారు కలలో కనిపించి తన ఆలయం రాళ్ళ గుట్టల్లో ఉందని చెబితే కృష్ణుని కోసం వెతికించి బాహ్యప్రపంచానికి అందించారని కథనం. ఆ విధంగా ఇందులో మహదేవుడు, పార్వతి అమ్మవారి ఆలయాలు కూడా ఉన్నాయి. ఈ దేవాలయాలకు అక్కన్న మాదన్న దేవాలయాలనే పేరు వచ్చిందట.


ఆలయంలో రుక్మిణి సత్యభామ సహితంగా వేణుగోపాలస్వామి ధ్వజస్థంభం ఉంది.

ఈ ఆలయాన్ని తిరిగి నిర్మిస్తున్న సమయంలోనే రామదాసు భద్రాచలంలో రామాలయ నిర్మాణానికి పూనుకుని తానాషా ఆగ్రహానికి గురై గోల్కొండకోటలో కారాగారం పాలయ్యాడు. విషయం తెలిసి అక్కన్న, మాదన్నలు హడావుడిగా వెళ్ళిపోవడంతో ఆలయ నిర్మాణం ఆగిపోయి అసంపూర్తిగా ఉండిపోయింది. భద్రాచల రామమందిరం, ఈ కృష్ణమందిరం ఒక్కసారే వెలుగులోకి వచ్చి జనాదరణ పొందాయి.

అంతర్, మధ్యమ, బాహ్య వలయంగా ఈ ఆలయం నిర్మించబడింది. ఈ ఆలయ ప్రాంగణంలో పెద్ద శివలింగం ఉంది. మధ్య ఆలయంలో గణపతి, కార్తికేయుడు, బలభద్రుడు, వీరభద్రుడు కొలువు తీరి ఉన్నారు. గణపతి తన రెండు కాళ్ళ మధ్యన బాన పొట్టను నేలకు సమాంతరంగా తాకించి దర్శనమిస్తుంటాడు. ఆలయం మధ్యలో సందీశ్వర విగ్రహం జీవకళతో దర్శనమిస్తుంది. ఇక మూడవ ఆలయం పార్వతీదేవి ఆలయం, నాలుగు చేతులతో అర్థపద్మాసనంతో దర్శనమిస్తుంది. మధ్య ఆలయంలోనే పురాతనమైన విఘ్నవినాయకుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలున్నాయి.

ఈ ప్రాంతానికి చెందిన వజీర్ నిషాబేగం అనే ముస్లిం

వేణుగోపాల స్వామి ఆలయం, ఘట్కేసర్



పూజలందుకుంటున్నాడు. శ్రీ చక్ర మండప అంతరాలయములో స్వామి చతుర్భుజుడు. విశ్వరూప ప్రదర్శన చేస్తూ దర్శనమిస్తాడు ఈ దేవాలయంలో 11 సార్లు ప్రదక్షిణ చేస్తే కోరిన కోరికలు తీరతాయని భక్తుల విశ్వాసం. కోరిక తీరినవారు ఆ తర్వాత ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేస్తారు. స్వామి సంతాన వేణుగోపాల స్వామిగా సుప్రసిద్ధుడు. ఆలయం ఆరుబయట దిమ్మపై 52 అడుగుల

మహిళ తన తండ్రి పాన్ దాన్ కింద ఇచ్చిన భూమిని ఆలయ నిర్వహణకు, నిత్య పూజాదికాలకు ఇచ్చిందని చెబుతారు. ఆనాటి నుండి ఈనాటి వరకు స్వామి వార్లకు నిరంతరాయంగా నిత్యపూజలు కొనసాగుతున్నాయి. వజీర్‌బేగం తర్వాత చింతల రామన్న కిష్టయ్య, ఆ తర్వాత బుందేల్‌ఖండ్ వంశస్థులు గంగసింగ్, రాంలాల్‌సింగ్ ఈ దేవాలయం బాగోగులు చూస్తున్నారు.

నేడు శ్రీకృష్ణాష్టమి



శ్యాం బాబా మందిరం, కాచిగూడ

ఎన్ని ఒడిదుడికులెదురైనా జీవితాన్ని ఒకే విధంగా తీసుకోవాలని చెప్పేది కృష్ణ తత్వం. బాలగోపాలుడిగా వెన్న దొంగిలించినా, నా అనుకున్నవారిని తన చిటికెనవేలు ఆసరాగా గోవర్ధనగిరి ఎత్తి ఆదుకున్నాడు బాలకృష్ణుడు. బృందావనమాలిగా మురళీగానలోలునిగా పదహారువేలమంది గోపికలను ఆకర్షించి, రాసకేళితో మురిపించడం ఆ చిలిపి కృష్ణునికే చెల్లింది. నరునికి రథసారథ్యం వహించి, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసిన వాడు కృష్ణుడు. "చేయాల్సిన పనిని చేసి ఫలితాన్ని నాకు వదలమని" ధీమాగా చెప్పిన కృష్ణుని చేయూతను ఆలంబనగా అందుకోనిదెవరు? మానవజాతికి గుణపాఠాలు నేర్పినందుకే దేశ విదేశాల్లో ప్రతి ఒక్కరు భక్తిపూర్వకంగా 'కృష్ణం వందే జగద్గురుం' అని ఆరాధిస్తున్నారు. ఆ పరమాత్మునికి వాడవాడలా గుళ్ళుకట్టి ఆరాధించే మహాభాగ్యం మన భాగ్యనగరానికి అబ్బింది. ఈ కృష్ణాలయాల్లో మనకు తెలిసినవి కొన్నైతే తెలియనివి మరెన్నో..! కృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాజధాని నగరంలో వెలిసిన కృష్ణమందిరాల గురించి తెలుసుకుందాం.

శ్యాం బాబా మందిరం, కాచిగూడ :

కంచికామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి, అనంత సరస్వతి స్వాములు 1996 ఏప్రిల్ 22న ఈ మందిరాన్ని ప్రారంభించారు. కాచీగూడా రైల్వే స్టేషన్ దగ్గర కొండపై 30,000 చదరపు అడుగుల స్థలంలో మూడు అంతస్థులుగా ఈ సువిశాల మందిరాన్ని నిర్మించారు. ప్రఖ్యాత గణపతి స్థపతి ఈ మందిరానికి బ్లూప్రింట్ అందించారు. భీమునికు మనుమడు, ఘటోత్కచుని కుమారుడు బర్బరీకుడు ఈ ఆలయంలో విగ్రహరూపంలో పూజలందు కుంటున్నాడు. బర్బరీకునికి ఇంకెక్కడా ఆలయం లేకపోవడంతో ఇది అరుదైన ఆలయంగా చరిత్రకెక్కింది. భవానీ మాత దయతో మూడు దివ్య అస్త్రాలను అందుకున్న బర్బరీకుడు బలహీన పక్షాన నిలబడి పోరాడతానని ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. తన మనసులో మాట కృష్ణుడికి చెబితే నీ కన్నా బలవంతుడైన వీరుని సంహరించమని సలహా ఇస్తాడు. ఎంత ఆలోచించినా ఇంకెవ్వరూ కనిపించకపోవడంతో బర్బరీకుడు తన తలను నరికి కృష్ణునికి అందిస్తాడు. అలా అంతమయిన బర్బరీకుడు కలియుగంలో శ్యాం బాబాగా అవతరించాడు. శ్యాం బాబా మందిర్ రాజస్తాన్‌లోని ఖాతు ఖాతాంక్‌లో ఉంది. ఆ తర్వాత ఒక్క మన హైదరాబాద్ లోని కాచిగూడాలోనే కనబడుతుంది. ఈ విధంగా శ్యాంబాబా ఆలయం అరుదైన ఆలయంగా ఖ్యాతి గడించింది.

జగన్నాథ మందిరం –బంజారాహిల్స్:

ఒరిస్సాలోని జగన్నాథ ఆలయానికి నమూనాగా బంజారాహిల్స్‌లో వెలసిన మందిరం జగన్నాథ మందిరం. పూరి జగన్నాథునికి రథోత్సవమైన రోజునే ఇక్కడా స్వామివారికి భారీ రథోత్సవం జరుగుతుంది. అబిడ్స్‌లోని ఇస్కాన్ టెంపుల్, సికింద్రాబాద్ ఇస్కాన్ మందిరం, అంబర్‌పేట గురువాయూర్ అప్ప మందిరం, బోల్లారంలో సంతాన గోపాలస్వామి మందిరం నిత్యం భక్తులతో కళకళలాడుతుంటాయి.

ఇవిగాక..

బంజారాహిల్స్ ఎన్‌బిటి నగర్‌లోని పురాతన కృష్ణమందిరం సికింద్రాబాద్ పాన్ బజార్‌లో గల కృష్ణమందిరం, లాల్ బజార్ కృష్ణమందిరం, జియాగూడలోని రంగనాథ మందిరం, మణికొండలోని వేణుగోపాల ఆలయం, నానక్‌రాంగూడలోని రంగనాథ ఆలయం, కొండాపూర్‌లోని భాగ్యనగర్ శ్రీ కృష్ణ మందిరం, మెహదీపట్నం మిలిటరీ ఏరియాలో కొలువుదీరిన వేణుగోపాల స్వామి మందిరం, ఆసిఫ్ నగర్‌లోని ఆళ్లబండ నారాయణ్ టెంపుల్, రెడ్ హిల్స్ కృష్ణ మందిరం, బేగంపేట స్ట్రీట్ నెంబర్ 3లోని రాధాకృష్ణ మందిరం పండుగ దినాలలో కన్నుల పండుగగా అమిత కోలాహలంగా ఉండి భక్తులు సందడి చేస్తుంటారు. నగరానికి చేరువలో ఏదులాబాద్‌లో ఆండాళమ్మ సన్నిధి పక్కనే ఒక కృష్ణమందిరం ఉంది. ఉప్పల్‌లోనూ ఒక కృష్ణభగవానుని మందిరం ఉంది. ఇలా నగరం ఏ మూలకు వెళ్ళినా కృష్ణమందిరాలు దర్శనమిస్తుంటాయి.

చిన్ని పాదాలు పెద్ద ఆకాంక్షలు

సనాతన భారతీయ ఆలోచనావిధానానికి దర్పణం ఇంటి ముందు చిన్నపిల్లవాడి పాదాలు దిద్దడం. ఇంట్లో చిన్నపిల్లలు ఉండాలని, గలగలలాడుతూ ఇల్లంతా కలయదిరగాలని, ముద్దులు గునుస్తూ మురిపాలు మూటకట్టాలని కోరుకునే అచ్చతెలుగు మనస్త్వానికి ఈ పాదాలు నిదర్శనాలు. ఇది వరలో జనాభా పెద్దగా లేని రోజులలో పిల్లలు ఎంత ఎక్కువ ఉంటే అంత మంచిదనే భావన ఉండేది. మొదటి సంతానంగా ఆడపిల్ల పుట్టాలని కోరుకునేవారు. ఆడపిల్లలు సౌమ్యంగా, సుతారంగా ఉంటారు, మాట వింటారు కనుక మొదటి సంతానం అమ్మాయి కావాలని కోరుకునేవారు. ఆడపిల్లలైతే అమ్మకు ఆసరా ఉంటారని, కొడుకైతే చేతికి అందివచ్చాక తండ్రికి చేదోడువాదోడుగా ఉంటాడని నమ్మేవారు. కొడుకు కావాలన్న కోరిక ఇప్పటికీ జనంలో బలంగా ఉంది. ఈ కోరిక ముదిరి ఆడపిల్లను చంపుకునే దౌర్భాగ్యం నేడు వచ్చి చేరింది. కానీ గతంలో పెద్దవాళ్ళు అలా భావించేవారు కారు. 'ఆడపిల్ల ఆడపిల్లేకానీ ఈడపిల్లకాదు' అన్న బాధ మనసులో ఉన్నా చిన్నచూపు చూడడం, ఎవరికో కట్టబెట్టేసి చేతులు దులిపేసుకోడం లాంటి కిరాతకపు పనులు చేసేవారుకారు. ఉన్నంతలో మంచి సంబంధం చేసేవారు. ఆడపిల్లనిచ్చేచోట అచ్చటా ముచ్చట బాగా జరగాలనే కోరికతో అత్తింటి గురించి పూర్తిగా ఆరాదీసి సేఫ్ హాండ్స్‌లో పెట్టేందుకు తహతహలాడేవారు. కోడలిని కూతురిలా చూసుకోవాలనే సెంటిమెంటు బలంగా ఉండేది. అత్త ఆడపిల్లకు మరో అమ్మలాంటిదని చెప్పేవారు. అందుకే అత్తను అత్తమ్మ అని పిలిచేవారు. ఆడపిల్లకు విద్యాబుద్ధులు చెప్పించి, వంటావార్పు నేర్పించి సభ్యతా సంప్రదాయాలు తెలియజేసి ఎంతో సంసారపక్షంగా తీర్చిదిద్దేవారు. పెళ్ళయ్యేనాటికే ఇల్లు తీర్చుకోగల చాతుర్యం అలవడేలా చేసేవారు. అత్తింట్లో ప్రవర్తన గురించి పదేపదే చెప్పి ఒక మైండ్‌సెట్ ఏర్పాటుచేశారు. పెద్దవాళ్ళకు ఓపిక ఉండగానే ఆడపిల్ల తల్లి అయితే అవసరమైన సహాయ సహకారాలు అందించి అమ్మాయి కాపురాన్ని నిలబెట్టడానికి అందుకే మన పండగల క్రమంలో వరలక్ష్మీ వ్రతం ముందుగా వస్తుంది. ఆ తర్వాత కృష్ణజన్మాష్టమి వస్తుంది.

కృష్ణజన్మాష్టమి రోజున బాలకృష్ణుని ఆరాధించేవారు. ఈ సందర్భంగా కృష్ణుడిలాంటి అల్లరిపిడుగు ఇంట్లో నడయాడాలని కోరుకునేవారు. బాలకృష్ణుడు రాక కోరుకుంటూ చిన్నపిల్లవాడి పాదాలు వేస్తారు. వీటిని బాలకృష్ణుడి పాదాలు అంటారు. చిన్నికృష్ణుడు అందగాడు, అల్లరివాడు, ఊరంతటికీ తలలో నాలుకలా ఉండేవాడు. అమ్మదగ్గర గోరుముద్దలు పట్టేయడం, ముద్దులు పెట్టేయడం కృష్ణుడి చేష్టలు.



అలాంటి పిల్లవాడు కావాలని ఎవరు కోరుకోరు? ఈ చిన్న కృష్ణుడు తర్వాతి రోజులలో చిలిపి కృష్ణుడిగా మారాడు. ప్రేమించిన యువతి రుక్మిణిని దక్కించుకోవడం కోసం ఆ రోజులలో జెమాజెట్టీలలాంటి రాజులతో ఘోరమైన పోరాటం చేశాడు. ఆ విధంగా కృష్ణుడు ప్రేమమూర్తిగా ఆదరణీయుడయ్యాడు. కొడుకు విషయంలో ఒక చిన్న భిన్నవాదం ఉన్నా మొత్తంగా చూచినపుడు మన పెద్దల అంతరంగం అర్థమవుతుంది. చిన్ని కృష్ణుడిలాంటి పిల్లవాడు ఇంట్లో ఉండి తాతయ్య, అమ్మమ్మలకు, నానమ్మలకు కనువిందుచేయాలని, రాముడిలాంటి కొడుకు ఉండి ఇంటిని జాగ్రత్తగా తీర్చిదిద్దాలని, అత్తమామలకు ఎదురుచెప్పని సీతమ్మలాంటి కోడలు కావాలని కోరుకునేవారు. ఇక శైవంవైపు చూస్తే వినాయకచవితి రోజు వినాయకుడి పాదాలు వేయడం అనే ఆనవాయితీ కనబడుతుంది. వినాయకుడు విఘ్ననివారకుడు. సిద్ధి, బుద్ధిదాయకుడు ఆయన ఇంట్లో ఉంటే ఏ ఇబ్బందీ ఉండదనే ఉద్దేశంతో ఆయనను ఆహ్వానిస్తూ వినాయక పాదాలు వేస్తారు. సిద్ధి, బుద్ధి వినాయకుడి భార్యలుగా అందరికీ తెలుసు. కానీ వినాయకుడికి లక్ష్మీ కూడా ఒక భార్యగా కనబడుతుంది. విష్ణుమూర్తి భార్యగా పేరున్న లక్ష్మీ దేవి వినాయకుడికి భార్య ఎలా అయింది? ఎప్పుడయింది? ఇలా ఒకే స్త్రీ ఇద్దరికీ భార్యగా ఉంటుందా? అలాంటి ఆమెను దేవత అని ఆలయం కట్టి మరీ ఆరాధిచడమా? అనే ప్రశ్నలు వస్తాయి. వినాయకుడు ఒకసారి లక్ష్మీ దేవిని చూసి లేచి నిలబడి రెండు చేతులూ చాచి రమ్మని పిలిచాడట. లక్ష్మీ దేవి కావాలని మంకుపట్టుపట్టిందట. చేసేదిలేక దేవతలు లక్ష్మి లాంటి మరో అమ్మాయిని సృష్టించి అందించారట. లక్ష్మి దక్కిందన్న ఆనందంతో ఆయన ఆమెను అపురూపంగా తన తొడపై కూచోబెట్టుకున్నాడట. అందుకని ఇంటి ముందు నిలబడి ఉన్న వినాయకుని నిలబెట్టాలని, లోపల లక్ష్మీ సహితుడైన వినాయకుని ఆరాధించాలని పెద్దలు చెబుతారు. అందువల్ల కార్యసిద్ధి, వికసించిన బుద్ధితో పాటు మంగళం కూడా జరుగుతుందని పెద్దలు చెబుతారు. ఈ దృష్టికోణానికి మరో రూపంగా వాణి, లక్ష్మి, గణనాయకులను ఆరాధించడం మొదలైంది. వాణి బుద్ధికి, లక్ష్మి సంపదకు, వినాయకుడు విఘ్ననివారణకు దోహదపడతారు. అందువల్ల చదువు, సంపద నిరాటంకంగా కలుగుతాయని భావిస్తారు.

కన్నయ్యకు ప్రసాదాలు

కృష్ణుడు వెన్నదొంగ.. పాలతో తయారుచేసిన పదార్థాలను అమితంగా ఇష్టపడతాడు. కృష్ణాష్టమి సందర్భంగా కన్నయ్యకు రకరకాల వంటకాలతో విందు చేయాల్సిందే. అటుకులు, బెల్లం, వెన్న, బెల్లం, పచ్చి శనగపప్పులతో సంతృప్తి చెందే తత్వం ఆయనది.



అటుకుల పల్లీ లడ్డు

కావాల్సినవి

అటుకులు ఒక కప్పు
పల్లీలు పావు కప్పు
చక్కెర అరకప్పు
నెయ్యి పావు కప్పు
వంట కర్పూరం చిటికెడు
యాలకుల పొడి పావు చెంచా
జీడిపప్పు కొన్ని

ఎలా చేయాలంటే

స్టవ్ మీద మూకుడు పెట్టి అటుకుల్ని వేయించాలి.
లేత గోధుమ రంగులోకి వచ్చాక తీసి ఒక పళ్లెంలో పెట్టుకోవాలి. అదే విధంగా పల్లీలనుకూడా దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. వేడి తగ్గాక పల్లీలు పొట్టుతీసి, మిక్సీలో పొడర్‌లా చేసుకోవాలి. తర్వాత అటుకుల్నీ, పంచదారను విడివిడిగా మిక్సీలో పొడి చేసుకోవాలి. ఇప్పుడు పల్లీలు, అటుకులు, చక్కెర పొడి, వంట కర్పూరం, యాలకుల పొడి, జీడిపప్పు పలుకులు ఓ గిన్నెలోకి తీసుకుని, బాగా కలపాలి. నెయ్యిని కరిగించి, కొద్ది కొద్దిగా ఇందులో వేసుకుంటూ లడ్డూలు తయారుచేయాలి.

ఫిర్నీ



కావాల్సిన పదార్థాలు

గంటపాటు నానబెట్టిన బియ్యం ఒక కప్పు
నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు వేసుకుని
పేస్ట్‌లాగా తయారుచేసుకోవాలి.
పాలు రెండు కప్పులు
కండెన్స్‌డ్ మిల్క్ ఒక కప్పు
యాలకుల పొడి అర టేబుల్ స్పూన్
రోస్ వాటర్ ఒక టేబుల్ స్పూన్
అలంకరణ కోసం బాదం పప్పులు

తయారీ విధానం

స్టవ్ మీద ప్యాన్ పెట్టుకుని అందులో రెండు కప్పుల పాలు పోయాలి. ఇందులో రైస్ పేస్ట్‌ను వేసి బాగా కలుపుతూనే ఉండాలి. స్టవ్ తక్కువ మంటలో పెట్టుకోవాలి. కలుపుతూనే ఉండాలి లేకుంటే అడుగంటి ఉండలు కట్టుకుంటుంది. కొంచెం గట్టి పడుతున్నప్పుడు కండెన్స్‌డ్ మిల్క్ ఒక కప్పు కలపాలి. రెండు నిముషాలు ఈ మిశ్రమాన్ని బాగా కలపాలి. దీంతో మిశ్రమం చిక్కగా అవుతుంది. ఇప్పుడు స్టవ్ ఆఫ్ చేసుకుని, యాలకుల పొడి, రోస్ వాటర్ యాడ్ చేసుకుని మరోసారి బాగా కలుపుకోవాలి. ఇదంతా తక్కువ మంటలోనే చేసుకోవాలి. ఇదంతా సెర్వింగ్ బౌల్‌లో వేసుకుని ఒక గంటపాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఫ్రీజర్‌లో పెట్టకూడదు. గంట తర్వాత బయటకు తీసి బాదం పప్పులు, రోజ్‌పెటల్స్‌తో అలంకరించుకోవాలి.

కర్నాటలో అమిత్ షా వ్యూహం పని చేయదు: సిద్ధరామయ్య



బెంగళూరు: కర్నాటకలో 2018లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం అసాధ్యమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందన్న అమిత్ షా వ్యూహాలు రాష్ట్రంలో పని చేయవన్నారు. అమిత్ షా యుపిలో పన్నిన వ్యూహాలు ఇక్కడ పని చేయవన్నారు. లౌకిక వాదం బలంగా ఉన్న కర్నాటలో సమాజాన్ని చీల్చేందుకు యత్నించడం అసాధ్యమని సిద్ధరామయ్య అన్నారు. ఆదివారం కలాబురిగిలో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇడి లేదా సిబిఐ ఎవరి ఇళ్లలోనైనా సోదాలు నిర్వహించవచ్చు. అయితే మతపరమైన చర్యలు, సమాజాన్ని విభజించడం కర్నాటకలో అసాధ్యమన్నారు. బసవన్న, కువెంపు, కనకదాస వంటి ప్రముఖులు ఈ భూమిలో సెక్యూలరిజం విత్తనాలు నాటారని, ఇప్పుడవి పెద్ద వృక్షాలుగా పెరిగాయన్నారు. పంజాబ్, గోవా, మణిపూర్‌లలో వారి వ్యూహాలు ఎందుకు పనిచేయలేదని ఆయన ప్రశ్నించారు. 224 అసెంబ్లీ సీట్లకు గానూ 150 సీట్ల గెలుస్తామని యెడ్యూరప్ప అనడం భ్రమ అన్నారు.



జీతాల పెంపు, పనివేళల్లో మార్పులు తదితర డిమాండ్లతో ఆదివారంనాడు సూరత్‌లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించిన రైల్ కార్మికులు

హిమాచల్ మృతుల్లో నార్కట్‌పల్లి వాసి!

నార్కట్‌పల్లి : హిమాచల్‌ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడి మృతిచెందిన వారిలో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఔరవాణీ గ్రామానికి చెందిన దుబ్బాక కొండల్‌రెడ్డి (45) ఉన్నట్లు గుర్తించారు. ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డికి చెందిన సుశి హైటెక్ సంస్థలో ఆయన గత 20 సంవత్సరాలుగా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సంస్థ పనుల నిమిత్తం బస్సులో ప్రయాణిస్తుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో కొండల్‌రెడ్డి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో ఉంటున్నారు.

ఉపన్యాసానికి సలహాలు కోరిన మోడీ

న్యూఢిల్లీ: తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగానికి ప్రధాని నరేంద్రమోడీ ప్రజల నుంచి సలహాలు స్వీకరిస్తున్నారు. విద్య, పరిశుభ్రత, పర్యావరణం, డిజిటలైజేషన్, బాలికల అక్షరాస్యతకు సంబంధించి అంశాలపై ఆయన అధిక సంఖ్యలో సలహాలు స్వీకరించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. జులై 30న 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడిన మోడీ ఆగస్టు 15న తానిచ్చే ప్రసంగానికి ఆలోచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. తాను ఒక వాయిద్యాన్ని మాత్రమేనని, 1.25 బిలియన్ల మంది దేశ ప్రజల అభిప్రాయాన్ని ఎర్ర కోట నుంచి ప్రతిధ్వనించనున్నట్లు ఆయన తెలిపారు.

చైనాకు యుద్ధంతో సమాధానం



ముంబై : సిక్కిం సెక్టార్‌లోని డోక్లాంలో చైనా, భారత్ మధ్య తలెత్తిన ప్రతిష్టంభనపై యోగా గురు రాందేవ్ బాబా ఘాటుగా స్పందించారు. కుక్క కాటుకు చెప్పుదెబ్బే సరైన సమాధానమని అన్నారు. చైనాకు శాంతిపై నమ్మకం లేదని, యుద్ధ పరిభాషనే అది ఇష్టపడుతోందని అన్నారు. ముంబైలో జరిగిన ప్రపంచ శాంతి, సామరస్య సదస్సులో రాందేవ్ బాబా తన సందేశాన్ని ఇచ్చారు. ఈ సదస్సులో ప్రముఖ టిబెట్ ఆధ్యాత్మిక వేత్త దలైలామా కూడా పాల్గొన్నారు. రాందేవ్ బాబా తన ప్రసంగంలో చైనా వైఖరిని ఎండగట్టారు. శాంతిపై చైనాకు నమ్మకం లేకపోవడం వల్లే దలైలామా ఇక్కడ ఉన్నారని, కుక్కకాటుకు చెప్పుదెబ్బ రీతిలో మనం వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. యోగా పరిభాషలో మనం మాట్లాడుతుంటే చైనాకు తలకెక్కడం లేదన్నారు. యుద్ధమంటూ కలవరిస్తోందంటూ ఎద్దేవా చేశారు. యోగా భాష అర్థం కాకుంటే చైనాకు అర్థమైన యుద్ధ పరిభాషలోనే మనం సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాందేవ్ బాబా అన్నారు.

పంటకు పన్నీరు

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు అన్ని జిల్లాల్లో సాగు చేస్తున్నారు. రైతులు ఇప్పటి వరకు 43.91 లక్షల ఎకరాలలో వేశారు. ఈ పంట కాస్త ఎదిగి, వానలు లేకపోవడంతో వాడిపోయింది. పూత దశలో ఇది రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేయగా చినుకుల సవ్వడితో మళ్లీ సాధారణ స్థితికి వచ్చింది. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాలో మొక్కజొన్న కూడా అధికంగా10.97 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. వర్షాభావ పరిస్థితులతో ఈ పంట ఇప్పటికే 30 శాతం పోయిందని, ఈ వానలతో మిగతా పంటకు మేలు చేకూరిందని రైతులు చెబుతున్నారు. ప ప్పు దినుసుల పంటలు కూడా ఫర్వాలేదు అనేస్థితికి వచ్చాయి. భారీ వర్షా లు కాకపోవడంతో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలోకి నీ రు చేరడం లేదు. దీంతో ఆయా పరిధిలో బోర్లు అంతగా పోయడం లేదని, ఇది వరి పంటకు నష్టం చేకూరుస్తుందని అన్నదాతలు చెబుతున్నారు.

పంటలు తేరుకున్నాయి : ప్రేమ్‌కుమార్, నిజామాబాద్, మాణిక్‌భండార్ గ్రామ రైతు –పంటల పని అయిపోయిందనుకున్నాం. దేవుడి దయతో చినుకులైనా పడుతున్నాయి. మెట్ట పంటలకు ఈ వానలే ఊపిరి. వరికి మాత్రం కష్టమైతది. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వస్తలేవు. బోర్లకు నీళ్లు ఇంకడం లేదు. వారం, పది దినాలు ఈ వానలతో పంటకు ఢోకా లేదు.

మిడ్ మానేరులోకి ఎల్లంపల్లి నీరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులో పడాలని ఆయన కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిని మంత్రి ఆదివారం నాడు జలసౌధలో సమీక్షించారు. ఈ ప్రాజెక్టు 7 పాత జిల్లా ల రైతుల జీవితాలతో ముడిపడి ఉందని మరోసారి గుర్తుచేశారు. ప్యాకేజి 6, 7, 8 పనులను ప్రతి వారం రెండు రోజుల పాటు సైట్‌లోనే ఉండి పరిశీలించాలని ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డిని మంత్రి ఆదేశించారు. నవంబరు చివరినాటికి ఎలక్ట్రికల్, మెకానికల్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. నవంబరు నాటికి ప్యాకేజీ 6, 7, 8 పనుల్లో పంపుహౌజ్, టన్నెల్, ఇతర నిర్మాణాలు పూర్తికావాలని గడువును నిర్దేశించారు. డిసెంబరు నాటికి సర్జ్‌పూల్ పనులు పూర్తిచేసి డ్రైరన్ నిర్వహించాలని సూచించారు. ఆయా ప్యాకేజీలకు సంబంధించిన టన్నెల్, కెనాల్స్ లైనింగ్ పనులు అక్టోబరు, నవంబరు నాటికి పూర్తిచేయాలన్నారు. మేడారం రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని, రైతులకు పం ట పరిహారం ఇవ్వాలని, క్రాప్ హాలిడేకు సంబంధించిన ఫైలును వెంటనే క్లియ ర్ చేయాలని సాగునీటిశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌కు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ఇరిగేషన్ ఇఎన్‌సి సి.మురళీధర్, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, భూసేకరణ సలహాదారు జి.మనోహర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట పురస్కారాలు







మన తెలంగాణ/హైదరాబాద్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో ఉత్తమమైన ప్రతిభ కనబర్చిన వారి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర పోలీసు శాఖలో ఉన్నతాధికారులు అంజని కుమార్, రాజీవ్ రతన్, ఎన్.సూర్యనారాయణ, ఎం.శివప్రసాద్‌లకు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్స్ అందజేయనున్నారు. పలు విభాగాలలో అవార్డుకు ఎంపికైన వారికి గోల్కొండ కోటపై 15వ తేదీన జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో సిఎం సన్మానించనున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సాంస్కృతిక శాఖ : సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, భాష్యం విజయసారథి

తెలంగాణ స్టేట్ ఇన్సెటివ్ అవార్డులు : డాక్టర్ జె.రమేష్, డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఆర్మూర్, నిజామాబాద్.

గ్రూప్ 1: డాక్టర్ సి.హెచ్.మధుసూదన్, అసోసియేట్ ప్రొఫెసర్, ఉస్మానియా మెడికల్ కాలేజ్, సురేష్ బాబు, డిపిఒ సిద్దిపేట్, పి.డబ్ల్యూ.జాన్సన్, డిఆర్‌డిఒ, వికారాబాద్.

గ్రూప్ 2: ఖాన్‌పూర్ చంద్రకళ, ఆర్‌డిఒ, హైదరాబాద్, జి.విశ్వనాథం గుప్త, ప్రధానోపాధ్యాయులు, రంగారెడ్డి, రమీజుద్దీన్ అహ్మద్, మండల్ ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్, పెద్దపల్లి

గ్రూప్ 3 : ఎం.జయమ్మ, స్టాఫ్ నర్స్, మహబూబ్‌నగర్, కె.ప్రకాశ్, పంచాయత్ సెక్రటరీ, వరంగల్ రూరల్, డి.శంకర్‌కుమార్ పిఎ టు సిపిఆర్ఒ, ఐ అండ్ పిఆర్

గ్రూప్ 4 : బి.దసరథ్, సైకిల్ ఆర్డర్లీ, ఉమెన్ అండ్ సిడి, కె.గంగయ్య, ఆఫీస్ సబార్డినేట్, కామారెడ్డి, కె.కిష్టయ్య, ఆఫీస్ సబార్డినేట్, యాదాద్రి.

పోలీసు శాఖ(ఐపిఎం అవార్డులు) : టి.శరత్ బాబు(అడిషనల్ ఎస్పీ,సిఐడి, హైదరాబాద్), నీగగిరి దివ్య చరణ్ రావు(అడిషనల్ డిసిపి, ట్రాఫిక్, సైబరాబాద్), టి.సుదర్శన్(డిఎస్‌పి, ఎసిబి, కరీంనగర్), ఉప్పు తిరుపతి(ఎసిపి, మహంకాలి పిఎస్, హైదరాబాద్), మాదాడి రమణకుమార్(ఎసిపి మాదాపూర్, సైబరాబాద్), శావలి ప్రేమ్‌రాజ్(ఎఎస్ఐ, కమ్యునికేషన్స్, ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్), మాడంచెల్లి వెంకట్‌రావు(ఆర్ఐ,ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్), పట్టోళ్ల మధుసూదర్‌రెడ్డి(ఎస్ఐ, ఎస్ఐబి, ఇంటెలిజెన్స్ సెల్, హైదరాబాద్), సయ్యద్ యూసుఫుద్దీన్(ఆర్ఎస్ఐ, డిపిటిసి, నల్గొండ), గజ్జెల లక్ష్మయ్య(హెచ్‌సి, ఎస్‌బి, హైదరాబాద్), అన్ను దామోదర్‌రెడ్డి(హెచ్‌సి, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్, హైదరాబాద్), సిద్దా సదానందం(ఎఆర్‌పిసి, డిఎఆర్ వరంగల్), డి.సిద్దయ్య(ఎస్ఐ, పోస్తుమౌస్లీ), సి.నాగరాజు(పిసి, పోస్తుమౌస్లీ), ఎండి యూసుఫ్ అలీ ఖాన్(లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్ స్టేషన్ లంగర్‌హౌస్, హైదరాబాద్), కె.వెంకట్‌రెడ్డి (లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్ స్టేషన్ సాలార్ జంగ్ మ్యూజియం, హైదరాబాద్), కె.శ్రీశైలం(లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్ స్టేషన్ మాదాపూర్, హైదరాబాద్), ఎండి యాసిన్(లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్ స్టేషన్ మలక్‌పేట్,హైదరాబాద్), బి.మల్లేయ్య((లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్ స్టేషన్ కరీంనగర్), వి.ఈదయ్య((లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్ స్టేషన్, నల్గొండ), కె.శంకరయ్య(లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్ స్టేషన్ నారాయణపేట్,మహబూబ్‌నగర్).

హరిత మిత్ర : వై.శేఖర్‌రెడ్డి(వరంగల్), పెద్ది సుదర్శన్‌రెడ్డి(వరంగల్), సి.శ్రీధర్‌రావు(సిద్దిపేట్), ఎంపిపిఎస్, మూరపల్లి, జగిత్యాల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్, జనరల్ మేనేజర్ ఎస్‌సిసిఎల్, రామగుండం1 ఏరియా, పెద్దపల్లి.

స్పెషల్ వర్కర్ అండ్ స్పోర్ట్స్ అండ్ గైడ్స్ : పి.బసనాథ్ రెడ్డి(సోషల్ వర్కర్, గల్ఫ్ ఇష్యూస్, నిజామాబాద్), జి.పరమేశ్వర్, (ఎస్ఒసి(ఎస్), స్టేట్ హెడ్ క్వార్టర్, హైదరాబాద్), జి.లక్ష్మి నారాయణ(వైస్ ప్రెసిడెంట్, కరీంనగర్), ఎం.రాజగోపాల్(స్టేట్ ట్రెజరర్, స్టేట్ హెడ్ క్వార్టర్, హైదరాబాద్), ఎ.సుగుణ రాజేంద్రం(ఎస్‌టిసి(జి), స్టేట్ హెడ్ క్వార్టర్, హైదరాబాద్), టి.వెంకటలక్ష్మి, మహబూబ్‌నగర్.

పాఠశాల విద్యాశాఖ : తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్(గర్ల్స్),(తాటిపల్లి, మల్యాల్ మండల్, జగిత్యాల్), జెడ్పీ హై స్కూల్(మిర్దపల్లి, ఆర్మూర్ మండల్, నిజాబాబాద్)

ఐటిఐఆర్ నిధుల విడుదలకు చర్యలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఐటిఐఆర్ పై కేంద్ర ఐటి శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్‌కు రాష్ట్ర ఐటి మంత్రి కెటిఆర్ ఆదివారం లేఖ రాశారు. ఐటిఐఆర్ ప్రాజెక్టుకు నిధుల విడుదలపై జరుగుతున్న అపార జాప్యం గురించి ఆ లేఖలో ప్రస్తావించారు. 2013 సెప్టెంబర్‌లో ప్రతిష్టాత్మక ఐటిఐఆర్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతిచ్చినా.. ఇప్పటి వరకు నామమాత్రపు నిధులనే విడుదల చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఐటిఐఆర్ ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఆసక్తి రేకెత్తించిందని చెప్పారు. అయితే గత నాల్గు సంవత్సరాలలో కేంద్రం నుండి సరైన మద్దతు లేక పోవడంతో ఐటిఐఆర్ ప్రాజెక్టు ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. కేంద్రానికి ఈ ప్రాజెక్టు పట్ల స్పష్టత లేక పోవడం వల్ల అనేక అనుమానాలు నెలకొన్నాయని, వీటి వల్ల గందరగోళం తలెత్తిందన్నారు. ఐటిఐఆర్ ప్రాజెక్టుపై విధాన పరమైన స్పష్టత ఇవ్వడంలో పాటు ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా నాలుగేళ్ల కిందట అనుమతించిన నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని మంత్రి కెటిఆర్ కోరారు. ఐటి అనుబంధ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు 2008లో కేంద్రం వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఐటిఐఆర్‌లను మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుందని కెటిఆర్ గుర్తు చేశారు. ఈ విధానపరమైన నిర్ణయం మేరకు మౌళిక వసతుల కల్పనను అవసరమైన వయబిలిటి గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ఐటిఐఆర్ ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్‌లోని 202 చ.కి.మీ పరిధిలో ఐటిఐఆర్ చేపట్టాలని తెలంగాణ ఐటి శాఖ 2010లో ప్రతిపాదనలు ఇచ్చిన విషయాన్ని కెటిఆర్ తన లేఖలో గుర్తు చేశారు. ఈ మేరకు అప్పటి కేంద్ర ప్రభుత్వం ఐటిఐఆర్‌ను మంజూరు చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐటిఐఆర్ డిపిఆర్ రెండు సార్లు కేంద్రానికి సమర్పించామని చెప్పారు. ఈ మేరకు మౌళిక సదుపాయాల కల్పన కోసం రూ.4,863 కోట్లను రెండు దశల్లో సహాయం చేయాలని ఐటిశాఖ కోరినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి రూ. 3,275 కోట్లను రెండు దశల్లో సహాయం చేయాలని ఐటిశాఖ కోరినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి రూ. 3,275 కోట్లను (మొదటి దశ రూ. 165 కోట్లు, రెండో దశ రూ. 3,10 కోట్లు) మంజూరు చేశారని పేర్కొన్నారు. అయితే ఇప్పటికే అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పూర్తి స్థాయి నిధుల విడుదల మాత్రం జరుగలేదన్నారు. తాను కూడా స్వయంగా కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్‌ను కలిసి ఐటిఐఆర్‌కు సహకరించాల్సిందిగా కోరానన్నారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో ఐటి, అనుబంధ రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని మంత్రి కెటిఆర్ లేఖలో ప్రస్తావించారు. తెలంగాణ ఐటి ఎగుమతులు జాతీయ సగటు కన్నా అధికంగా ఉన్నాయని తెలిపారు. 201617లో సంవత్సరానికి జాతీయ సగటు కన్నా నాల్గు శాతం ఐటి ఎగుమతులను తెలంగాణ రాష్ట్రం చేసిందని వెల్లడించారు. దీంతో పాటు గత మూడేళ్లలో ఐటి రంగంలో ప్రత్యక్ష ఉపాధి 3,23,396 నుండి 4,31,891కి పెరిగిందన్నారు. దేశంలో అతిపెద్ద ఇంక్యుబేటర్ టి హబ్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు.

వరదల్లో మరో 10 మంది మృతి

గువాహటి: అసోంలో భారీ వర్షాలతో వరదలు సంభవించి ఆదివారం మరో 10 మంది మృతి చెందారు. 21 జిల్లాలో 22.5 లక్షల మందిపై వరద ప్రభావం తీవ్రంగా పడింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఆదివారం పర్యటించారు. వరదల్లో తీవ్రంగా నష్టపోయిన అసోంను అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి సర్బానంద సోనేవాల్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీఇచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అసోంలో వరదలు సృష్టించిన బీభత్సం, ఎన్‌హెచ్ 37 వరద నీటిలో మునిగిపోవడంతోట్రాఫిక్‌కు అంతరాయం కలిగినట్లు సోనేవాల్ మోడీకి వివరించారని ఆ ప్రకటన పేర్కొంది. ఆర్మీ, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ ఎఫ్ బలగాలు సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.






పోలీసు భూచోళ్లు

(మొదటిపేజీ తరువాయి)


వ్యక్తం చేసిన సందీప్ శాండిల్య ఈ ఉదంతంపై విచారణ జరపాలని మాదాపూర్ ఎసిపి రమణకుమార్‌ను ఆదేశించారు. సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో నలుగురు పోలీసు అధికారులపై కేసు నమోదు చేశారు. ఎసిపి అందించే నివేదిక ఆధారంగా నలుగురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని సందీప్ శాండిల్య తెలిపారు.

కశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)



ముగ్గురు గాయపడ్డారని పోలీసులు ఆదివారం వెల్లడించారు. 'సోపియాన్ జిల్లాలోని జైనాపోరాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు' అని డిజిపి, ఎస్‌పి వాయిద్ పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. హతమైన ఉగ్రవాదుల గుర్తింపుతో పాటు వారు ఏ సంస్థకు చెందిన వారన్న సంగతిని నిర్ధారించాల్సి ఉందని ఆయన అన్నారు. జైనాపోరా ప్రాంతంలోని అవ్‌నీరా గ్రా మంలో ఉగ్రవాదుల ఉనికికి సంబంధించి నిఘా వర్గాలు అందించిన సమాచా రం మేరకు భద్రతా దళాలు శనివారం రాత్రి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్ర తా దళాలపై ఉగ్రవాదులు తొలుత కాల్పులకు తెగబడ్డారు. దాంతో వారు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో గాయపడిన ఐదుగురు జవాన్లను చికిత్స నిమిత్తం 92 బేస్ హాస్పిటల్‌కు తరలించారు. వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. కాల్పుల ప్రక్రియను ఆపివేసినప్పటికీ, ఉగ్రవాదులు పారిపోకుం డా భద్రతా దళాలు గాలింపు చర్యలను కొనసాగించాయని ఆయన చెప్పారు. ఎట్టకేలకు ఆదివారం తెల్లవారుజామున కాల్పులను తిరిగి ప్రారంభించిన భద్ర తా దళాలు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయని ఒక భద్రతా ప్రతినిధి తెలిపారు. వీరమరణం పొందిన ఇద్దరు జవాన్లను ఇళయరాజా పి (తమిళనాడు), గవాయ్ సుమేధ్ వామన్ (మహారాష్ట్ర)గా గుర్తించామని ఆయన చెప్పారు.



కలవని కాల్స్

(మొదటిపేజీ తరువాయి)

ఫోన్ రింగ్ కావడం లేదు. సెల్యూలార్ సంస్థ నెట్ వర్క్ పని చేయడం లేదన్న విషయం రమేష్‌కు కొంత ఆలస్యంగానైనా అర్థమైంది. ఇలాంటి ఘటనలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా కోకొల్లలు.. రిలయన్స్ జియో మొబైల్ సేవల్లోకి వచ్చాక టెలికాం ఆపరేటర్ల మధ్య పోటీ తారా స్థాయికి చేరింది. ''అన్ లిమిటెడ్ డేటా.. అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్..నైట్ కాల్స్ ఫ్రీ'' అంటూ వివిధ టెలికామ్ సంస్థలు వినియోగదారులను తమ బుట్టలో వేసుకునేందుకు పోటీ పడుతున్నాయి. మూడు నెలలకు రూ.300 కట్టండి ఉచితంగా అన్ని సేవలను ఎంజాయ్ చేయండి అంటూ ఒక్కో సంస్థ అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, డాటా, ఫ్రీ నైట్ కాలింగ్ అంటూ వినియోగదారులను మాయ చేస్తున్నాయి. సదరు కంపెనీల ప్రకటనలను చూసి ఆకర్షితుడవుతున్న వినియోగదారులు ఆ ప్యాకేజీల్లో చేరాక అసలు విషయం తెలిసి బిత్తర పోతున్నారు. మొబైల్ ఆపరేటర్లు ఎంత సేపూ లాభాలపై ధ్యాసే తప్ప, ఆఫర్ల ప్రకటనలతో కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్న వినియోగదారులకు సర్వీసును ఎలా అందించాలన్న కనీస ప్రమాణాలను కూడా పాటించడం లేదని వినియోగదారులు జియో, ఐడియా, ఎయిర్‌టెల్, ఎయిర్‌సెల్ టెలినార్ టాటా డోకోమో సహా ఇతర అన్ని ప్రైవేటు రంగ సంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నెల వారీ ప్యాకేజీలున్నప్పుడు ఉన్న వినియోగదారుల సంఖ్య కంటే ఇప్పుడు రెండింతలు, మూడింతలు పెరిగారు. వినియోగదారుల సంఖ్యను పెంచుకునేందుకు చూపిస్తున్న శ్రద్ధ సేవలందించడం పట్ల చూపడం లేదని విమర్శిస్తున్నారు. నెట్‌వర్క్, కాల్ డ్రాప్ సమస్యలను పట్టించుకోవడం లేదంటున్నారు.

ప్యాకేజీలు సరే..పెరిగిన వినియోగదారులకు నెట్‌వర్క్ ఏది?

వినియోగదారుల అవసరాలకు ఏమూలకూ సరిపోని సెల్ టవర్ల నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. కరెంటు పోతే జనరేటర్ల సాయంతో అయినా నెట్‌వర్క్ పనిచేసేందుకు చర్యలు తీసుకోవాలి. పట్టణ ప్రాంతాల పరిస్థితి కాస్త అటూ ఇటూగా ఉన్నా... గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య ఉంటే నెట్‌వర్క్ పరిస్థితి అంతే సంగతులని వినియోగదారులు వాపోతున్నారు. రాజధాని హైదరాబాద్ నగరంలోనూ సిగ్నల్స్ సమస్య భారీగానే ఉంది. నానక్‌రామ్‌గూడకు చెందిన ఒక వినియోగదారుడు 'మన తెలంగాణ'తో మాట్లాడుతూ ఫోన్‌లో మాట్లాడాలంటే ఇళ్లలోంచి బయటికి రావాల్సిందే.. ఇంట్లో ఉంటే సిగ్నల్స్ అందవు అని చెప్పారు. అంబర్‌పేట, రామంతాపూర్, సికింద్రాబాద్ ఇలా ఒకటి కాదు రెండు కాదు అన్ని ప్రాంతాల్లోనూ సిగ్నల్స్ సమస్య వినియోగదారులను ఇబ్బంది పెడుతోంది. మొబైల్ ఆన్ చేసి ఉన్నప్పటికీ ''మీరు కాల్ చేసిన నంబర్ ప్రస్తుతం తమ నెట్‌వర్క్ పరిధిలో లేదు. లేదా స్విచ్చాఫ్ చేసి ఉంది'' అని కాల్ చేసిన వినియోగదారులకు ఐవిఆర్ఎస్ సందేశాలందుతుండడం, కొద్ది సేపటి తరువాత సదురు వినియోగదారునికి ''యు హేవ్ మిస్డ్ కాల్'' అని ఎస్ఎంఎస్ అని వస్తుండడం గమనార్హం.

కాంగ్రెస్ మిషన్ - 2019

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని, అందులో భాగంగా సెప్టెంబర్ 30లోగా బూత్, గ్రామ, డివిజన్, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని, అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రాహుల్ సందేశ్ యాత్రలు, త్వరలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. వారంలోగా జిల్లా స్థాయి వరకు సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమించేందుకు కసరత్తులు ప్రాంరభించాలని తీర్మానించింది. పార్టీలో రిసెర్చ్, ఎనాలసిస్ సాంస్కృతిక విభాగాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. మరోవైపు నిత్యావసర వస్తువుల సరఫరాపై ప్రభుత్వ వైఫల్యంతో పాటు ఇతర సమస్యలపై నిరసన కార్యక్రమాలను చేపట్టాలని టిపిసిసి నిర్ణయం తీసుకుంది. సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల గుజరాత్‌లో ఎఐసిసి ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీపై బిజెపి గుండాల దాడిని ఖండించారు. జెడ్ కేటగిరి ఉన్న జాతీయ నాయకుడిపైనే దాడి జరిగితే దేశంలో పాలన ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆక్సిజన్ అందక దాదాపు 60 మంది పసి పిల్లలు మృత్యువాత పడడం పట్ల అక్కడి పాలకుల వైఖరిని ఖండిస్తూ సంతాపం వ్యక్తం చేశారు. ఇసుక మాఫియా ముసుగులో లారీల ఆగడాలతో ప్రమాదాల్లో మరణించిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. దళితులు, బిసిలు, ఇతర వర్గాల ప్రజలను అక్రమంగా నిర్బంధించి పాశవికంగా హింసించిన అంశాన్ని తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ సమావేశం నిర్ణయాలను వెల్లడించారు. నేరేళ్ళలో దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని రాజ్య హింసగా భావిస్తున్నామన్నారు. థర్డ్ డిగ్రీ జరిపిన పోలీసులపై చర్యలు తీసుకునేంతవరకు, బాధితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటూ పోరాడుతుందన్నారు. భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, నష్టపరిహారాన్ని కల్పించేందుకు ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవన్ మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకొని ప్రధానమైన కేసులను నీరు గారుస్తుందని, మియాపూర్ భూ కుంభ్కోణం, డ్రగ్స్ మాఫియా, నయీం కేసులు, ఇసుక మాఫియాలపై సిబిఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిధులు, నీళ్లు, నియమకాలని నినదించిన టిఆర్ఎస్ ఇప్పుడు ఆ నినాదాన్ని నీరుగారుస్తున్నదన్నారు. రైతును రాజును చేస్తానన్న ప్రభుత్వం బిచ్చగాళ్లుగా మార్చిందని విమర్శించారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ పెరగలేదు కానీ టిఎస్‌పిఎస్‌సి సభ్యుల జీతాలు మాత్రం పెరిగాయన్నారు. రాష్ట్రాన్ని పాలించమని కెసిఆర్‌ను ప్రజలు సిఎంగా ఎన్నుకుంటే ఆయన సచివాలయానికి రాకుండా ఇంజనీర్ అవతారమెత్తారని ఆయన ఎద్దేవా చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి అడ్డగా మారిందని, సాగునీటి ప్రాజెక్టుల రిడిజైన్ తదితర పేర్లతో దోపిడీ చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

3 నెలలకోసారి బహిరంగ సభలు

ప్రతి 3 నెలలకోసారి బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా పార్టీని క్రియాశీలంగా ఉంచాలని సూచించినట్లు టిపిసిసి సీనియర్ నాయకులు అనంతరం మీడియాతో చెప్పారు. డిసెంబర్ లేదా జనవరి నెలలో 5 లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగులతో విద్యార్థి గర్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని, దానికి రాహుల్ గాంధీని ఆహ్వానించాలని సూచించనట్లు తెలిపారు. రైతు గర్జన పేరుతో వరంగల్‌లో సభ ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.



తెలంగాణ సాహిత్య అభివృద్ధికి కృషి : ఎంపి కవిత

మన తెలంగాణ/బాసర : బాసర క్షేత్రంలోని జిల్లా కేంద్రంలోని సుదూర ప్రాంతాల నుండి వచ్చిన కవులు, తమ తమ కవిత్వాల పరంపర వినిపించడంతో బాసర క్షేత్రం కవిత్వాలతో మారుమోగింది. బాసర అమ్మ వారి క్షేత్రంలోని ఆదివారం ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కవి సమ్మేళనంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వ కుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో భాగంగా భాష అభివృద్ధికి చాలా ప్రాముఖ్యత అసవరమన్నారు. మన సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లి సెప్టెంబర్ వరకు వివిధ కవులు, కళాకారులను గుర్తించి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. తెలంగాణ సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కవులు, కవియిత్రుల నుండి ప్రత్యేక కవిత్వాలను సేకరించి, వారిని ఎంపిక చేసి సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో ప్రత్యేక కార్య క్రమం నిర్వహిస్తా మన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 80 మంది కవులు, కళాకారులు తెలంగాణ యాసభాషలో వాణిని వినిపించారు. వారికి తెలంగాణ జాగృతి తర పున ముథోల్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి, జాగృతి ఆధ్వర్యంలో శాలువా, మెమోంటో, ప్రశంస పత్రాన్ని బహూకరిం చారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిద్ధారెడ్డి, తెలంగాణ రచయిత సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్‌లు పాల్గొన్నారు.

కరీంనగర్ రెనె ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి లక్ష్మారెడ్డి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి

మన తెలంగాణ/కరీంనగర్‌టౌన్: కరీంనగర్ జిల్లా కేంద్రంలో అంత ర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన రెనె ఆసుపత్రిని ఆదివారం వైద్య, ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి, మంత్రులు ఈటెల రాజేందర్, జోగు రామన్నలతో కలిసి ప్రారంభించారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ లోని ఆసుపత్రిలకు దీటుగా అత్యాధునిక సౌకర్యాలతో రెనె ఆసుపత్రిని నిర్మించడం అభినంద నీయమన్నారు. అనంతరం రెనె ఆసుపత్రి చైర్మన్ బంగారి స్వామిని అభి నందించారు కరీంనగర్ ఎంపి వినోద్‌కుమార్, ఎంఎల్‌ఎలు గంగుల కమలాకర్, పుట్ట మధు, విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మ ణ్ రావు, ఎంఎల్‌ఎ బొడిగే శోభ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, రెనె ఆసుపత్రి చైర్మన్ బంగారి స్వామి, రెనె ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ బంగారి రజని ప్రియదర్శిని, ఆసుపత్రి సిఇఒ రేగులపటి మహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతోంది

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న చాడ

మనతెలంగాణ/హుజూరాబాద్ టౌన్: రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతుందని, ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి కెసిఆర్ ఆరోపణలు చేయడమే తప్ప అభివృద్ధికి పూనుకోవడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ నడుస్తుందని తెలిపారు. కోదండరాం అరెస్టు సరికాదని, ప్రతిపక్షాలపై మాత్రమే కేసులు వేయడం, ప్రజాస్వామ్య ఉనికిని దెబ్బతీసే కుట్ర పూరితమైన చర్య అని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు సభలను నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. తెలంగాణలో ఆర్థిక, బ్యాంకింగ్ అధికారులతో చర్చలు జరిపితే రూ. 24 వేల కోట్ల రుణాలు ఇ వ్వాలని నిర్ణయించగా ఇప్పటి వరకు రూ. 11 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని సగానికి కూడా రైతులకు రుణమాఫీ చే యకపోవడం ఏమిటన్నారు. ఇదే విధమైన వైఖరితో ముందుకెళ్తే రాష్ట్రంలో రానున్న రోజుల్లో అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏకమై ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి కో మటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జగిత్యాల జిల్లా కార్యదర్శి బోయిన అశోక్, వరంగల్ అర్బన్ సహాయ కార్యదర్శి కర్రె బిక్షపతి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మారుపాక అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

సిపిఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ



మాట్లాడుతున్న పశ్యపద్మ

మన తెలంగాణ/కంఠేశ్వర్ (నిజామాబాద్ జిల్లా): అరెస్టులతో ముఖ్యమంత్రి కెసిఆర్ ఉద్యమాలను ఆపలేరని సిపిఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ అన్నారు. స్థానిక క్లాత్ భవన్‌లో సిపిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమర వీరుల స్ఫూర్తి యాత్ర కోదండరాం నాయకత్వాన జిల్లాలకు వెళితే కెసిఆర్, టిఆర్ఎస్ వారు ఎందుకు భయపడుతున్నారని, సిపిఐ, ఇతర రాజకీయ ప్రజ, విద్యార్థి సంఘాల నాయకులను ఎందుకు అరెస్టులు చేస్తున్నారని ప్రశ్నించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కంజర భూమయ్య, నాయకులు ఎండి హుస్సేన్, పి.సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.బోసుబాబు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకు వదలం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ప్రసంగిస్తున్న తమ్మినేని

మన తెలంగాణ/సంగారెడ్డి టౌన్ : కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిఆర్ఎస్ సర్కార్‌లు ఎన్నికల హామీలను అమలు చేసే వరకు వేటకుక్కల్లా వెంటాడుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనీ వీరభద్రం అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన టి మాస్ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం టి మాస్ ఫోరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ తనదైన శైలిలో పాటలు పాడి టిఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ విశ్వేశ్వ రయ్య, దళిత సంఘాల నాయకుడు రాజు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బీరయ్య యాదవ్, సిపిఎం నాయకులు రాజయ్య పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న బియ్యం లారీ

మన తెలంగాణ/చెన్నారావుపేట : వరంగల్ రూరల్, చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామ శివారు జీడిగడ్డతండా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు స్థానిక ఎస్ఐ జగదీష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లి నుండి వరంగల్‌కు వెళుతున్న లారీ అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా 102 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. కాగా లారీ డ్రైవరు పరారీలో ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది లక్ష్మ ణ్, నరేష్, రాజేష్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

చక్కెర ఫ్యాక్టరీ తెరిచేదెన్నడో?

- అమలుకు నోచని ముఖ్యమంత్రి వాగ్దానం
- ఫైవ్‌మెన్ కమిటీ నివేదిక ఇచ్చినా ఫలితం శూన్యం
- దైన్యస్థితిలో కార్మికుల జీవితాలు





మన తెలంగాణ/సంగారెడ్డి ప్రతినిధి : నాడు అందరికీ తీపినందించిన చక్కెర కర్మాగారం కార్మికులు నేడు చేదు అనుభవిస్తున్నారు. కార్మికులు తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా నెలల తరబడి పోరాటం చేసినా బతుకులు మాత్రం బాగు పడలేదు. చేసేది లేక అచేతనంగా ఉండిపోయారు. దీంతో భార్యా పిల్లలను వెంట బెట్టుకొని పట్టణాలకు వలస వెళ్లారు. ఇదీ మూత పడిన నిజాం చక్కెర పరిశ్రమ కార్మికుల దీన గాథ.

1983లో అప్పటి ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు చెరకు రైతుల శ్రేయస్సును దృష్టిలో వుంచుకొని ప్రభుత్వపరంగా పరిశ్రమను నిజాం చక్కెర కర్మాగారాన్ని మెదక్ పట్టణ సమీపంలోని మంబోజిపల్లిలో ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ రాజకీయ వారసునిగా అధికార పీఠాన్ని అధిరోహించిన చంద్రబాబు నాయుడు నష్టాల పేరిట నిజాం షుగర్స్‌లో 51 శాతం వాటాను ప్రైవేట్ వ్యాపారి గోకరాజు రంగరాజుకు అప్పగించారు. ఈ పరిశ్రమలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని టిఆర్ఎస్ ఏర్పాటు చేసిన తర్వాత ఉద్యమ నేతగా కె.చంద్రశేఖర్‌రావు గట్టిగా వ్యతిరేకించారు. ప్రైవేట్ భాగస్వామ్యాన్ని గట్టిగా వ్యతిరేకించి మేము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో మెదక్‌తో పాటు, బోధన్, మెట్‌పల్లిలో ఉన్న నిజాంషుగర్ పరిశ్రమలను ప్రభుత్వమే నడిపిస్తూ కార్మికులకు పూర్వ వైభవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ 2014లో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటికీ 2015 డిసెంబర్ 23న పరిశ్రమ మూసివేతకు గురైంది. ఈ పరిశ్రమలో 51 శాతం వాటా ఉన్న గోకరాజు రంగరాజు లే అవుట్ ప్రకటించారు. ఈ ప్రకటనను నిరసిస్తూ కార్మికులు కొన్ని నెలలపాటు రిలే నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వం స్పందించకపోగా కార్మికులకు న్యాయం చేయలేకపోయింది. 150 ఎకరాల విస్తీర్ణంలో మెదక్ పట్టణంలో స్థాపించబడిన ఈ చక్కెర పరిశ్రమలో ప్రతిరోజు 200 టన్నుల చెరకు క్రషింగ్ జరుగుతూ వుండేది. పరిశ్రమ వచ్చిందన్న ఆనందంతో మెదక్ ప్రాంతంలో రైతులు చెరకు పంటను విస్తృతంగా పండించే వారు. దాదాపు 30 సంవత్సరాల పాటు సాఫీగా సాగిన చెరుకు రైతుల జీవితం పరిశ్రమ ప్రైవేట్‌పరం అయిన నాటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. మెదక్, బోదన్, మెట్‌పల్లిలలోని నిజాం చక్కెర పరిశ్రమలు మూత పడటంతో దాదాపు 310 మంది కార్మికులతో పాటు వారి కుటుంబాలు అంధకారంలోకి వెళ్లిపోయాయి. వేతనాలు రాక, మరో చోట ఉపాధి లభించక తీవ్ర మానసిక క్షోభకు లోనై ఐదు మంది కార్మికులు అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. 2014 ఎన్నికల్లో మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో జరిగిన ప్రచార సభల్లో ప్రసంగించిన కెసిఆర్ ఎన్నికల తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే వంద రోజుల్లో నిజాం చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రావు వంద రోజుల్లో నిజాం చక్కెర పరిశ్రమలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించడంతోపాటు జిఓ 28 జారీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఫైవ్‌మెన్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈకమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించింది. ఇన్ని చేసినా ప్రభుత్వం మాత్రం ఫ్యాక్టరీని తెరిపించలేకపోయింది. దీంతో నిజాం చక్కెర ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులు తమ పిల్లాపాపలు, తల్లిదండ్రులతో పట్టణాలకు వలస వెళ్లి కూలినాలి పనులు చేసుకుంటున్నారు. ఎన్నటికైనా ప్రభుత్వం కరుణించి పరిశ్రమను తెరిపిస్తారన్న ఆశతో కార్మికులు ఎదురు చూస్తున్నారు.

డ్రగ్స్ కేసులో మరో ఇద్దరు అరెస్టు

అహ్మదాబాద్: రూ. 3,500 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత కేసులో ఆదివారం మరో ఇద్దరు నిందితులను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యురో (ఎన్‌సిబి) అరెస్ట్ చేసింది. ఇటీవల గుజరాత్ తీరం లో ఎమ్‌వి హెన్రీ వర్తక నౌక నుంచి భారీ మొత్తంలో 1500 కేజీల హెరా యిన్‌ను ఎన్‌సిబి స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే నౌక సిబ్బంది ఎనిమిది మందితో పాటు 11 మందిని ఎన్‌సిబి అధికారులు అరెస్ట్ చేయగా, తాజాగా ఈ కేసులో సాద్, సులేమాన్‌లను ముంబయిలో శనివారం ఎన్‌సిబి అదు పులోకి తీసుకుంది. దీంతో నిందితుల సంఖ్య మొత్తం 13 మందికి చేరినట్టు ఎన్‌సిబి జోనల్ డైరెక్టర్ హరి ఓం గాంధీ ఒక ప్రకటనలో వెల్లడించారు. డ్రగ్స్ కొనుగోలు, పంపిణీ చేయడంలో వీరిద్దరి పాత్రపై విచారించేందుకు ఇక్కడికి తీసుకవచ్చినట్టు తెలిపారు.

మూడో విడతలో 20కోట్ల మొక్కలు నాటాం

- అటవీ మంత్రి జోగురామన్న



మనతెలంగాణ/కరీంనగర్ ప్రతినిధి: మూడో విడత హరితహారంల కార్యక్రమంలో రాష్ట్రంలో ఇంత వరకు 20 కోట్ల మొక్కలు నాటామని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఆదివారం ఎల్ఎండి వద్ద ముఖ్య మంత్రి జూలై 12న కరీంనగర్‌లో 3వ విడత హరితహారం కార్యక్రమం ప్రారంభం కార్యక్రమం సందర్భంగా నాటిన మొక్కలను ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే 3వ అతి పెద్ద ప్రయోగం రాష్ట్రంలో ముఖ్యమంత్రి తెలంగాణకు హరితహారం కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. జూలై, ఆగస్టు మాసాలలో నెలకు నాలుగు సార్లు నీరు టాక్టర్ల ద్వారా పోయుటకు అనుమతి ఇచ్చామని తెలిపారు. మంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు రూపొందిస్తుందని అన్నారు. సంచార జాతులు, పూసవేర్ల కులస్థులు, పెద్దమ్మల కులస్థుల, వంశధార కులస్థుల ఆర్థికాభివృద్ధికి ఎంబిసి చైర్మన్ అధ్యక్షతన గల కమిటీతో చర్చించి వారికి సంక్షేమ పథకాలను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, శాసన మండలి సభ్యులు భాను ప్రసాదరావు, నగరపాలక సంస్థ కమిషనర్ శశాంక్, స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కుంటే మేమెట్ల బతకాలి?

- రుక్మాపూర్ రైతుల గగ్గోలు
- అవి మా భూములే అంటున్న అటవీ అధికారులు



ఈ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

మనతెలంగాణ/చేగుంట: అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుని బతుకుతున్న మా భూములను స్వాధీనం చేసుకుంటే మేము ఎట్లా బతకాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 104 నంబర్లలో సుమారు 100 ఎకరాల భూముల్లో గ్రామానికి చెందిన 50మంది రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఇటీవలే అటవీ భూముల రక్షణ పేరుతో సర్వే నంబర్ 104లో వ్యవ సాయం చేస్తున్న భూములు తమ పరిధి లోకి వస్తాయని ఆ భూములను స్వాధీనం చేసుకోవడానికి సన్నాహాలు చేసారు. ఈ భూముల్లో తాతల నాటి కాలం నుండి వ్యవసాయం చేస్తూ బతుకుతున్నామని, ఇప్పుడు స్వాధీనం చేసుకుంటే జీవించేది ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజుల నుండి అటవీ అధికారులు రుక్మా పూర్ వ్యవసాయభూములు మావే అని తరచూ వస్తూ బెదిరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసు కున్న దుబ్బాక ఎంఎల్ఎ రామలింగారెడ్డి వ్యవసాయ భూములను పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మితో మాట్లాడి అటవీ శాఖ అధికారులతో చర్చించి ఇక్కడ జాయింట్ సర్వే చేయించి ఈ భూముల వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారులతో మాట్లాడి రైతుల భూములు పోకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. ఇటీవల హరితహారం కార్యక్రమానికి గాను రుక్మాపూర్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటడానికి వచ్చిన మెదక్ జిల్లా కలెక్టర్ భారతి హోలికేరితో గ్రామస్తులు భూములు కోల్పోతున్న బాధిత రైతులు తెలిపారు. మా పూర్వీకుల నుండి ఈ భూముల్లోనే దున్నుకుని బ్రతుకుతున్నామని ఆ భూములు కోల్పేతే మా బతుకులు ఆగం అవుతాయని తెలిపారు.

భూములు పోతే బతకలేం : ఎల్లవ్వ

ఈ భూములే ఆధారంగా బతుకుతున్న తమకు ఈ భూములు మీవి కావు వెళ్ళిపోండని అధికారులు చెబుతుండడంతో కంటిమీద కునుకు రావడంలేదని మహిళా రైతు ఎల్లవ్వ తెలిపారు. భూములు పోతే బతకలేమని కన్నీటితో చెప్పింది.

ఇవి మా భూములే : ఎల్లయ్య

మా తాతల నాటి నుండి ఇక్కడే దున్నుకుని జీవనం గడుపుతున్నాం. ఇపుడు వచ్చి ఈ భూములు మా భూములేనని ఈ భూముల్లో మా తాతల సమాధులు కూడా ఉన్నాయని ఎల్లయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ ట్రైనీ మహిళా కానిస్టేబుల్ మృతి

మన తెలంగాణ/ హైదరాబాద్/ రాజేంద్రనగర్: ఔటర్ సర్వీస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన ట్రైనీ మహిళా కానిస్టేబుల్ కీర్తి చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందింది. ఈ ప్రమాదంలో కారు నడిపిస్తున్న ఎస్ఐ మహ్మద్ ఖలీల్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. అదే కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు ట్రైనీ మహిళ కానిస్టేబుళ్లు కీర్తి, మమతలు గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. కీర్తి, మమత లు ఇటీవలే కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికై తెలంగాణ పోలీసు అకాడమీలో కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతున్నారు. వీరికి వికారాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ మహ్మద్ ఖలీలు క్లాస్‌లు తీసుకుంటున్నారు. అయితే ఈ ముగ్గురు శనివారం అకాడమీ నుంచి కారులో బయల్దేరి కొద్ది దూరం వెళ్లాక కారు చెట్టును ఢీ కొన్న విషయం తెలిసిందే.

సుందిల్ల భూ నిర్వాసితునిపై పోలీసుల ప్రతాపం!

- రెండు రోజులు హింసించారని బాధితుడి ఆరోపణ
- పోలీసులపై చర్యకు కాంగ్రెస్ పార్టీ డిమాండ్



మీడియా సమావేశంలో విలపిస్తున్న బాధితుడు దాసరి

మనతెలంగాణ/పెద్దపల్లి: సిరిసిల్ల మండలం తంగళ్లపల్లి ఘటన మరువక ముందే మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన సుందిల్ల భూనిర్వాసితులపై మంథని పోలీసులు తమ ప్రతాపాన్ని చూపారు. అధికార పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన గ్రామ ఉపాధ్యక్షుడు దాసరి చంద్రమోహన్‌ను పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం కలకలం సృష్టిస్తోంది. బ్యారేజీ పనులు అడ్డుకున్నందుకు స్వయంగా అధికార పార్టీకి చెందిన నాయకుణ్ణి రెండురోజుల పాటు చిత్రహింసలకు గురిచేయడం పై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. బాధితుడు ఆదివారం పెద్దపల్లి ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సుందిల్ల బ్యారేజి పనులకు తాను ముందుండి గ్రామంలోని భూనిర్వాసితుల నుండి స్వచ్ఛందంగా భూములు ఇప్పించానని ఇందుకు గాను అప్పుడు ప్రభుత్వం ఎకరాకు 8 లక్షలు పరిహారం ఇవ్వడం జరిగిందని తెలిపారు.నష్టపరిహారం సరిపోవ దంలేదని తెలుపగా అధికారులు తమకు నచ్చ చెప్పి ప్రభుత్వం ఎక్కడైనా భూ నిర్వాసితులకు ఎక్కువ పరిహారం చెల్లించే క్రమంలో మీకు కూడా పెంచిన పరిహారాన్ని అమలు చేస్తామని చెప్పడంతో తాము అంగీకరించామన్నారు.తాజాగా పరిహారాన్ని ప్రభుత్వం రూ.13లక్షలకు పెంచడంతో గ్రామస్థులు తన ఒత్తిడి చేయడంతో అధికారుల వద్దకు వెళ్లి పెంచిన పరిహారాన్ని ఇవ్వాలని అడుగగా ఎవరు స్పందించక పోవడంతో తాను శుక్రవారం సుందిల్ల బ్యారేజీ పనులను అడ్డుకున్నానని తెలిపారు.మంథని ఎస్ఐ ఉంపేందర్ తనను మాట్లాడుతా రమ్మని పిలిచి రెండు రోజుల పాటు చిత్ర హింసలకు గురి చేసి అక్రమ కేసులు బనాయించారని బాధితుడు విలపించాడు.బూతులు తిడుతూ రోకలి బండలు ఎక్కించాడని బాధితుడు ఆరోపించాడు. సిరిపురం గ్రామానికి చెందిన భూనిర్వాసితులు న్యాయమైన నష్టపరిహారాన్ని అడిగినందుకు చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు శశిబూచన్ కాచే, భూషన వేణి రమేష్ గౌడ్, మంథని నర్సింగ్, సిరిపురం భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

కార్గో విమానానికి తప్పిన పెను ప్రమాదం

మన తెలంగాణ/శంషాబాద్ : సాంకేతిక లోపంతో కార్గో విమానానికి పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇది చేసుకుంది. జిఎంఆర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం టీజెడ్ఎస్ 310 కార్గో విమానం 7.59గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి షార్జాకు వెళ్లడానికి టేకాఫ్ తీసుకుందన్నారు. అయితే విమానం టేకాఫ్ తీసుకొని కొద్ది దూరం ప్రయాణించాక ఇంజన్‌లో సాంకేతిక లోపం వచ్చిందన్నారు. దీంతో అప్రమత్తమైన పైలెట్ విమానాన్ని తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 9.10గంటలకు ల్యాండ్ చేసినట్లు తెలిపారు. అయితే ఇది సరుకులను రవాణా చేసే విమానం కావడంతో ప్రయాణికులు లేరు. విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అప్పుల బాధతో ఉరేసుకుని రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/చిట్యాల : అప్పుల బాధతో ఉరివేసుకుని రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం ఆలస్యం వెలుగులోకి వచ్చింది.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం నవాబుపేట శివారు ప్రాంతమైన చింతకుంట రామయ్యపల్లి చెందిన భోగం నర్సయ్య(65) రైతు అప్పుల బాధతో ఇంట్లో గొడవ పడి బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోవడంతో సాయంత్రం తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం చుట్టు ప్రక్కల ఇండ్లతో పాటు బంధువుల ఇండ్లలో ఆరా తీసినా ఫలితంలేదు. శాంతినగర్‌లో ఉన్న తన వ్యవసాయ భూమి వద్ద నర్సయ్య చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం తెలుసుకుని వెళ్ళేసరికి శవమై కనిపించాడు.

మల్లాపూర్‌లో మరొకరు..

మనతెలంగాణ/మల్లాపూర్: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో అప్పులు తీర్చే దారి లేక రైతు ఆదివారం పురు గుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలానికి చెందిన కాశీంరెడ్డి (40) అనే రైతు తనకున్న రెండెకరాల వ్యవసాయం చేసుకుంటూ జీవించే వాడు. పంటలు సరిగా పండక, సరైన దిగుబడి లేక కాశీంరెడ్డి గత రెండు సంవత్సరాల క్రితం గల్ఫ్ వెళ్లి వచ్చాడు. అప్పులు ఎక్కువ కావడంతో మాన స్థాపానికి గురైన కాశీంరెడ్డి, అప్పులు తీర్చే దారిలేక తన తోట దగ్గర పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి చేరాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాశీంరెడ్డి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను రోకలి బండతో కొట్టి చంపిన భార్య

మన తెలంగాణ/హైదరాబాద్/జవహర్‌నగర్ : కుటుంబ కలహాలతో విసుగు చెందిన భార్య తన భర్తను రోకలి బండతో కొట్టి చంపిన సంఘటన ఆదివారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా న్యూ ఇంద్రానగర్ కాలనీలో చోటుచేసుకుంది. జవహర్‌నగర్ ఎస్ఐ ఉదయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.... సాయిబాబా న్యూఇంద్రానగర్ కాలనీలో నివసించే యేసు (40) రోజమ్మలు భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. కాగా గత పది సంవత్సరాలుగా ఇద్దరి మధ్య తగాదాలు ఉండగా పెద్దలు రాజీకుదుర్చినా ప్రయోజనం లేకుండా పోయింది. శనివారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో విసిగి పోయిన భార్య రోజమ్మ తన భర్త యేసు పడుకున్న తర్వాత రోకలిబండతో కొట్టి చంపింది. ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ భాస్కర్ తెలిపారు.

సినిమాల్లో ఛాన్స్ ఆశ చూపి..

- అశ్లీల షార్ట్ ఫిల్మ్స్ చిత్రీకరణ, బెదిరింపులు
- మొయినాబాద్‌లో వెలుగు చూసిన దారుణం

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: సినిమాల్లో అవకాశం ఇస్తామంటూ మాయ మాటలు చెప్పి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న ఓ యువతిని మోసగించిన సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో జరిగింది. మొయినాబాద్‌కు చెందిన ఓ యువతి (24) స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. ఆమె తమ్ముడి ద్వారా లోక్‌నాథ్ పరిచయం అయ్యాడు. సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానంటూ ఆ యువతిని తన తల్లి విజయలక్ష్మి వద్దకు లోక్‌నాథ్ తీసుకెళ్లి పరిచయం చేశాడు. ఈ క్రమంలో ఆమెకు ఓ సినిమాలో చిన్న పాత్రలో నటించే అవకాశం కల్పించడమే కాకుండా, మూడు వేల రూపాయల పారితోషికం కూడా ఇచ్చారు. దీంతో, వారిపై ఆ యువతికి నమ్మకం ఏర్పడింది. ఈ క్రమంలో ఓ షార్ట్ ఫిల్మ్‌లో నటించేందుకూ ఆ యువతి అంగీకరించింది. ఆ యువతితో ఓ తెల్ల కాగితంపై సంతకం చేయించుకున్న విజయలక్ష్మి యూనిట్ సభ్యులతో ఆమెను షూటింగ్‌కు పంపింది. అయితే, గుర్తు తెలియని ప్రదేశానికి ఆమెను తీసుకెళ్లి వారు అసభ్యంగా ప్రవర్తించారు. వెంటనే ఆమెకు ఫోన్ చేసిన బాధితురాలు ఈ విషయాన్ని చెప్పగా 'వాళ్లు ఎలా చెబితే అలా చెయి, లేకపోతే, వేరే కేసులో ఇరికిస్తారు' అంటూ విజయలక్ష్మి బెదిరించింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో యూనిట్ సభ్యులు చిత్రీకరించిన పది అశ్లీల షార్ట్ ఫిల్మ్స్‌లో ఆ యువతి నటించాల్సి వచ్చింది. దర్శకుడు దుర్గారావు అసభ్యంగా ప్రవర్తించిన విషయాన్ని తన పరువు పోతుందన్న భయంతో ఆ యువతి గోప్యంగా ఉంచింది. ఆన్‌లైన్ ఈ షార్ట్ ఫిల్మ్స్ ఇటీవల పెట్టారు. ఈ విషయాన్ని ఆ యువతి పనిచేస్తున్న ఆసుపత్రి సిబ్బంది, అక్కడి మేనేజర్ గుర్తించారు. దీంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయలక్ష్మి పై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సునీత చెప్పారు.

'టెంపర్' రీమేక్‌లో రణవీర్ సింగ్

ఎన్టీఆర్ కెరీర్‌ను మలుపు తిప్పిన సినిమా 'టెంపర్'. అప్పటిదాకా రొటీన్ సినిమాలతో వరస ఫ్లాపులు ఎదుర్కొన్న ఈ స్టార్ హీరో ఈ సినిమాతో మళ్లీ పుంజుకున్నాడు. పర్ఫార్మెన్స్‌పరంగా ఎన్టీఆర్ బెస్ట్ సినిమాల్లో ఇదొకటిగా నిలుస్తుంది. టెంపర్ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లను సాధించింది. యూనివర్సల్ కంటెంట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంపై బాలీవుడ్, కోలీవుడ్ ఫిల్మ్‌మేకర్స్ కన్నేశారు. తమిళంలో విశాల్ హీరోగా ఈ సినిమా రీమేక్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. అదేవిధంగా హిందీలో ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కబోతోంది. రణవీర్ సింగ్ 'టెంపర్' రీమేక్‌లో హీరోగా చేయబోతున్నాడు. మాస్ మసాలా సినిమాలను తీయడంలో దిట్ట అయిన రోహిత్ శెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తాడు. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో రాబోయే తొలి సినిమా ఇదే.

చిన్న స్థాయి హీరోగా కెరీర్‌ను ఆరంభించిన రణవీర్ సింగ్ గత కొన్నేళ్లలో పలు హిట్ సినిమాలతో స్టార్ హీరోగా ఎదిగాడు. అతను నటించిన 'బాజీరావు మస్తానీ' పెద్ద హిట్టయి స్టార్ హీరోయిగా అతనికి తిరుగులేని క్రేజ్ వచ్చింది. ఇప్పుడు 'టెంపర్' రీమేక్‌లో నటించనున్న రణవీర్‌కు ఈ సినిమా ఏ మేరకు పాపులారిటీని తెస్తుందో చూడాలి.





మహేశ్

నేడు మహేశ్ కొత్త చిత్రం షురూ

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు వరుసగా సినిమాలను చేస్తూ స్పీడు పెంచేశాడు. అయితే టిపికల్ ప్రాజెక్టు కావడంతో 'స్పైడర్' సినిమా చాలా సమయం తీసుకుంది. అందుకే అది దాదాపు చివరి దశకు రాగానే కొరటాల శివ డైరెక్షన్‌లో 'భరత్ అనే నేను' సినిమాను ప్రారంభించేశాడు. ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేసి చకచకా షూటింగ్ చేసేస్తున్నారు. ఇదిలాఉండగా ఎప్పుడో అన్ని విధాలా ఓకే అయిపోయిన వంశీపైడిపల్లి సినిమాకు కూడా క్లాప్ కొట్టిస్తున్నారు. దిల్‌రాజు, అశ్వనీదత్ కలిసి నిర్మించే ఈ సినిమాకు వంశీ పైడిపల్లి దర్శకుడు. పివిపి బ్యానర్‌లో హిట్ మూవీ 'ఊపిరి' సినిమా అనంతరం వంశీ పైడిపల్లి ఈ సినిమా చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కావడానికి కొంత సమయం పట్టింది. చివరికి ఈ సినిమాకు సోమవారం ఉదయం క్లాప్ కొడుతున్నారు. దిల్‌రాజు నిర్మాతగా 25 సినిమాలు పూర్తిచేసుకుంటే... ఇప్పుడు ఈ సినిమా మహేశ్‌బాబుకు హీరోగా 25వ సినిమా కావడం విశేషం. అన్నపూర్ణ స్టూడియోలో ఈ చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనుంది. ఎప్పటిలాగే సెంటిమెంట్ ప్రకారం మహేశ్‌బాబు ఈ కార్యక్రమానికి హాజరుకాడు. చిత్ర నిర్మాతలు దిల్‌రాజు, అశ్వనీదత్‌తో పాటు దర్శకుడు, చిత్ర బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.



తేజ, పరుచూరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ, రానా, అనూప్ రూబెన్స్, లక్ష్మీ భూపాల్

తేజ, రానా సకల కళావల్లభులు

రానా, కాజల్, కేథరిన్ హీరోహీరోయిన్లుగా సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై రూపొందిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. ఈ చిత్రం తాజాగా విడుదలై మంచి సక్సెస్‌ను అందుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో తేజ మాట్లాడుతూ "ఈ కథను రానాకు చెప్పగానే సినిమా ఎప్పుడు చేస్తున్నాం అని అన్నారు. అయితే సురేశ్‌బాబు చెప్పిన విధంగా స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు చేశాను. ఇక నేను రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా డిఫరెంట్‌గా ఆలోచించి సీన్స్ పెడుతుంటాను. మా సినిమా హిట్ అయినందుకు ఎంతో ఆనందంగా ఉంది. కొంతకాలంగా సక్సెస్‌లను అందుకోలేక పోయిన నేను ఈ సినిమాతో హిట్ మూవీలను చేయగలనన్న నమ్మకం ఏర్పడింది. ఇక ఏ స్క్రిప్ట్‌ను అయినా చేయగల హీరో రానా మాత్రమే. ఇలాంటి హీరోలు మరికొందరుంటే తెలుగు సినిమా బెటర్ అవుతుంది. మన స్టార్ హీరోలు నెగటివ్ రోల్స్ చేస్తే మనకు నచ్చదు. కారణం వారి ఇమేజ్. రానాకు ఇమేజ్ గొడవలేదు. ఇలాంటి వ్యక్తి తెలుగు సినిమాకు ఎంతో అవసరం. కాజల్ ఎంతో చక్కగా నటించింది. ఇకపై హిట్ సినిమాలే తీయడానికి ప్రయత్నిస్తాను" అని అన్నారు.



రానా మాట్లాడుతూ "సినిమాకు భారీ కలెక్షన్లను చేసి సినిమా ఇంత పెద్ద హిట్ అయిందా అని అనుకున్నాను. రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా రూపొందిన చిత్రమిది. కాజల్ చేసిన 50వ సినిమా ఇది. ఇక భార్యభర్తల మధ్య ప్రేమ కథను ఇలా చేయడం నాకు కొత్తగా అనిపించింది. ఈ ఏడాది బాహుబలి2, ఘాజీ... ఇప్పుడు నేనే రాజు నేనే మంత్రి సినిమాతో వరుసగా మూడు హిట్లు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది"అని తెలిపారు.

పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "దర్శకుడు తేజ సినిమాకు సంబంధించిన అన్ని విభాగాల్లో పనిచేయగల సమర్థుడు. ఒకప్పుడు ఎన్టీఆర్, ఏఎన్నార్, కాంతారావు వంటి వారు జానపద, చారిత్రక, సాంఘిక చిత్రాలు చేసేవారు. ఈ కాలంలో హీరో రానా కూడా అన్ని జోనర్ సినిమాల్లో నటిస్తున్నారు. తేజ, రానా సకల కళావల్లభులు. ఇక మేం పనిచేసిన 48వ సినిమా ఇది. భార్యను ప్రేమించడం కూడా ఓ లవ్ స్టోరీ అని నిరూపించిన చిత్రమిది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరుచూరి గోపాలకృష్ణ, అనూపర్ రూబెన్స్, లక్ష్మి భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామంలోని ప్రేమ కథ



కిషోర్, విశ్వేష్, శ్రీముఖి, హర్షవర్ధన్

హర్షవర్ధన్ దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా రూపొందుతున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అంజిరెడ్డి ప్రొడక్షన్స్, ఎస్.కె.విశ్వేష్‌బాబు సమర్పణలో అంజిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్ మాట్లాడుతూ "సాధారణంగా పెళ్లిని ఘనంగా చేయడం చూస్తుంటాం. షష్టిపూర్తి కార్యక్రమాలు జరగడమే లేదు. కానీ పెళ్లి సాధారణంగా జరగాలి. షష్టిపూర్తి మాత్రం ఘనంగా జరగాలనే ఆలోచన నుండి ఈ సినిమా కథ పుట్టింది. కాన్సెప్ట్ మూవీలను మొదలు పెట్టడం కంటే పూర్తి చేయడం చాలా కష్టం. కాబట్టి సైలెంట్‌గా నేను ఈ సినిమాను మొదలుపెట్టి పూర్తి చేసుకుంటూ వచ్చాను. మొదటిసారి ఈ సినిమాకు దర్శకత్వం వహించడం వల్ల సినిమా గురించి చాలా విషయాలను నేర్చుకున్నాను. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ సినిమాకు గుడ్ బ్యాడ్ అగ్లీ అనే ఇంగ్లీష్ టైటిల్ ఎందుకు పెట్టావని చాలా మంది అడిగారు. కానీ ఇప్పుడు చిన్న చిన్న పల్లెటూర్లలో కూడా ఈ పదాలను విరివిగా వాడుతున్నారు. అందుకే ఈ టైటిల్ పెట్టాం. రచయిత నుండి దర్శకుడిగా మారిన నేను పాత్రలకు తగ్గట్లుగా నటీనటులను ఎంపిక చేసుకున్నాను. సినిమాలోని ఏకైక లేడీ క్యారెక్టర్‌ను శ్రీముఖి చేసింది. సినిమాలో హీరో పాత్రలో నటించిన మురళి కొత్త డైమెన్షన్ ఉన్న పాత్ర చేశాడు. 1988-89 మధ్య కాలంలో ఓ మారుమూల గ్రామంలో జరిగిన ప్రేమకథే ఈ చిత్రం. ఫీల్ గుడ్ ఎలిమెంట్స్‌తో పాటు పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఇందులో ఉంటాయి. పెద్ద హీరోల స్థాయికి తగ్గకుండా ఈ సినిమా ఉంటుంది"అని అన్నారు. విశ్వేష్ మాట్లాడుతూ "హర్షవర్ధన్‌కు కథపై ఉన్న నమ్మకాన్ని చూసి ఈ సినిమాను నిర్మించడానికి ముందుకువచ్చాను. సినిమా చాలా బాగా వచ్చింది"అని చెప్పారు. శ్రీముఖి మాట్లాడుతూ "జెంటిల్‌మన్ సినిమా తర్వాత నాకు స్పెషల్ సాంగ్స్, స్పెషల్ అప్పియరెన్స్ అవకాశాలు చాలానే వచ్చాయి. అయితే నేను ఏదో త్వరత్వరగా సినిమాలు చేసేసి స్థిరపడిపోవాలని అనుకోవడం లేదు. నేను ఇప్పుడున్న స్థాయిలో హ్యాపీగా ఉండటం వల్ల నచ్చిన కథలనే ఒప్పుకుంటున్నాను. హర్షవర్ధన్ చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషోర్, మురళి, సంతోష్, సురేశ్, శ్రీధర్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



'ఓయ్ నిన్నే' ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అనిల్ రావిపూడి, మల్కాపురం శివకుమార్, భరత్, సృష్టి, శేఖర్ చంద్ర, రామజోగయ్య శాస్త్రి తదితరులు

ఓయ్... నిన్నే గీతాల ఆవిష్కరణ

ఎస్.వి.కె సినిమా బ్యానర్‌పై భరత్, సృష్టి హీరోహీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'ఓయ్... నిన్నే'. వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సత్య చల్లకోటి దర్శకుడు. శేఖర్ చంద్ర సంగీతమందించిన ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అనిల్ రావిపూడి, కోన వెంకట్, చంద్రసిద్ధార్థ్, మల్కాపురం శివకుమార్, కృష్ణచైతన్య, భరత్, సృష్టి, శేఖర్ చంద్ర, రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. బిగ్ సీడీ, ఆడియో సీడీలను కోన వెంకట్ విడుదల చేశారు. తొలి సీడీని అనిల్ రావిపూడి అందుకున్నారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలుగు సినిమా అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతోంది. బాహుబలి, శ్రీమంతుడు నుండి ఈమధ్య విడుదలైన ఫిదా వరకు ఇండస్ట్రీలో కొత్త కొత్త సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అన్నీ మంచి ఆదరణను చూరగొంటున్నాయి. అదే కోవలో ఓయ్ నిన్నే సినిమా నిర్మాతకు మంచి డబ్బును, పేరును తెచ్చిపెట్టాలి"అని అన్నారు. కోన వెంకట్ మాట్లాడుతూ "మంచి సినిమా తీయడానికి మంచి కథ, దానికి తగ్గ నటీనటులు అవసరమని నమ్మే నిర్మాతల్లో వంశీకృష్ణ ఒకరు. సినిమా బావుంటే తుఫానులు, నోట్ మార్పిడిలు, జిఎస్‌టీలు ఏవీ ఆపలేవు. అలాంటి మంచి కాన్సెప్ట్ ఈ సినిమాలో నాకు కనపడుతోంది. సత్య మంచి వ్యక్తే కాదు మంచి రచయిత కూడా. ట్రైలర్, పాటలు చూస్తుంటే సినిమాను ఎంత బాగా అతను తెరకెక్కించాడో అర్థమవుతుంది. తనకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను"అని అన్నారు. చిత్ర నిర్మాత వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ "అంతా కొత్త వారితో చేసిన ప్రయత్నమిది. నేను సెట్స్ దగ్గరకు వెళ్లకపోయినా దర్శకుడు సత్య సినిమాను చక్కగా తెరకెక్కించాడు. శేఖర్ చంద్ర మంచి మ్యూజిక్‌నిచ్చారు. నా నెక్స్ట మూవీకి కూడా ఆయనే మ్యూజిక్ డైరెక్టర్. ఖచ్చితంగా సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుందని ధైర్యంగా చెప్పగలను"అని చెప్పారు. చిత్ర దర్శకుడు సత్య చల్లకోటి మాట్లాడుతూ "నాకు అన్నీ బయట లోకేషన్స్ కావాలని అడగ్గానే నిర్మాత వంశీకృష్ణ ఏమాత్రం కాదనకుండా సినిమా చేయించారు. సాయిశ్రీరామ్ మంచి విజువల్స్ ఇచ్చారు. శేఖర్ చంద్ర సినిమాకు అద్భుతమైన మ్యూజిక్‌ను అందించారు. భరత్, సృష్టి కొత్తవారైనా చక్కగా నటించారు"అని తెలిపారు.

కొత్త టాలెంట్‌తో సచ్చిందిరా గొర్రె

జబర్దస్త్ రాకేష్, శివారెడ్డి, చిత్రం శ్రీను, సత్యవతి, కోట శంకర్‌రావులు ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీధర్ రెడ్డి దర్శకుడు. ఒక ప్రముఖ హీరోయిన్ కూడా ఈ సినిమాలో ముఖ్య పాత్ర పోషించనుంది. "దక్షిణాది సినిమాలలో వినూత్నమైన ప్రయోగాలు జరుగుతున్నాయి. బాహుబలి వంటి అద్భుతమైన సినిమాలు ఇక్కడినుండి వచ్చినవే. అందుకే మేము హైదరాబాద్‌కు చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్‌తో కలిసి సంయుక్తంగా ఈ వినోదాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నాం. దక్షిణాదిన కొత్త టాలెంట్‌ను వెతికి పట్టుకొని ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం"అని సోహం రాక్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు చెందిన నిర్మాత దీపక్ ముకుత్ తెలిపారు. ఈమధ్యనే ముహూర్త కార్యక్రమాలను జరుపుకున్న 'సచ్చిందిరా గొర్రె' సినిమా ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో మొదటి షెడ్యూల్ జరుపుకుంటోంది. నవంబర్‌కల్లా షూటింగ్ ముగించి డిసెంబర్ మధ్యలో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశారు నిర్మాతలు.



శ్రీనివాస్ రెడ్డి, టిల్లు వేణు, జబర్దస్త్ రాకేష్ తదితరులు

కథను మలుపుతిప్పే..

'రన్ రాజా రన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన యంగ్ బ్యూటీ సీరత్‌కపూర్. కొంతకాలం క్రితం ఈ భామ హాట్‌హాట్‌గా ఫోటోషూట్‌లు చేయడంతో ఫిల్మ్‌మేకర్స్ దృష్టి ఆమెపై పడింది. ఆతర్వాత ఈ భామకు బిగ్ ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కాయి. ప్రస్తుతం నాగార్జున హీరోగా ఓంకార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాజుగారి గది' సినిమాతో పాటు రవితేజ చిత్రం 'టచ్ చేసి చూడు' సినిమాలో నటిస్తోంది. అయితే ఇటీవల మరో లక్కీ ఛాన్స్ కొట్టేసింది ఈ హాట్ బ్యూటీ. అల్లు శిరీష్ నటిస్తున్న ఓ సైన్స్ ఫిక్షన్ మూవీలో కథను మలుపుతిప్పే హీరోయిన్‌గా నటిస్తోంది. అంతేకాకుండా ఈ సినిమాలో తన పాత్ర ఎలా ఉంటుందో చెప్పి అందరి దృష్టిని తనవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. సీరత్‌కపూర్ ఈ సినిమా గురించి చెబుతూ... "సినిమాలో అనుకోకుండా కొన్ని కారణాల వల్ల హీరోయిన్ కథ ఎలా మలుపు తిరుగుతుంది... తను చేసిన తప్పుల వల్ల ఎలాంటి నరకాన్ని అనుభవిస్తుంది అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ పాత్రలో నా నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది"అని పేర్కొంది. ఈ చిత్రంలో మరో హీరోయిన్ సురభి, అవసరాల శ్రీనివాస్ నటిస్తున్నారు. ఈ సినిమాను 'ఎక్కడికి పోతావు చిన్నవాడా'ను తెరకెక్కించిన విఐ ఆనంద్ తెరకెక్కిస్తున్నాడు.



సీరత్ కపూర్

హన్సిక మనసు బంగారం

సినీ రంగంలో చాలామంది కోట్లు సంపాదిస్తారు. కానీ అందులో నుంచి ఎంతో కొంత సామాజిక సేవకు ఉపయోగించేవాళ్లు కొద్దిమందే. కొంతమంది సేవా కార్యక్రమాలు చేసినా వాటి గురించి బాగా ప్రచారం చేయించుకుంటారు. అయితే సంపాదించిన డబ్బుతో అనాథ పిల్లల్ని ఆదుకొని అందులో నిజమైన ఆనందం పొందేవాళ్లు కొద్దిమందే ఉంటారు. అందులో అందాల తార హన్సిక ఒకరు. ఇప్పటిదాకా ఈ తార ఏకంగా 32 మంది పిల్లల్ని దత్తత తీసుకోవడం విశేషం. ఆ పిల్లల బాగోగులన్నీ చూస్తూ ఆనందం పొందుతోంది. ఇద్దరు, ముగ్గురు పిల్లల్ని పెంచడానికే ఈరోజుల్లో ఎంత కష్టమవుతుందో, ఎంత ఖర్చవుతుందో తెలిసిందే. అయితే 32 మంది పిల్లల కోసం ఒక ఇంటిని సమకూర్చి వాళ్లకు తిండిపెట్టి... బట్టలు సహా అన్నీ ఇచ్చి చదువు చెప్పించడం మామూలు విషయం కాదు. ఇక తాజాగా తన పుట్టిన రోజు సందర్భంగా హన్సిక చాలామందిలాగా పార్టీలు, పబ్‌లు అని హంగామా చేయకుండా ఈ పిల్లల మధ్యనే సింపుల్‌గా తన బర్త్‌డేను జరుపుకుంది. వాళ్లతో తన ఆనందాన్ని పంచుకుంది. ఈ పిల్లల బాగోగుల్ని హన్సిక తల్లి దగ్గరుండి చూసుకుంటోంది. అయితే సినీ రంగంలోకి వచ్చిన కొంత కాలానికే హన్సిక అనాథ పిల్లల్ని దత్తత తీసుకోవడం మొదలుపెట్టింది.





2018 నాటికి 11,500 మార్క్‌ను చేరనున్న నిఫ్టీ

ముంబయి : దేశీయ ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన వృద్ధి దిశగా పయనిస్తోందని, ఈక్విటీ మార్కెట్లలో బుల్లిష్ ధోరణిని చూడనున్నాయని ఓ నివేదిక తెలిపింది. 2018 సంవత్సరం నాటికి నిఫ్టీ 11,500 మార్క్‌ను తాకనుందని ఎడిల్విస్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ పేర్కొంది. నివేదిక ప్రకారం, వినిమయం, ఎగుమతులు దేశంలో ఆర్థిక వృద్ధికి ఊతం అందించనున్నాయి. అదే సమయంలో 2017 ప్రారంభంలో నగదు కొరత తర్వాత వినిమయం స్వల్పంగా పుంజుకున్నాయి. ప్రభుత్వ నుంచి తగినంతగా నిధులు లేకపోవడంతో రైల్వే, రోడ్లు, విద్యుత్ బదిలీ, రవాణా వంటి రంగాలపై ప్రభావం చూపాయని నివేదిక వివరించింది. ఆర్థికంగా పొదుపులో పెరుగుదల, కనిష్ఠ ద్రవ్యోల్బణం, లాభదాయకతతో స్టాక్‌మార్కెట్ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా స్టాక్స్, కమోడిటీలు, బాండ్లు ర్యాలీ మూడ్‌లో ఉన్నాయి. భారత్ ఈ బలమైన దశలోకి ప్రవేశించనుందని, ఇకపై వర్ధమాన దేశాల మార్కెట్లు మరింత ఉత్తమ ప్రదర్శన చూపుతాయని నివేదిక పేర్కొంది. ఇన్వెస్టర్లు తమ మూలధనాన్ని రక్షిత సాధనాలనుంచి వృద్ధి సాధనాల వైపు మరల్చుతారని తెలిపింది. భారత్ బలానికి కారణం మూడు ఎగుమతులు, వినియోగం, ఫిక్స్‌డ్ ఆస్తులపై పెట్టుబడులు అని వెల్లడించింది. ఈ మూడు భారత ఆర్థిక వ్యవస్థ చోదక శక్తులని, ప్రస్తుతం ఇందులో రెండు మరింత వేగంగా ముందుకు వెళ్లనున్నాయి.

ఇక దిద్దుబాటేనా..!

• తగ్గిన ఈక్విటీ మార్కెట్ల జోరు • గత వారంలో సెన్సెక్స్ 1,112 పాయింట్లు నష్టం • నిఫ్టీ 9830 పాయింట్ల దిగువకు చేరితే కష్టమేనంటున్న నిపుణులు





ముంబయి: ఇలాంటి పరిస్థితి వస్తుంది అని అందరికీ తెలుసు.. ఈక్విటీ మార్కెట్ల సూచీలు ఎప్పుడు పెరుగుతాయో? ఎప్పుడు పడిపోతాయో ఊహించడం కష్టం.. ఇప్పుడు మార్కెట్‌లో అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. గత ఐదు వారాలుగా మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు రాకెట్‌లా దూసుకుపోయాయి. అత్యున్నత శిఖరాలను తాకాయి. ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించాయి. ఇప్పుడు దిద్దుబాటు(కరెక్షన్) కొనసాగుతోంది. సూచీలు మళ్లీ కిందకి జారిపోతూ మదుపర్లలో తెలియని అలజడి రేపుతున్నాయి. దీనికి కారణం భౌగోళిక, రాజకీయ పరమైన అంశాలే.. వీటి ఆందోళనలతోనే దేశీ స్టాక్ మార్కెట్లు గతవారం పతనమయ్యాయి. గడిచిన ఆరు వారాల్లో దేశీ మార్కెట్లు ఇలా భారీ నష్టాల్లో ముగియడం ఇదే మొదటి సారి.. అంతర్జాతీయ మార్కెట్లు బలహీనం, గతంలో అంచనా వేసినట్లు 7.5 శాతం స్థాయి వృద్ధి రేటు సాధించడం కష్టమేనంటూ ఆర్థిక సర్వే నివేదిక పేర్కొనడం కూడా మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. కాగా వారాంత శుక్రవారంనాటికి కీలకమైన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు దాదాపు నెల రోజుల కనిష్టానికి చేరాయి. శుక్రవారం సెన్సెక్స్ 318 పాయింట్ల (1.01 శాతం) నష్టంతో 31,214 పాయింట్ల వద్ద ముగిసింది. జూలై 4 తర్వాత ఈ కనిష్ట స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. ఇక నిఫ్టీ ఒక దశలో కీలకమైన 9,700 పాయింట్ల స్థాయి కన్నా కిందికి పడిపోయి 9,686 పాయింట్ల కనిష్ట స్థాయికి చేరింది. చివరికి 109 పాయింట్లు (1.11 శాతం) నష్టంతో 9,711 వద్ద ముగిసింది. ఈ స్థాయి ముగింపు చివరిసారిగా జూలై 7న నమోదైంది. మొత్తం మీద ఈ వారంలో సెన్సెక్స్ 1,112 పాయింట్లు (3.43 శాతం), నిఫ్టీ 356 పాయింట్లు (3.53 శాతం) క్షీణించాయి. నాలుగు రోజుల్లోనే దేశీయ మదుపుదారుల నుంచి దాదాపు రూ 6.4 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. ఆగస్ట్ 7న రూ 139. 5 లక్షల కోట్లుగా ఉన్న బిఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ వారం తిరగకుండానే రూ 133 లక్షల కోట్లకు పతనమైంది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 331 షెల్ కంపెనీల్లో ట్రేడింగ్‌ను నిలిపివేయడం కూడా షేర్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. చైనాతో డోక్లాం వివాదం కూడా మదుపుదారుల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ఈ వారంలో మార్కెట్ ఏ దిశలో పయనిస్తుందోనని ఇన్వెస్టర్లు వేచిచూస్తున్నారు.

అంతర్జాతీయ పరిస్థితులే కారణం

ఈక్విటీ మార్కెట్ సూచీలు ఇంతలా పడిపోవడానికి కారణం.. అమెరికా, ఉత్తర కొరియా మధ్య రాజకీయ వివాదం ముదురుతున్న నేపథ్యం ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లంతా అధిక రిస్కు పొజిషన్ల నుంచి తప్పుకుంటున్నారని బిఎన్‌పి పారిబా మ్యూచువల్ ఫండ్ సీనియర్ ఫండ్ మేనేజర్ కార్తీక్‌రాజ్ లక్ష్మ ణన్ తెలిపారు. మరోవైపు మధ్యంతర ఆర్థిక సర్వే ఈసారి వృద్ధి లక్ష్యాలపై చెప్పిన విషయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతదిశాయి. నివేదికలోని విషయాలు వృద్ధికి ప్రతికూలంగా ఉండడంతో దేశీ మార్కెట్లు డీలాపడ్డాయి. అటు స్టాండెలోన్ ప్రాతిపదికన నిరాశాజనకమైన ఫలితాలు ప్రకటించిన ఎస్‌బిఐ షేర్లు 5 శాతం మేరకు పడిపోయాయి. టాటా మోటార్స్, ఎం అండ్ ఎం, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టి, సన్‌ఫార్మా వంటి పెద్ద స్టాక్స్ నష్టపోవడం మార్కెట్ సూచీల పతనానికి కారణమయ్యాయి. ఇక ఆంక్షలపై స్టే రావడంతో జేకుమార్, ప్రకాష్ ఇండస్ట్రీస్ షేర్లలో ట్రేడింగ్ ప్రారంభమైనప్పటికీ 20 శాతం లోయర్ సర్క్యూట్‌ని తాకాయి.

దిగువకు చేరితే ఇంకా దిద్దుబాటు

నాలుగు సెషన్లలో నిఫ్టీ దాదాపు 400 పాయింట్లు పడిపోగా, 9710 పాయింట్ల స్థాయి వద్ద ఉంది. ఇకపై ఎలా ఉంటుందన్న అంశంపై ఐసిఐసిఐ డైరెక్ట్ అంచనాలు ఇలా ఉన్నాయి. నిఫ్టీ పదివేల పాయింట్ల దిగువన ముగియడంతో పుట్ రైటర్ల దందా ఆరంభమైంది. తర్వాత మరో ప్రధాన మద్దతు స్థాయి 9800 పాయింట్లను కూడా నిఫ్టీ కోల్పోయింది. ప్రస్తుతానికి 9830 పాయింట్ల స్థాయి అతి గట్టి నిరోధంగా ఉంది. దీనికి పైన సూచీలు ముగిస్తే మరో వంద పాయింట్ల మేర షార్ట్ కవరింగ్‌ను ఆశించవచ్చు. అప్పుడు సుమారు 9890, 9900 పాయింట్లకు నిఫ్టీ చేరవచ్చు. అంతకుమించి పైకి ఎగసే అవకాశాలు మాత్రం చాలా చాలా తక్కువగా ఉన్నాయని నిపుణులు అంటున్నారు. పుట్ కాల్ విషయానికి వస్తే 9500 పాయింట్ల వద్ద భారీ పుట్ రైటింగ్ ఉంది. అందువల్ల 9830 పైన నిఫ్టీ వెంటనే ముగియకపోతే 9500 పాయింట్ల వరకు దిగజారే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు మరింత క్షీణిస్తే ఈ దిద్దుబాటుకు అవకాశాలు ఎక్కువవుతాయి. ఇప్పటి దిద్దుబాటు(కరెక్షన్) ఈ అంశాలే కారణమన్నది తెలిసిన విషయమే.



ప్రముఖ పరిశ్రమగా ముద్రణ

• **బిజెపి శాసనసభపక్ష నేత కిషన్‌రెడ్డి**

మన తెలంగాణ/ హైదరాబాద్: ముద్రణా పరిశ్రమ దేశంలో ప్రముఖ పరిశ్రమగా మారిందని బిజెపి శాసనసభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రింటర్లతో తనకు చిరకాల అనుబంధం ఉందన్నారు. తెలంగాణ అఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నతరహా పరిశ్రమలకు ఇచ్చే గ్రాంట్లను కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రింటర్ల సంఘం అధ్యక్షులు సి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న చిన్న ప్రింటర్లను ప్రోత్సహించాలని, పెరుగుతున్న సాంకేతికతను వారికి అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద ప్రింటర్లకు శిక్షణా కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించాలని కోరారు. ప్రింటర్లపై జిఎస్టీని తగ్గించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రారెడ్డి, కోశాధికారి డి.రాధాకృష్ణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బార్బెక్యూ నేషన్ త్వరలో ఐపిఒ




న్యూఢిల్లీ: ప్రముఖ రెస్టారెంట్ల సంస్థ బార్బెక్యూ నేషన్ త్వరలో ఐపిఒ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు రానుంది. ఒపిఒలో మూడో వంతు తాజా షేర్లను, మూడింట రెండొంతుల షేర్లను ఇప్పటికే వాటాలను కలిగిన ప్రమోటర్లకు చెందిన షేర్ల నుంచి విక్రయించనుంది. ఈ ప్రక్రియలో భాగంగా వచ్చే నెల మొదటి వారంలో మార్కెట్ నియంత్రణ సంస్థ (సెబీ)కి నివేదికను సమర్పించనుంది. ఐపిఒ ద్వారా సుమారు రూ.1000 కోట్ల నిధులను సమీకరించనుంది. సమీకరించిన నిధులను వ్యాపార విస్తరణ, కంపెనీల రుణాల చెల్లింపులు, మూలధన వ్యయానికి ఉపయోగించనుంది. బార్బెక్యూ నేషన్‌లో ప్రముఖ హౌస్‌కీపింగ్ సర్వీస్ కంపెనీ సాయాజీకి 47శాతం వాటాలు ఉన్నాయి.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27840	29775.40	1.02%
ముంబై	28410	30385.03	0.18%
ఢిల్లీ	27850	29786.10	0%
కోల్‌కతా	28310	30278.07	1.62%
కేరళ	27200	29090.91	0.93%
బెంగళూరు	26920	28791.44	0%
హైదరాబాద్	27820	29754.01	1.05%
గల్ఫ్	1355.98	1450.25	0.71%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	41100.00	40000.00	2.75
ముంబై	41100.00	40000.00	2.75
ఢిల్లీ	41100.00	40000.00	2.75
కోల్‌కత్తా	41100.00	40000.00	2.75
హైదరాబాద్	41100.00	40000.00	2.75



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	---	విశాఖపట్నం	348
వరంగల్	337	చిత్తూరు	375
విజయవాడ	343	చెన్నై	382
గోదావరి	343	బెంగళూరు	370

తొమ్మిది కంపెనీలు.. రూ.1,05,357 కోట్లు నష్టం



న్యూఢిల్లీ: ఈ వారం టాప్–10 బ్లూచిప్ కంపెనీల మార్కెట్ విలువ(ఎం–క్యాప్) భారీగా పడిపోయింది. దాదాపు రూ.1,05,357 కోట్ల మార్కెట్ విలువ తుడిచిపెట్టుకుపోయింది. పది సంస్థల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బిఐ బ్లూచిప్ కంపెనీలు దారుణంగా నష్టపోయాయి. వారాంతం శుక్రవారం నాటికి మార్కెట్ విలువను ఒక్క ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ మాత్రమే పెంచుకుంది. ఇక టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి సహా మిగతా ఐదు కంపెనీలు ఎం–క్యాప్‌ను కోల్పోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) మార్కెట్ విలువ భారీగా రూ.24,671.41 కోట్లు కోల్పోయి రూ.5,02,922.78 కోట్లకు చేరింది. ఎస్‌బిఐ విలువ రూ.21,407.49 కోట్లు పడిపోయి రూ.2,42,258.49 కోట్లకు చేరింది. ఐటిసి మార్కెట్ విలువ రూ.10,882.6 కోట్లు తగ్గి రూ.3,30,560.46 కోట్లకు చేరుకుంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కూడా రూ. 10,274.83 కోట్ల ఎం–క్యాప్‌ను కోల్పోయి రూ.4,50,997.65 కోట్లకు చేరుకుంది. కారు తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా రూ.9,843.28 కోట్ల విలువను కోల్పోయి రూ.2,25,135.74 కోట్లకు చేరింది. హిందుస్తాన్ యునీలివర్ మార్కెట్ విలువ రూ.8,452.24 కోట్లు పడిపోయి రూ.2,49,530.29 కోట్లకు తగ్గా, మరోవైపు చమురు దిగ్గజం ఒఎన్‌జిసి ఎం–క్యాప్ రూ.8,149.1 కోట్లు పడిపోయి రూ.2,05,588.43 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సి మార్కెట్ విలువ రూ.6,172.46 కోట్లు క్షీణించి రూ. 2,69,860.07 కోట్లు కాగా, ఐటి దిగ్గజం టిసిఎస్(టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్) మార్కెట్ విలువ రూ. 5,503.57 కోట్లకు చేరింది. అయితే మొత్తం పది బ్లూచిప్ కంపెనీల్లో ఒక్క ఐటి సంస్థ ఇన్ఫోసిస్ ఎం–క్యాప్ మాత్రం రూ. 551.27 కోట్లు పెరిగి రూ.2,26,880.71 కోట్లకు చేరగడం విశేషం. టాప్–10 ర్యాంకింగ్‌ను చూస్తే ఆర్‌ఐఎల్ మొదటి స్థానంలో నిలవగా, ఆ తర్వాత వరుసగా టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌యుఎల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ ఇండియా, ఒఎన్‌జిసిలు ఉన్నాయి.

డిపాజిట్ రేట్ల కోతతో తగ్గనున్న రుణాల రేట్లు



• **ఇండియా రేటింగ్స్ సర్వే**

ముంబయి : గత పక్షం రోజుల్లో మూడు అతిపెద్ద బ్యాంకులు డిపాజిట్ రేట్లను తగ్గించడం వల్ల రుణాల రేట్లు కూడా దిగిరానున్నాయని, దీంతో బ్యాంకుల మధ్య గట్టి పోటీ నెలకొననుందని సర్వే వెల్లడించింది. జులై 31న దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ రూ.1 కోటి లోపు డిపాజిట్లపై 50 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటును తగ్గించింది. దీంతో వడ్డీ రేటు 3.5 శాతానికి తగ్గుముఖం పట్టింది. ఎస్‌బిఐ బాటలోనే యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్నాటక బ్యాంక్‌లు పయనించాయి. ఇండియా రేటింగ్స్ ప్రకారం,ఆస్తుల నాణ్యతపై ఒత్తిడి, తగ్గిన క్రెడిట్ వృద్ధితో బ్యాంకుల లాభదాయకత ఇప్పటికీ బలహీనంగానే ఉంది. అదే సమయంలో బ్యాంకుల మధ్య విపరీతమైన పోటీ నెలకొననుందని పేర్కొంది. కాగా ఎస్‌బిఐ పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గించిన కొద్ది రోజులకే యాక్సిస్ బ్యాంక్ కూడా ఇదే నిర్ణయం తీసుకుంది. యాక్సిస్ సేవింగ్ ఖాతాలపై 50 బేసిస్ పాయింట్లు కోత విధించింది. దీంతో ప్రస్తుతం ఈ రేట్లు 3.5 శాతానికి తగ్గిపోనున్నాయి. రూ. 50 లక్షల లోపు డిపాజిట్లపై ఈ కొత్త రేట్లు వర్తిస్తాయి. రూ.50 లక్షలకు పైన డిపాజిట్లపై యథావిధిగా 4శాతం వడ్డీని చెల్లించనున్నట్టు బ్యాంక్ వెల్లడించింది. కొత్త వడ్డీ రేట్లు ఆగస్టు 8 నుంచే అమల్లోకి వచ్చాయి.

జులై 31న సేవింగ్ ఖాతాలపై ఎస్‌బిఐ వడ్డీ రేట్ల కోతతో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఆ తర్వాత వరుసగా పలు బ్యాంకులు పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ వస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరో కూడా రూ.50 లక్షల వరకు డిపాజిట్లపై వడ్డీ రేటును 3.5 శాతానికి తగ్గించింది. కర్నాటక బ్యాంక్ కూడా పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు కోత నిర్ణయం తీసుకుంది.

పేటిఎం మాల్ ఇండిపెండెన్స్‌డే డీల్స్



మన తెలంగాణ / హైదరాబాద్ : ఇ–కామర్స్ వేదిక పేటిఎం మాల్ ఈ సారి ఇండిపెండెన్స్‌డే సెలెబ్రేషన్స్‌ను వినియోగదారులతో మరింత ఉత్సాహ భరితంగా నిర్వహించుకోనున్నట్లు పేర్కొంది. ఈ నెల 8 నుండి ఆగస్ట్ 15 వరకు కొనుగోలు చేసిన లాప్‌టాప్స్, మొబైల్స్, అప్లియెన్సెస్‌పై 80 శాతం వరకు రాయితీలు, అలాగే డిఎస్‌ఎల్‌ఆర్ కెమెరాలపైనా 20వేల వరకు క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నట్లు వెల్లడించింది.

క్యాచ్ నుంచి మినీ మాస్టర్ సాచెట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : నీల్సన్ సర్వే ప్రకారం మసాలాల మార్కెట్ దేశ వ్యాప్తంగా 931 కోట్ల వరకు ఉందని , ఇందులో తక్కువ ఖరీదు (ఐదు, పది రూపాయల) పాకెట్లవేనని తేల్చిందని డా.స్పెసియో ప్రై. లిమిటెడ్ (డిఎస్ గ్రూప్) వెల్లడించింది. దీంతో తాము ఈ ధరల్లో క్యాచ్ స్పైసెస్ మినీ మాస్టర్ గరం మసాల ప్యాకెట్లు ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. స్థానిక ఉత్పత్తులైన పప్పుదినుసులు, ఆకు కూరలు, కూరగాయలతో పాటు దాల్‌మఖానీ, చోలే కర్రీ వంటకాల్లోనూ ఈ గరం మసాలాలను వినియోగించుకోవచ్చని తెలిపింది.

జాబ్ ఓరియెంటెడ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

మన తెలంగాణ/ హైదరాబాద్: కంప్యూటర్‌కు సంబంధించిన జాబ్ ఓరియెంటెడ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు భవాన్స్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు, 60 ఏళ్లు నిండిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌స్టిట్యూట్ ఒక ప్రకటనలో కోరింది. సెప్టెంబరు 4 నుంచి తరగతులు ప్రారంభిస్తామని, ఆగస్టు 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్హత, ఆసక్తి ఉన్న వారు కింగ్‌కోఠిలోని భారతీయ విద్యా భవన్‌లో సంప్రదించవచ్చు.

ఎంబిఎ సాయంకాల కోర్సుకు దరఖాస్తులు

మన తెలంగాణ/ హైదరాబాద్: ఎంబిఎ సాయంకాల కోర్సులో చేరడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. రెండేళ్ల ఉద్యోగ అనుభవం, ఐసెట్ 2017లో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 9399921265, 9849127371 లలో సంప్రదించవచ్చు.

దేశీయంగా ప్లాంట్లను విస్తరించనున్న బ్రిడ్జిస్టోన్

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రపంచ అతిపెద్ద టైర్ల ఉత్పత్తి సంస్థ బ్రిడ్జిస్టోన్ భారత దేశంలోని పూణే ప్లాంట్‌తో పాటు ఇండోర్ ప్లాంటును 304 మిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులతో విస్తరించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యావరణ హితంగా, అధునాతన సాంకేతికతతో టైర్లను తయారు చేసేందుకు వీలుగా బ్రిడ్జిస్టోన్ ఇండియా తన సామర్థ్యాన్ని మరింత మెరుగు పర్చుకుంటోందని ఆ సంస్థ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజు తోషి తెలిపారు. 2017తో ఆరంభించి వచ్చే నాలుగైదేళ్లలోనే దశల వారీగా విస్తరణ ప్రణాళికలను అమలు చేస్తామన్నారు.

9.3 కోట్ల పాన్ కార్డులు ఆధార్‌తో లింక్



న్యూఢిల్లీ: ప్రభుత్వం ఆదేశాలతో పాన్(పర్మనెంట్ అకౌంట్ నంబర్)తో ఆధార్ నంబర్ అనుసంధానం ప్రక్రియ వేగవంతమవుతోంది. ఇప్పటివరకు దాదాపు 9.3 కోట్లకు పైగా పాన్ కార్డులు ఆధార్‌తో అనుసంధానం అయ్యాయని ఆదాయం పన్నుశాఖ అధికారి తెలిపారు. మొత్తం పాన్ ఆధార్‌ల వివరాల్లోకి వస్తే 30 కోట్ల పాన్ కార్డులు ఉండగా, దీనిలో 30 శాతం అనుసంధానం అయ్యాయి. జూన్, జులైలో అనుసంధాన సంఖ్య మూడు కోట్లు ఉంది. ఆగస్టు 5 తేదీ ఆదాయం పన్ను రిటర్న్(ఐటిఆర్)లకు ఆఖరు తేదీ.. 9.3 కోట్ల పాన్ కార్డులు ఆధార్‌తో లింక్ నమోదు అయ్యాయని ఐటి విభాగం తెలిపింది. నకిలీ పాన్ కార్డుల ఏరివేతను కూడా కేంద్రం వేగవంతం చేసింది. దాదాపు 11.44 లక్షల పాన్ కార్డులను నకిలీవిగా గుర్తిస్తూ ప్రభుత్వం రద్దు చేసింది. ఒకే వ్యక్తికి బహుళ పాన్ కార్డులను గుర్తించామని, ఇటువంటి పాన్ కార్డులు 11,44,211 ఉన్నాయని, అందుకే వీటిని డియాక్టివేట్ చేశామని ఇటీవల ఆర్థికశాఖ సహాయ మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకే వ్యక్తి అనేక కార్డులను కల్గి ఉండరాదని అన్నారు. ఒకేవ్యక్తి పలు పాన్ నంబర్లు కల్గివుండటం, నకిలీ పాన్‌కార్డులను నియంత్రించడంలో భాగంగా కేం ద్రం ఈ చర్యలు చేపట్టింది. ఆధార్‌కార్డును పాన్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించి.. ఇందుకు ఆగస్టు 31 ఆఖరి గడువుగా నిర్ణయించింది. గడువులోగా అనుసంధానం చేయకపోతే పాన్ రద్దవుతుందని కేంద్రం ప్రకటించింది. పాన్‌కార్డు గురించి తెలుసుకోవాలంటే ఆదాయం పన్నుశాఖ ఇ–ఫైలింగ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవాలి. హోమ్‌పేజీలో ఉన్న 'నో యువర్ పాన్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి మీ ఇంటిపేరు, మొదటి పేరు, పాన్ స్టేటస్, జెండర్, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్‌తో నమోదు చేయాలి. ఆ తర్వాత రిజిస్టర్ మొబైల్ నంబర్‌కి ఒటిపి వస్తుంది. అప్పుడు పాన్ కార్డు వాలిడ్ అయితే, యాక్టివ్ అని చూపిస్తుంది. ఒకే విధమైన వివరాలతో పలు పాన్ నంబర్లు కల్గి ఉంటే పేజీలో అలర్ట్ వస్తుంది. ఒకవేళ ఆధార్‌తో పాన్ అనుసంధానం చేసుకోకపోతే డిసెంబర్ 2017 నాటికి పాన్ రద్దు అవుతుంది.

ప్రమాదంలో ఉగ్రవాదుల మనుగడ : అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : కశ్మీర్ లోయల్లో ఉగ్రవాదులు దశాబ్దాల పాటు ప్రజలను భయకంపితులను చేయలేరని, ప్రస్తుతం వారి మనుగడే ప్రమాదంలో పడిందని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. సాయుధ ఉగ్రవాదులను ఇక్కడి నుంచి ఏరివేసి కశ్మీర్ లోయల్లో ప్రశాంతను నెలకొల్పే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగానే ఇది జరుగుతోందని చెప్పారు. ఈదిశలో జమ్మూకశ్మీర్ పోలీసులు ఎంతో కష్టపడుతున్నారని ఆయన ప్రశంసించారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత వారికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని, అక్రమ విదేశీ నిధులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కఠిన చర్యలు తీసుకుంటున్నదని ఈ తరుణంలో ఉగ్రవాదులు తీవ్ర వత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. ఇప్పుడు ఏ ఉగ్రవాది కూడా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే అవకాశమే లేదన్నారు. ఓ టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బూటాన్ ట్రైజంక్షన్ సమీపంలోని డోక్లామ్ విషయంలో భారత్–చైనా వివాదంపై ఆయన పెదవి విప్పలేదు. ''మన రక్షణ బలగాలపై విశ్వాసాన్ని ఉంచుదాం' అని మాత్రం వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దేశం రెండు ప్రధాన ముప్పులను ఎదుర్కొంటోందని, ఒకటి జమ్మూకశ్మీర్ సరిహద్దులో హింస కాగా, మరొకటి వామపక్ష తీవ్రవాదమని పేర్కొన్నారు.

బస్సులపై మృత్యు చరియలు!

47 మంది దుర్మరణం

హిమాచల్ ప్రదేశ్‌లో ఘటన



సిమ్లా/జైపూర్/బారిపడ: హిమాచల్‌ప్రదేశ్‌లో కొండచరియలు విరిగి పడడంతో రెండు బస్సులతో పాటు పలు వాహనాల్లోని కనీసం 47 మంది అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఇక్కడ రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో మనాలి నుంచి కట్ర, చంబకు బస్సులు బయలు దేరాయి. టీ తాగడం కోసం డ్రైవర్లు మండీపతన్‌కోట్ జాతీయ రహదారిపై కోట్రుపి వద్ద ఆపారు. ఇదే సమయంలో భారీ కొండ చరియలు విరిగి బస్సులపై పడడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఇందులో ఒక బస్సు దాదాపు 800 మీటర్ల లోతున లోయలోకి జారి పోయింది. మరో బస్సు చరియల కింద పూర్తిగా కూరుకుపోయింది. ఈ రెండు బస్సుల్లో దాదాపు 100 మంది వరకు ప్రయాణిస్తున్నట్టు సమాచారం. ఆర్మీ, ఎన్‌డిఆర్ఎఫ్ దళాలు స్థానిక పోలీసుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టాయి. కాగా, రాజస్థాన్, ఒడిషా రాష్ట్రాల్లోని రహదారులు రక్తమోడాయి. రాజస్థాన్‌లోని చిత్తొర్ ఘడ్ జిల్లాలో ట్రెయిలర్‌ను ఓ వాహనం ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. 8 మంది గాయపడ్డారు. 14 మంది ప్రయాణికులతో కూడిన ఎస్‌యువి వాహనం ప్రార్థనల కోసం వెళ్తుండగా ఎదురుగా రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన ట్రెయిలర్‌లోకి దూసుకుపోయింది. ఒడిషాలోని మయూర్‌బంజ్ జిల్లాలో బైసింగా ప్రాంతానికి చెందిన 17 మంది వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఐదుగురు రైతుకూలీలు దుర్మరణం పాలయ్యారు. ఇందులో ముగ్గురు మహిళలు ఉన్నారు. గాయపడిన 12 మందిని ఆసుపత్రికి తరలించారు. హిమాచల్ మృతుల కుటుంబాలకు ఆ రాష్ట్రం రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

గోడ కూలి నలుగురు చిన్నారులు మృతి

సీతాపూర్: ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. గోడ కూలి నలుగురు చిన్నారులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సర్దార్‌పూర్ ప్రాంతంలోని రసూల్‌పూర్ గ్రామంలో శనివారం సాయంత్రం చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో రామశంకర్ (10), అమన్ (8), వందన (7), గౌరి (7)గా పోలీసులు గుర్తించారు. గాయపడ్డ చిన్నారుల్లో గోల్డి (13), అరుణ్ (8)ల పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. నలుగురు చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్టు పోలీసులు వెల్లడించారు.

బాలిక మృతి కేసులో నష్టపరిహారం

థానే: రెండేళ్ల బాలిక మృతి కేసులో తల్లిదండ్రులకు రూ. 5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. 2015 మే 18న థానేలోని ముర్ధాగాన్ ప్రాంతం భాయందర్ టౌన్‌షిప్‌లో ఇంటికి సమీపంలో బాలిక ఆడుకుంటుండగా అతివేగంతో వచ్చిన డంపర్ ట్రక్కు వాహనం ఢీకొట్టి మృతిచెందింది. ఈ కేసుపై ఇటీవల విచారించిన థానే మోటార్ యాక్సిడెంట్ క్లైమ్స్ ట్రిబ్యునల్ (ఎమ్ఎసిటి) సభ్యుడు, జిల్లా జడ్జీ కెడి వడ్నెతో కూడిన ట్రిబ్యునల్.. డంపర్ యాజమాని సహా వాహన బీమాదారులు ఏడాదికి 8 శాతం వడ్డీతో కలుపుకుని బాధిత కుటుంబానికి నష్టపరిహారాన్ని చెల్లించాల్సిందిగా సూచించింది. 2015 అక్టోబర్‌లో చిన్నారి తల్లిదండ్రులు తమ కూతురి మృతికి కారణమైన వారి నుంచి రూ. లక్షలు పరిహారాన్ని ఇప్పించాలంటూ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

ఓటర్లుగా 24వేల మంది ప్రవాసులు

న్యూఢిల్లీ : ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ప్రపంచ వ్యాపితంగా వివిధ దేశాల్లో ఉంటున్న 24 వేల మందికి పైగా భారతీయులు ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ఇటీవల ప్రారంభించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ పేర్లను ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు 24,348 మంది ఈ విధంగా రిజిస్టర్ చేసుకున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో 23,556 మంది కేరళీయులు, 364 మంది పంజాబీలు, 14 మంది గుజరాతీయులు ఉన్నారని 'ఓవర్సీర్ ఇండియన్ పోర్టల్' పేర్కొంది. ఒకసారి ఓటరుగా నమోదైన తర్వాత ప్రవాస భారతీయుల తాజా చిరునామాకు ఈ సమాచారాన్ని పోస్టు ద్వారా తెలియజేస్తారు. ఈ ఓటర్లకు ఎన్నికల సంఘం ఎలాంటి గుర్తింపు కార్డు జారీ చేయదు. ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్‌కు వచ్చి పాస్‌పోర్టును చూపించి ఓటు వేయాల్సి ఉంటుంది.

కుటుంబ సభ్యులను కాపాడి కారులో వ్యక్తి సజీవ దహనం

కోయంబత్తూరు: తమిళనాడులోని మధుక్కరై ప్రాంతంలో కారులో వెళ్తున్న వ్యక్తి ఆదివారం సజీవ దహనమయ్యారు. బెంగళూరుకు చెందిన బంగారం వ్యాపారి దిలీప్ కుమార్ (38) కుటుంబంతో కలిసి వెళ్తుండగా కారు ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం నుంచి భార్యా, ఇద్దరు పిల్లలను కాపాడిన ఆయన సీటు బెల్ట్ తీయడం ఆలస్యం కావడంతో మంట లంటుకుని సజీవంగా దహనమయినట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరు నుంచి కొచికి వెళ్తుండగా ఈఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులను కాపాడిన ఆయన సీటు బెల్ట్ రాకపోవడంతో బాధితుడు తనను తాను రక్షించుకోలేక పోయినట్లు పోలీసులు తెలిపారు. మహిళ, ఇద్దరు పిల్లలు సురక్షితంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్రాలను ఉపయోగిస్తున్న నక్సల్స్!



గచ్చిరోలి : మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అబూజ్‌మఢ్ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక నక్సల్ శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఘటనాస్థలి నుండి కొన్ని ఆయుధాలను, నక్సల్ సంబంధిత సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా శిబిరంలో కొన్ని గుర్రాలను పోలీసులు గుర్తించారని, ఆ ప్రాంతంలో సీనియర్ నక్సల్ కేడర్ ఉనికికి అది నిదర్శమని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అబూజ్‌మఢ్ ప్రాంతంలోని గచ్చిరోలి, నారాయణ్‌పూర్ జిల్లా సరిహద్దు వద్ద మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పోలీసు విభాగానికి చెందిన నక్సల్ వ్యతిరేక బృందం, నక్సలైట్లకు మధ్య కాల్పులు జరిగాయని ఆయన చెప్పారు. పోలీసులు తమను సమీపిస్తున్నారని తెలుసుకున్న నక్సలైట్లు ఘటనాస్థలి నుండి పారిపోయారని ఆయన తెలిపారు. ఘటనాస్థలిలో మూడు తుపాకులు, ఆరు గుర్రాలు, దైనందిన కార్యకలాపాలకు వాడే వస్తువులు, నక్సలైటు సంబంధిత సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. గుర్రాల ఉనికిని బట్టి ఆ ప్రాంతంలో భూపతి లాంటి సీనియర్ మావోయిస్టు నాయకులు కార్యకలాపాలు నిర్వహించే వారన్న సంగతి అర్థమవుతోందని సదరు అధికారి వెల్లడించారు.

సుక్మాలో ఇద్దరు నక్సల్స్ హతం

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని తీవ్రవాద ప్రభావిత సుక్మా జిల్లాలో భద్రతా దళాలతో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు హతమయ్యారని పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల ఘటన కిస్టారాం పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో చోటుచేసుకుంది. నక్సలైట్ల కదలికలకు సంబంధించి నిఘా వర్గాలు అందించిన ప్రత్యేక సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బలగాలు ఇక్కడికి దాదాపు 500 కిలోమీటర్ల దూరంలోని కిస్టారాం ప్రాంతంలో శనివారం రాత్రి పొద్దుపోయాక సంయుక్త ఆపరేషన్‌ను నిర్వహించాయని ప్రత్యేక డిజిపి (మావో వ్యతిరేక కార్యకలాపాలు) డిఎం అవస్థి పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భద్రతా బలగాలపై నక్సలైట్లు తొలుత భీకర కాల్పులకు ఉపక్రమించారు. దాంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపిందని అవాస్తి చెప్పారు.

కేంద్రం జోక్యానికి జిజెఎం డిమాండ్

డార్జిలింగ్ (ప.బెంగాల్) : ప్రత్యేక రాష్ట్రం కోసం చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 60వ రోజుకు చేరుకోవడంతో సమస్య పరిష్కారానికి అన్ని పక్షాలతో చర్చలు జరిపేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని గూర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం), ఇతర స్థానిక పార్టీలు డిమాండ్ చేశాయి. డార్జిలింగ్ ప్రజల విశ్వాసాలకు విలువిచ్చి కేంద్రం తక్షణమే కలగజేసుకోవాలని జిజెఎం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి నుండి ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకపోయినప్పటికీ పోలీసులు, భద్రతా సిబ్బంది స్థానికంగా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

మూడుసార్లు చెప్పినా లెక్కచేయలేదు

బిఆర్‌డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వివరణ



గోరఖ్‌పూర్ : స్థానిక బిఆర్‌డి ఆసుపత్రిలో భారీ సంఖ్యలో చిన్నారులు మృతి చెందిన ఘటనపై సంబంధిత మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్ మిశ్రా స్పందించారు. పిల్లల మృతి అంశంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. ఆ తరువాత కొద్ది గంటలకే ఆయన జరిగిన అంశాలను మీడియాకు వివరించారు. ఆసుపత్రిలోని పిల్లల విభాగానికి అవసరమైన ఆక్సిజన్ సరఫరాదారులకు బిల్లులు చెల్లించాలనే విషయాన్ని తాను అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చానని రాజీవ్ మిశ్రా తెలిపారు. మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలోని ఈ ఆసుపత్రిలో రెండు రోజుల వ్యవధిలో 30 మంది పిల్లలు చనిపోయారు. ఇది బాధాకరమైన విషయం అని, దీనికి తాను నైతిక బాధ్యత వహిస్తున్నానని రాజీవ్ తెలిపారు. అయితే తాను బిల్లుల చెల్లింపునకు నిధుల గురించి సకాలంలో తెలియచేయలేదనే వాదన సరికాదని స్పష్టం చేశారు. ఆక్సిజన్ సప్లయర్‌కు బిల్లుల చెల్లింపు నిధుల గురించి తాను మూడు సార్లు ఆరోగ్య, వైద్య శాఖకు లేఖలు రాశానని వెల్లడించారు. జులై 3, తరువాత 19, ఆగస్టు 1వ తేదీన బిల్లుల సమస్య గురించి లేఖలలో తెలిపానని, అంతేకాకుండా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లోనూ దీని గురించి ప్రస్తావించానని చెప్పారు. తాను లీవ్‌పైనే ఈ నెల 10న రిషికేశ్‌కు వెళ్లానని, లీవుపై ఉన్నప్పుడు కూడా సిబ్బందితో ఆక్సిజన్ సరఫరా గురించి తగు ఆదేశాలు ఇస్తూ వచ్చానని చెప్పారు. ఆక్సిజన్ సరఫరాకు అవసరమైన నిధుల గురించి సకాలంలో తెలియచేయలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఆగ్రహం వ్యక్తం చేసిన అంశంపై రాజీవ్ స్పందించారు. నిధుల కోసం ఆగస్టు 4వ తేదీనే రాజీవ్ మిశ్రా నుంచి అభ్యర్థన అందిందని, వెంటనే మరుసటి రోజునే నిధుల మంజూరీ ఉత్తర్వులు వెలువరించామని రాష్ట్ర వైద్య విద్య మంత్రి అశుతోష్ టాండన్ తెలిపారు. ఈ వాదనలను డాక్టర్ రాజీవ్ మిశ్రా తమ వివరణతో ఖండించారు.

ఆక్సిజన్ కొరత ఒక్కరోజు సమస్య కాదు

బిఆర్‌డి ఆసుపత్రిలో పిల్లల విభాగంలో ఆక్సిజన్ కొరత సర్వసాధారణం అయిపోయిందని , తరచూ ఇదే పరిస్థితి ఏర్పడుతూ ఉంటుందని పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు తెలిపారు. ఆగస్టు 10వ తేది ఒక్కరోజునే సరిగ్గా ఆక్సిజన్ సరఫరా లేదనే ప్రభుత్వ వాదనపై బాధిత తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల పాటు వరుసగా ఆక్సిజన్ కొరత ఉందని, దీనితోనే తన 17 రోజుల బిడ్డ చనిపోయిందని తండ్రి అజయ్ శుక్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 8న కూడా ఆక్సిజన్ కొరత ఉందని దీనితో పిల్లల అత్యవసర చికిత్స విభాగంలో పిల్లలు చనిపోయారని మరో వ్యక్తి తెలిపారు. తరువాత పదవ తేదీన ఒక్కరోజే దాదాపు ఆరేడు మంది పిల్లలు అర్థరాత్రి నుంచి తెల్లవారు జాము మధ్యలో అసువులు బాశారని, ఈ దశలో పిల్లల తల్లిదండ్రులు తల్లడిల్లిపొయ్యారని ఆ వ్యక్తి వెల్లడించారు. సిసిటీవీ రికార్డులను చూస్తే అన్ని విషయాలు తెలిసివస్తాయని స్పష్టం చేశారు.

యుపిలో బాలల వ్యాధుల పరిశోధనా కేంద్రం

- కేంద్ర మంత్రి జెపి నడ్డా ప్రకటన
- బాధ్యులను వదిలేదిలేదు : సిఎం యోగి





మీడియాతో మాట్లాడుతున్న సిఎం ఆదిత్యనాథ్, ఆందోనకారులను చితకబాదుతున్న పోలీసులు

గోరఖ్‌పూర్ : పిల్లల వ్యాధులపై ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని గోరఖ్‌పూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌తో కలిసి ఆదివారం ఉదయం బిఆర్‌డి ఆసుపత్రిని సందర్శించిన తరువాత మంత్రి విలేకరులతో మాట్లాడారు. బాలల వ్యాధుల పరిశోధనా కేంద్రాన్ని ఇక్కడ రూ 85 కోట్ల వ్యయ అంచనాతో నిర్మిస్తారని తెలిపారు. పిల్లలకు అంటువ్యాధులు, అందుకు కారణాలు, నివారణ చర్యల వంటి అంశాలపై ఈ కేంద్రంలో సమగ్ర పరిశోధనలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసుపత్రిలో పిల్లలు మృతి చెందడం దారుణమైన అంశం అని, దీనికి దారితీసిన కారణాలపై దర్యాప్తునకు ఆదేశించామని ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్ ఈ సందర్భంగా చెప్పారు. బాధ్యులైన అధికారులను వదిలేది లేదని స్పష్టం చేశారు. వివిధ రకాల మెదడువాపు వ్యాధి లక్షణాలతో ఆసుపత్రిలో చేరిన శిశువులు మృతి చెందడం దారుణమైన విషయం అన్నారు. తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లో భౌగోళిక పరిస్థితుల కారణంగా వైరస్ సమస్య తీవ్రంగా ఉంటోందని, దీనితో ఎన్‌సెఫలైటిస్ ప్రబలుతోందని, దీనికి వ్యతిరేకంగా తాను చాలా కాలంగా ఉద్యమిస్తున్నానని సిఎం తెలిపారు. తన నియోజకవర్గంలో బాలలు ఆసుపత్రిలోనే మృతి చెందడంపై అయన ఉద్వేగానికిగురయ్యారు. మూడు దశాబ్దాలలో తూర్పు యుపి ప్రాంతంలో మెదడువాపు వ్యాధితో అరలక్షకుపైగా మృతి చెందారని, ఇది వైద్యపరంగా ఓ శాపం అని ఆయన కంటతడిపెట్టారు. ఆసుపత్రిలో ఘటనపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు, రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటు అయిన కమిటీ దర్యాప్తు జరుపుతుందని, కేంద్ర వైద్య బృందం కూడా నిజాలను నిర్ధారిస్తుందని, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. గోరఖ్‌పూర్ తదితర ప్రాంతాలలో తరాల నుంచి అంటువ్యాధుల సమస్య ఉందని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దీనిపై స్పందించలేదని, ఇప్పుడు కాంగ్రెస్ నేత ఆజాద్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం తగదని ఆదిత్యానాథ్ విమర్శించారు. పత్రికలపై కూడా ముఖ్యమంత్రి నిప్పులు చెరిగారు. పత్రికలు తప్పుడు వార్తలు రాస్తున్నాయని , నిజాలను తెలుసుకోకుండా సంచలనాలకు దిగడం మంచిది కాదని తెలిపారు. బయటి నుంచి ఊహాగానాలను వల్లించడం కాదు, వారు ముందుగా వార్డులను సందర్శించి , రోగులకు అందుతున్న ఆక్సిజన్ ఇతర ఏర్పాట్ల గురించి తెలుసుకుని, చూసి మాట్లాడితే మంచిదని హితవులకు దిగారు.

ప్రాణవాయువు అందక మరో చిన్నారి బలి

ఓ వైపు ముఖ్యమంత్రి , కేంద్ర ఆరోగ్య మంత్రి ఆసుపత్రిని సందర్శించిన సమయంలోనే మరో శిశువు కన్నుమూసింది. సకాలంలో సరైన విధంగా ఆక్సిజన్ అందకపోవడం వల్లనే మృతి చెందినట్లు వెల్లడైంది. దీనితో గత ఐదారు రోజులలోనే ఆసుపత్రిలో మృతి చెందిన బాలల సంఖ్య దాదాపుగా 70కి చేరింది. సరైన రీతిలో ఆక్సిజన్ సరఫరా ఉంటుందని, అవసరమైన సిలిండర్లను తెప్పించామని ప్రభుత్వం చెపుతున్నప్పటికీ శిశువుల వార్డులలో పిల్లలు పిట్టలలాగా రాలిపోతూ ఉండటంతో తల్లిదండ్రులు బావురు మంటున్నారు.

సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు : కాంగ్రెస్

న్యూఢిల్లీ: గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో బాలల మరణాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, నిజాలను దాచిపెట్టడానికి ఆదిత్యానాథ్ ప్రభుత్వం యత్నిస్తోందని కాంగ్రెస్ ప్రతినిధి జైవీర్ షెర్గిల్ తెలిపారు. అధిక సంఖ్యలో బాలలు చనిపోయినట్లుగా తమకు తెలిసిందని, బిజెపి ప్రభుత్వం చెపుతున్నట్లుగా ఇవి అంటువ్యాధుల వల్ల సంభవిస్తోన్న మరణాలు కావని, అధికార యంత్రాంగ నిర్లక్ష్యం, సమన్వయ లోపంతో తలెత్తిన సమస్య అని, దీనికి పిల్లలు, తల్లిదండ్రులు బలి అవుతున్నారని అన్నారు.

కేరళలో రాష్ట్రపతి పాలనకు వ్యతిరేకం

తిరువనంతపురం: ఆర్ఎస్ఎస్, సిపిఐ(ఎం) కార్యకర్తల మధ్య హింసాత్మక ఘర్షణలు నెలకొన్న నేపథ్యంలో కేరళలో రాష్ట్రపతి పాలన విధించేందుకు ఆర్ఎస్ఎస్‌బిజెపి వ్యతిరేకమని రాష్ట్ర ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు పి. గోపాలన్ కుట్టి మాస్టర్ స్పష్టం చేశారు. రాజకీయ హింసను అడ్డుకునేందుకు ఇటీవల కేరళ ప్రభుత్వం శాంతియుత చర్చలు జరిపినప్పటికి కూడా వామపక్ష కార్యకర్తలు అదే పంథాను కొనసాగిస్తూ మరింత దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్ కూడా హింసాత్మక ఘటనలు జరగకుండా చూడాలని సూచించారన్నారు.

ఎడాపెడా బెయిలివ్వొద్దు

న్యూఢిల్లీ : నిందితులకు బెయిల్ మంజూరీలో దిగువ కోర్టులు జాగరూకతతో ఉండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేకించి ఉన్నత న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న కేసులలో బెయిల్ ఇచ్చే పద్ధతిని ట్రయల్‌కోర్టులు మానుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఉన్నత న్యాయస్థానాలు ముందస్తు బెయిలు మంజూరు చేసి, కేసు విచారణ పెండింగ్‌లో ఉన్నప్పుడు దిగువ న్యాయస్థానాలు సాధారణ బెయిల్ మంజూరు చేయడం తగదని తెలిపారు. నిందితులు ట్రయల్ కోర్టులలో లొంగిపోయి బెయిల్ కోరడం వల్ల అప్పటికే అత్యున్నత న్యాయస్థానాలలో ఉండే కేసు విచారణలపై ప్రభావం పడుతోంది. జార్ఖండ్‌లో ఓ నిందితుడికి ట్రయల్ కోర్టు ఓ కేసుకు సంబంధించి బెయిల్ మంజూరు చేసింది. అయితే అంతకు ముందే సుప్రీంకోర్టు నుంచి ఈ కేసుకు సంబంధించే నిందితుడు ముందస్తు బెయిల్ తీసుకుని ఉన్నాడు. ఈ అంశంపై విచారణ సందర్భంగా న్యాయమూర్తులు రంజన్ గగొయ్, నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం స్పందించింది. సుప్రీంలో విచారణ పెండింగ్‌లో ఉన్న దశలోనే నిందితుడికి బెయిల్ మంజూరు చేయడం తగదని తెలిపింది. దిగువకోర్టులు ఎక్కువగా ఈ విధంగా చేస్తున్నాయని, పలు కేసులలో ఈ విధంగా జరుగుతోందని,ఈ పద్ధతిని మానుకోవాలని సూచించింది.

ట్రిపుల్ తలాక్‌పై మరో పిటిషన్ వద్దు

న్యూఢిల్లీ : ముస్లిం మతంలోని ట్రిపుల్ తలాక్, నిఖా హలాలా, బహుభార్యత్వం ఆచారాల రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ తాజాగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇదే అంశంపై తీర్పు ఇప్పటికే రిజర్వులో ఉన్నందున మరో పిటిషన్ అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. అయితే ట్రిపుల్ తలాక్‌పై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లలోని కొన్ని అంశాలు తాజా పిటిషన్‌లోనూ ఉన్నందువల్ల తామిచ్చే అంతిమ తీర్పు సరిపోతుందని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఇదే అంశంపై మరో రిట్ పిటిషన్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేసింది. గురుదాస్ మిత్రా అనే వ్యక్తి దాఖలు చేసిన తాజా పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించడం గమనార్హం. నిరంకుశమైనవి, అస్థిరమైనవి అయిన మూడు రకాల తలాక్ (అహ్సన్ తలాక్, హసన్ తలాక్, తలాకుల్ బిద్దత్)లు ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయని సీనియర్ న్యాయవాది సౌమ్య చక్రవరి వాదించారు. నిఖా హలాలా, బహుభార్యత్వంతో పాటు మూడు రకాల తలాక్‌లు రాజ్యాంగంలో ముస్లిం మహిళల కు కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయని ఆయన అన్నారు.

జెడియులో చీలిక?

- రాష్ట్ర విభాగాల మద్దతు మాకే ఉంది
- శరద్ యాదవ్ వర్గం ప్రకటన



న్యూఢిల్లీ : పార్టీకి చెందిన పలు రాష్ట్ర విభాగాల మద్దతు తనకే ఉందని, పార్టీ అధ్యక్షుడు నితీశ్ కుమార్‌కి మద్దతు బీహార్ వరకే పరిమితమని పేర్కొనడం ద్వారా జెడి(యు) సీనియర్ నాయకుడు శరద్ యాదవ్ తన వర్గమే నిజమైన పార్టీ అని ప్రకటించుకునేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు రాజ్యసభ ఎంపిలు, కొందరు జాతీయ కార్యనిర్వాకులతో కూడిన యాదవ్ వర్గం వద్ద 14 రాష్ట్ర విభాగాల అధ్యక్షులు మద్దతు ఇస్తున్నట్లు తెలిపే లేఖలున్నాయని ఆయనకు అత్యంత సన్నిహితుడైన అరుణ్ శ్రీవాత్సవ తెలిపారు. కుమార్ తన సమతా పార్టీని జెడియులో విలీనం చేయడానికి ముందు పార్టీని యాదవ్ నడిపించారన్న సంగతిని ఆయన గుర్తు చేశారు. 'మేము పార్టీని వీడేది లేదు. బీహార్ వెలుపల పార్టీ మనుగడ సాగించలేదని నితీశ్ కుమార్ స్వయంగా అన్నారు. అలాంటపుడు బీహార్ కోసం ఆయనే కొత్త పార్టీని స్థాపించాలి. ఎల్లప్పుడూ జాతీయ ఉనికిని కలిగిన జెడి(యు)ని కబలించాలని ఆయన ప్రయత్నించరాదు' అని శ్రీవాత్సవ పిటిఐ వార్తా సంస్థతో అన్నారు. బీహార్‌కి చెందిన పార్టీ చట్టసభ్యుల నుండి యాదవ్‌కు మద్దతు ఉంది. ఈ నేపథ్యంలో జెడి(యు)లో చీలికను ఏర్పరిచి కొత్త కుంపటిని ఏర్పాటు చేసుకోగలననే విశ్వాసాన్ని శరద్ యాదవ్ వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అసలు సిసలు జనతాదళ్ పార్టీలో గతంలో అనేక మార్లు చీలికలు ఏర్పడ్డాయి. కుమార్‌పై పోరాటంలో యాదవ్‌కు పార్టీ రాజ్యసభ ఎంపిలు అలీ అన్వర్ అన్సారీ, ఎంపి వీరేంద్ర కుమార్ ప్రస్తుతానికి అండగా నిలుస్తున్నారు. మరోవైపు నిజమైన జెడి(యు) తనతోనే ఉందని యాదవ్ ప్రకటించుకుంటున్నప్పటికీ, బీహార్‌లో తన పర్యటనకు ఆర్‌జెడి కార్యకర్తలు, మద్దతుదారులు బాసటగా నిలవగా సొంత పార్టీ కార్యకర్తలు మాత్రం దూరంగా ఉండటం గమనార్హం. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుండి యాదవ్‌ను నితీశ్ శనివారం తప్పించిన సంగతి తెలిసిందే. బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు పార్టీ సంపూర్ణ సమ్మతితోనే బిజెపితో దోస్తీ కట్టినందు వల్ల యాదవ్ స్వేచ్ఛాయుతంగా తనకు నచ్చిన నిర్ణయం తీసుకోవచ్చని అంతకుముందు రోజు నితీశ్ తేల్చిచెప్పారు.



చైనాలో భారతీయుడికి చేదు అనుభవం

బీజింగ్: చైనాలోని షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో ఓ భారతీయ ప్రయాణికుడికి చేదనుభవం ఎదురైంది. అక్కడి విమాన సిబ్బంది భారతీయుడితో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు దుర్భాషలాడినట్లు అతడు ఫిర్యాదు చేయడంతో ఈ విషయాన్ని భారత చైనా దృష్టికి తీసుకెళ్ళింది. ఉత్తర అమెరికా పంజాబీ సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్నాం సింగ్ ఛహల్ ఎగ్జిట్ గేట్ వద్ద విమాన సిబ్బంది తనను దుర్భాషలాడి అవమానించారని విదేశాంగ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్‌కు రాశారు. ఆయన ఆగస్టు 6న చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ ద్వారా న్యూఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్‌కోకు ప్రయాణించినప్పుడు ఈ ఘటన చోటు చేసుకుంది. చైనా విమానాశ్రయంలో దిగిన ఆయన మరో విమానం ఎక్కాల్సి ఉండగా ఈ చేదనుభవాన్ని రుచి చూశారు. సరిహద్దులోని ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంరీత్యా చైనాలోని విమాన సిబ్బందిలో పేరుకుపోయిన అసహనం వారి బాడీ లాంగ్వేజిలో ప్రస్ఫుటమైనట్లు కూడా సత్నాం తన లేఖలో పేర్కొన్నారు. చైనాలో ఇలాంటి చేదనుభవాలు ఎదురవకుండా ఉండేందుకు ఆ దేశం గుండా ప్రయాణించొద్దని భారతీయ ప్రయాణికులకు అడ్వయిజరీని జారీ చేయాలని ఆయన సుష్మకు సూచించారు. అయితే తాము చాలా మర్యాదపూర్వకంగానే ప్రవర్తించినట్లు చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ తెలిపింది.

ఇండోనేషియాలో భూకంపం



జకర్తా: ఇండోనేషియాకు చెందిన ద్వీపం సుమత్రాలో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. ఇది రిక్టర్ స్కేలుపై 6.4 మ్యాగ్నిట్యూడ్‌గా నమోదయింది. కానీ ఈ భూకంపంతో పాటు సునామీ ముప్పేమి లేదని భూకంప శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే భయాందోళనకు గురైన ప్రజలు తమ ఇళ్ళు వదిలి పరుగులు తీశారు. బెంగ్‌కులు పశ్చిమాన 73 కిమీ. దూరంలో ఉదయం 10.08(03.08 గ్రీన్‌విచ్ సమయం)కు 35 కిమీ. లోతులో ఈ భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ భూప్రకంపనాలు పడంగ్, పశ్చిమ సుమత్రా అంతటా వ్యాపించాయని, భూకంపం వల్ల సునామీ ముప్పేమి లేదని ఇండోనేషియాకు చెందిన వాతావరణ , భూభౌతిక సంస్థ అధికారి మోచమ్మద్ రియాదీ తెలిపారు. ఈ భూకంపం వల్ల ఎవరైనా చనిపోయారా, ఏమైనా నష్టం జరిగిందా? అని అధికారులు తనిఖీ చేస్తున్నారు.

శ్రీలంకలో ముగ్గురు భారతీయుల అరెస్టు

కొలంబో: శ్రీలంకలో అక్రమంగా ఉంటున్నందుకు ముగ్గురు భారతీయులను అరెస్టు చేశారు. శ్రీలంక నావికా దళంకు సమాచారం అందడంతో శ్రీలంక ఆగ్నేయ కమాండ్‌కు చెందిన బలగాలు, మరుదమునైలో ఉన్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం నిందవూర్‌లో ప్రత్యేక దాడి చేసి వారిని అరెస్టు చేశారు. ఈ వార్తా కథనాన్ని 'కొలంబో పేజ్' ప్రచురించింది. అయితే ఆ భారతీయుల పేర్లేమిటో ఇంకా తెలియలేదు. వారంతా తమిళనాడు నివాసులని, వారి వయస్సులు 27, 36, 41 అని తెలిసింది. ఓ పొలంలో పంట కోస్తుండగా వారిని అరెస్టు చేశారు. శ్రీలంక వలస చట్టాలను ఉల్లంఘించారన్న అభియోగాన్ని వారిపై మోపారు. చట్టపరమైన చర్యలు తీసుకోడానికి సమ్మనతురై పోలీస్‌లకు వారిని అప్పగించారని సమాచారం.

నేపాల్ వరదల్లో చిక్కుకున్న 200 మంది భారతీయులు



ఖాట్మండు: నేపాల్‌లో భారీ వానలు, వరదలలో 200 మంది భారతీయులు సహా దాదాపు 600 మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. వరదలకు ఇప్పటికే 49 మంది చనిపోయారని నేపాల్ అధికారులు ఆదివారం చెప్పారు. వరదలకు ఆరుగురు గల్లంతయినట్లు సమాచారం. దాదాపు 35,000 ఇళ్లు పాక్షికంగా ముంపుకు గురయ్యాయి. 1000 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 400 పశువులు మరణించాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వానలకు నేపాల్‌లో వరదలు వచ్చాయి. అనేక చోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. పొంగి ప్రవహిస్తున్న రప్తీ నది వరదలు చిట్వాన్ లోయలోని అనేక హోటళ్లను ముంచేశాయి. చిట్వాన్‌లోనే నేపాల్ తొలి జాతీయ పార్క్ ఉంది. సహాయక చర్యలు చేపట్టేందుకు పొరుగున ఉన్న దేవ్‌ఘాట్ నుంచి నాలుగు రబ్బర్ పడవలు(రాఫ్ట్స్) కోరినట్లు జిల్లా ముఖ్య అధికారి నారాయణ్ ప్రసాద్ భట్టా చెప్పారు. చిక్కుబడిన పర్యాటకులను ఏనుగుల సాయంతో రక్షిస్తున్నట్లు ప్రాంతీయ హోటళ్ల సంఘం చైర్మన్ సుమన్ ఘిమిరే తెలిపారు.

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలపై కదలికలు

మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం కార్మిక శాఖ కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం ప్రాంతీయ కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో జాతీయ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి, గుర్తింపు ఎన్నికల నిర్వహణకు తేదీని ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ అధికారుల నుంచి జాతీయ కార్మిక సంఘాల నాయకులకు లేఖలు అందాయి. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ముగియగా ఎన్నికల నిర్వహణలో అంతులేని జాప్యం చోటు చేసుకోంది. గుర్తింపు ఎన్నికలకు సింగరేణి యాజమాన్యం సుముఖంగా ఉన్నందు వలన కేంద్ర కార్మిక శాఖ ఆదేశాల మేరకు ప్రాంతీయ కార్మిక శాఖ అధికారి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సింగరేణిలో గుర్తింపు ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడింది. ఎన్నికల తేదీ ఖరారు అవుతున్న నేపథ్యంలో సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై ఆయా కార్మిక సంఘాలు గురిపెట్టాయి. గనుల వద్ద ఆయా సంఘాల నాయకులు పోటాపోటీగా గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ కార్మికుల్లో పట్టుకోసం ఎత్తుగడలు వేస్తున్నారు. సింగరేణిలో కార్మికుల బిడ్డలకు సంబంధించిన వారసత్వ ఉద్యోగాల విషయంలో 10 రోజుల పాటు సమ్మె విజయవంతం చేయించిన జాతీయ కార్మిక సంఘాల నాయకులు కార్మికుల్లో విశ్వాసం పొందారు. టిఆర్ఎస్ ప్రభుత్వం నాయకత్వంలోనే వారసత్వ ఉద్యోగాలు ఇచ్చితీరుతామని మంత్రి కెటిఆర్‌తో పాటు పలువురు టిబిజికెఎస్ నాయకులు వేదికలు ఎక్కి ప్రసంగాలు చేసినప్పటికీ కార్మికుల్లో విశ్వాసాన్ని పొందలేకపోతున్నారు. న్యాయపరమైన చిక్కుల విషయంలో ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేస్తేనే మళ్లీ కార్మికుల్లో పట్టు సాధించే అవకాశాలు ఉంటాయి. ఇదిలా ఉండగా మరోవైపు ఐఎన్‌టియుసి నాయకులు సింగరేణిలో పాగా వేసేందుకు కార్మిక వాడలతో పాటు గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ టిబిజికెఎస్‌ను నమ్మవద్దని కార్మికుల్లో వ్యతిరేకతను తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎఐటియుసి నాయకులు సైతం వారసత్వ సమ్మె విషయంలో జాతీయ సంఘాలను కలుపుకొని సమ్మెను విజయవంతం చేయడంలో ప్రధాన భూమిక పోషించి, కార్మికుల్లో ఇప్పటికే పట్టు సాధించుకుంటున్నారు.

ఛత్తీస్‌గఢ్ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం

రాయ్‌గఢ్: ఛత్తీస్‌గఢ్‌లోని ఓ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (జెఎస్‌పిఎల్) ప్లాంట్‌లో నుంచి వేడి ఆవిరి ఒక్కసారిగా భారీ మొత్తంలో బయటకు చిమ్మడంతో ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు వెల్లడించారు. రాయ్‌గఢ్ జిల్లాలోని కోట్రా పోలీసు స్టేషన్ పరిధిలో పాత్రపలికి సమీపంలో ఉన్న జెస్‌పిఎల్ స్టీల్ ప్లాంట్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) కోట్రా రోడ్ మంజులత బాజ్ పేర్కొన్నారు. ఘనశ్యామ్ చౌహాన్ (35), అశ్రామ్ కెన్వత్ (45) అనే కార్మికులుగా గుర్తించారు. వారిద్దరూ ప్లాంట్‌లో పనిచేస్తున్న సమయంలో ఆకస్మాత్తుగా ధూళితో కూడిన వేడి ఆవిరి భారీ ఎత్తున బయటకు చిమ్మడంతో తీవ్ర గాయాలయ్యాయని మంజులత చెప్పారు. వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది తీవ్రగాయాలైన వారిద్దరిని హుటాహుటినా స్థానిక ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం భిలాయిలోని సెక్టార్9 ఆస్పత్రికి మార్చారు. అయితే చికిత్స పొందుతూ రాయ్‌గఢ్‌కు చెందిన చౌహాన్ మృతిచెందగా, కెన్వత్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఎస్‌హెచ్‌ఓ వెల్లడించారు. కాగా, స్టీల్ ప్లాంటులో లీకేజీకి గల కారణాలపై విచారణకు ఆదేశించినట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

అమెరికాలో శ్వేత జాతీయవాదుల ర్యాలీ హింసాత్మకం



నిరసన ర్యాలీ



జనంపై దూసుకెళ్లిన కారు

వాషింగ్టన్ : అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో అతివాద శ్వేతజాతీయులకు, మితవాదులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. 'యురోపియన్ వలసవాదుల నుంచి అమెరికాను చేజిక్కించుకుందాం..'అంటూ అతివాదులు నినాదాలు చేయగా, 'అమెరికన్లంతా ఒక్కటే..' నని మితవాదులు గర్జించారు. జనంపైకి కారు దూసుకు రావడం, ఓ పోలీస్ హెలికాప్టర్ కూలిపోవడంతో వందలాది శ్వేతజాతి ఆధిపత్యవాదులు తమ నిరసన ప్రదర్శన వ్యతిరేకులతో ఘర్షణ పడ్డారు. కనీసం ముగ్గురు మృతి చెందారు. 19 మందికి గాయాలయ్యాయి. శ్వేతజాతి అతివాదులకు వ్యతిరేకంగా శనివారం మితవాదులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నప్పుడు ఓ కారు దూసుకురావడంతో 32 ఏళ్ల మహిళ చనిపోయింది. కాగా వర్జీనియాలోని చార్‌లోట్టెస్‌విల్లేతో నిరసన ప్రదర్శనకు సమీపంలో ర్యాలీని పర్యవేక్షిస్తున్న హెలికాప్టర్ కూలిపోవడంతో ఇద్దరు పోలీసు అధికారులు చనిపోయారు. కారు నడిపిన 20 ఏళ్ల డ్రైవరును అరెస్టు చేసి సెకండ్ డిగ్రీ హత్యాభియోగాన్ని మోపారు. హెలికాప్టర్ ఎందుకు కూలిపోయిందన్న విషయాన్ని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. వర్జీనియాకు 256 కిమీ. దూరంలో ఉన్న చార్‌లోట్టెస్‌విల్లే కాలేజ్ టౌన్‌లోని పార్క్ నుంచి దక్షిణాది జాతీయవాదానికి గుర్తుగా ఉన్న కాన్ఫెడరేట్ జనరల్ రాబర్ట్ ఇ లీ విగ్రహాన్ని తొలగించాలన్న యోచనను నిరసిస్తూ శ్వేత జాతి ఆధిపత్యవాదులు 'యునైట్ ద రైట్' పేరిట నిరసన ర్యాలీని చేపట్టాలని భావించడానికి ముందే జరిపిన గ్రూపు ర్యాలీలో ఈ హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. ఈ ఘర్షణల అనంతరం అధికారులు వర్జీనియా రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అల్లర్లు జరిగిన ప్రదేశంలో పోలీసులను, భద్రతా బలగాలను మోహరించారు.

క్షిపణులు, జవానులకు కేటాయింపులు పెంచిన ఇరాన్

టెహ్రాన్: అమెరికా విధించిన కొత్త ఆంక్షలకు నిరసిస్తూ ఇరాన్ పార్లమెంట్ ఖండాంతర క్షిపణి కార్యక్రమానికి, పారా మిలిటరీ రివల్యూషనరీ గార్డ్‌ల విదేశీ కార్యకలాపాలకు కేటాయింపులు పెంచింది. ఈ మేరకు రూపొందిన బిల్లుకు అనుకూలంగా ఇరాన్ పార్లమెంటులో ఓటింగ్ జరిగింది. 'అమెరికా ముర్దాబాద్' అని నినదిస్తూనే పార్లమెంటు సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. అయితే ఈ బిల్లు అణు ఒప్పందాన్ని ఉల్లంఘించబోదని ఇరాన్ శాసనకర్తలు చెప్పారు. పర్షియా గల్ఫ్‌లో లేక శాసనబద్ధంగా ఇరాన్ ఎదుర్కొంటూనే ఉంటుందని విశ్లేషకుడు అన్నారు. అమెరికా ఇరాన్‌పై ఏ మేరకు ఒత్తిడి పెంచుతుందో ఆ మేరకు ఇరాన్ కూడా ప్రతిస్పందిస్తుందని జర్మనీలో ఉండే ఇరాన్ విశ్లేషకుడు అద్నాన్ తబతబయి చెప్పారు. ఇరాన్ పార్లమెంట్ ఆదివారం సమావేశంలో మొత్తం 247 మంది శాసనకర్తలలో 240 మంది బిల్లుకు అనుకూలంగా ఓటేశారని ఇరాన్ వార్తా సంస్థ 'ఇర్నా' తెలిపింది. ఆ బిల్లును గార్డియన్ కౌన్సిల్‌గా పిలిచే పర్యవేక్షక సంఘానికి (ఓవర్‌సైట్ కమిటీ) పంపుతారు. ఆ బిల్లును ఆ కమిటీ ఆమోదిస్తుంది. ఈ బిల్లు కింద వివిధ ప్రాజెక్టులకు 800 మిలియన్ డాలర్లు కేటాయించారు. మితవాద అధ్యక్షుడు హసన్ రౌహాని ప్రభుత్వం సైతం ఈ బిల్లుకు మద్దతునిచ్చింది.

భారత్ సైనికాధునీకరణకు సాయపడతాం

● అమెరికా అడ్మిరల్ హారిస్ వెల్లడి



వాషింగ్టన్: భారత సైనిక ఆధునీకరణకు సాయపడేందుకు తాము సంసిద్ధమేనని అమెరికా పసిఫిక్ కమాండర్ (పకామ్) అడ్మిరల్ హారి హారిస్ చెప్పారు. దశాబ్ద కాలంలో భారత్, అమెరికా రక్షణ వాణిజ్యం 15 బిలియన్ డాలర్లను చేరుకుంది. మరికొన్ని సంవత్సరాలలో ఇది మరింత పెరిగే సూచనలు కనబడుతున్నాయి. ఇదిలా ఉండగా అమెరికా నుంచి జెట్ యుద్ధ విమానాలు, ఆధునికి మానవ రహిత విమానాలు, ఎయిర్‌క్రాఫ్ట్ కెరియర్‌లు, తాజా మిలిటరీ సాఫ్ట్‌వేర్‌లను భారత్ కోరుకుంటోంది. ఇరుదేశాల మధ్య ఉన్న రక్షణ సహకారంపట్ల హారిస్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. భారత్,జపాన్, అమెరికా మధ్య త్రిముఖ సంబంధాలు చాలా ముఖ్యమని ఆయన అన్నారు. హిందూ మహాసముద్ర ంలో భారత్, ఆస్ట్రేలి యా, అమెరికాల ఉమ్మ డి ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని అన్నారు. భారత్, అమెరికా కలసి ఎంతో చేయగలవన్న ఆశాభావాన్ని ఆయన హారిస్ వ్యక్తం చేశారు. రానున్న సంవత్సరాలలో మరింతగా రెండు దేశాల మధ్య సంబంధాలు పెరుగగలవని అన్నారు. హిందూ మహాసముద్రంలో చైనా జలాంతర్గాముల గురించి భారత్, అమెరికా పంచుకున్న సమాచారం విషయంపై అడిగిన ప్రశ్నకు ఆయన జవాబు ఇవ్వనిరాకరించారు.

పాక్ స్వాతంత్ర్య వేడుకలకు వాంగ్ యాంగ్



ఇస్లామాబాద్: పాకిస్థాన్ 70వ స్వాతంత్ర్య దినోత్సవం(ఆగస్టు 14) వేడుకలో పాలుపంచుకునేందుకు చైనా ఉపప్రధాని ఇస్లామాబాద్‌కు ఆదివారం చేరుకున్నారు. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వాంగ్ యాంగ్ ప్రత్యేక అతిథి. పాకిస్థాన్‌లో ఆయన రెండు రోజుల పర్యటనలో ఆయనతోపాటు ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కూడా పాకిస్థాన్ చేరుకుంది. పాకిస్థాన్ ప్రభుత్వ అధికారులు, చైనా రాయబార కార్యాలయం అధికారులు వాంగ్‌ను బెనజీర్ భుట్టో అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా రిసీవ్ చేసుకున్నారు. పాకిస్థాన్ పర్యటనానంతరం వాంగ్ నేపాల్‌కు వెళతారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

మోసానికి కేరాఫ్ చంద్రబాబు : జగన్



నంద్యాల : అధికారం కోసం ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇష్టమొచ్చినట్లు హామీలిచ్చారని, రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలను మోసం చేశారని ఆ రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నంద్యాల రోడ్ షోలో వైఎస్ జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి, అన్యాయాలను తూర్పారబట్టారు. నేడు రాష్ట్రంలో మహిళల కళ్లల్లో కన్నీళ్లకు కారణం చంద్రబాబేనన్నారు. మూడున్నారేళ్లలో చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, జాబు రావాలంటే బాబు రావాలని, జాబు రాకుంటే నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి చివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. విద్యార్థులను కూడా చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు. ఉప ఎన్నికలు రాకముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు ఒక్కసారైనా నంద్యాల వచ్చారా అని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. నేడు ఉప ఎన్నికలు వచ్చాయి కాబట్టే వారికి నంద్యాల గుర్తొచ్చిందని, తండ్రికొడుకులు ఇద్దరూ ఇప్పుడు నంద్యాల రోడ్లపై కనిపిస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోటీని తట్టుకోలేక ఎపి కేబినెట్ మొత్తం నంద్యాల్లో దిగిందని ఎద్దేవా చేశారు. ప్రతి పేదవాడికి మూడు సెంట్ల భూమి ఇస్తానని అన్న చంద్రబాబు, పేదవారికి ఒక్క ఇళ్లయినా ఇప్పటి వరకు కట్టించలేదని, అధికారం కోసం చంద్రబాబు ప్రజలను వాడుకుంటున్నారన్నారు. ఏ ఒక్క సామాజిక వర్గానికి కూడా న్యాయం చేయకపోవడంతో చంద్రబాబు తీరుతో ప్రజలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. కర్నూలు జిల్లాకు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, రైతును మోసం చేసేందుకు గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పిన బాబు ఆ పనీ చేయలేదని విమర్శించారు. చంద్రబాబులాగా తన వద్ద డబ్బు, అధికారం, దుర్బుద్ధి, పోలీసులు లేరని, నాకున్న ఆస్తి నాన్నగారు ఇచ్చిన పెద్ద కుటుంబమేనన్నారు. ఒక్క అవకాశం ఇస్తే నాన్న మాదిరిగా అందరి గుండెల్లో ముద్ర వేసుకుంటానని చెప్పారు. బిల్డింగ్‌లు కూల్చేయడం, రోడ్లు తవ్వడం అభివృద్ధి కాదు.. రైతుల, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే నిజమైన అభివృద్ధి అని జగన్ ఉద్ఘాటించారు. నంద్యాల ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటానని ఆయన హామీనిచ్చారు. ఈ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఓ పట్టాన వదలని సిగరెట్టు

స్మోకర్ల మానుకోలేని అలవాటు

ముంబై : తాగితే తప్పని, ఆనక ప్రాణాలకు ముప్పని తెలుసు, కానీ తాగకుండా ఉండలేనంటోంది మనసు...ఇదీ దేశంలోని ధూమపాన ప్రియుల పరిస్థితి. సిగరెట్టు, బీడీ, ఇతరత్రా ఎలాంటి పొగాకు ఉత్పత్తులు అయినా ఒకసారి అలవాటు అయితే అంత తేలిగ్గా వాటిని విసిరికొట్టి, ఆ వ్యసనం మార్చుకోలేని స్థితిలో వీరు ఉన్నారు. పొగతాగువారికి ఈ సెగ పొమ్మనలేక పొగపెడుతోంది. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ప్రాణం మీదికి వస్తోందని తెలిసినా ఈ అలవాటును అత్యధికులు వదులకోలేని స్థితిలో ఉన్నట్లు ఓ అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని ఐదు ప్రధాన నగరాలలో ఈ మానలేని అలవాటు గురించి సర్వే నిర్వహించారు. పొగతాగువారిలో అత్యధికులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. నాన్‌స్మోకర్లతో పోలిస్తే వీరిలో 178 శాతం ఈ తీవ్రత ఉంటోంది. 'మీ జీవితాన్ని మీరే ఎంచుకోండి' అనే శీర్షికన ఈ సర్వే జరిపారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, లక్నో, బెంగళూరు వంటి పలు నగరాలలో అధ్యయనం సాగింది. ప్రత్యేకించి సిగరెట్లు తాగే వారు అలవాటును మానుకునే ప్రయత్నాలు చేస్తున్నారా? వారి వైఖరి ఏమిటి? అనే అంశంపై ఈ సర్వేక్షణ సాగింది. పది మంది స్మోకర్లలో తొమ్మండుగురు అలవాటును మానుకోవాలని యత్నించినా దానిని మానుకోలేకపోయినట్లు, అనారోగ్యం పొంచి ఉం టుందని తెలిసినా సిగరెట్టు పీక నులిమివేయాలనే ఆలోచనకు రానట్లు తెలిసింది.

పోలవరంపై చంద్రబాబుకు కెవిపి సవాల్

● నిందలు మాని నిజాలను నిగ్గు తేల్చాలి

● ఎపి సిఎంకు కాంగ్రెస్ ఎంపి లేఖ



మన తెలంగాణ/న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్ట్‌కు తాను అడ్డుపడుతున్నానన్న విషయాన్ని నిరూపిస్తే... రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి, శాశ్వతంగా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటానని కాంగ్రెస్ ఎంపి కెవిపి రామచంద్ర రావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి సవాల్ విసిరారు. నైతిక స్థైర్యం ఉంటే తన సవాలకు చంద్రబాబు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఢిల్లీలోని ఆయన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టును తాను అడ్డుకుంటున్నట్లుగా పదేపదే అధికార పార్టీ నాయకులు నిందారోపణలు చేస్తున్నారని అందుకు వంతపాడుతున్న సిఎంతో సహా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని కోరుతూ కెవిపి మూడవసారి తొమ్మిది పేజీల సుదీర్ఘ లేఖను సంధించారు. పోలవరానికి అనుమతులు సాధించే విషయంలో ఆంధ్రుల చిరకాల స్వప్నా న్ని సాకారం చేయడంలో తాను చేసిన ప్రయత్నాలను ఆయన లేఖలో వివరించారు. పోలవరం విషయంలో చంద్రబాబు తన చిత్తశుద్ధిపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు.రైతులను మరిచిన చం ద్రబాబు పోలవరాన్ని తుంగలో తొక్కారం టూ విమర్శించారు.ఎపికి రావలసిన ఎన్నో ప్రయోజనాలను పణంగా పెట్టి పోలవరం నిర్మా ణ బాధ్యతలు చేజిక్కించుకున్నారా?లేదా? సమాధానం చెప్పాలని నిలదీశారు. పోలవరం నిర్మాణ బాధ్యతల వల్ల రాష్ట్రానికి అధిక ఆర్థిక భారం పడుతుందన్నది వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. 1981లో పోలవర నిర్మాణం శంకుస్థాపన అనంతరం జరిగిన వాస్తవాలను ఆయన లేఖలో ప్రస్తావించారు. పోలవరానికి తాను అడ్డుపడుతున్నానని అధికార పార్టీ భజన బృందం చేస్తున్న ఆరోపణలను నిరూపించాలన్నారు. పో లవరం విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తే.. లోపాయికారిగా చంద్రబాబు కేంద్రంతో చేసుకున్న చీకటి ఒప్పందాలు, లాలూచీలు బయటపడతాయనే భయంతోనే తనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో నిజానిజాలు నిగ్గు తేల్చడానికి ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని, అందుకు తాను సిద్ధంగా ఉన్నానని సవాలు విసిరారు. ఈనెల 18న పార్లమెంటు స్థా యి సంఘం సభ్యులు పోలవరం ప్రాజెక్టు నిర్మా ణ పనులను పరిశీలించేందుకు వస్తున్న సందర్భాన్ని సీఎం, అధికార పార్టీ నేతలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రాజెక్టు ప్రాధాన్యతను,అయ్యే ఖర్చును సభ్యులకు వివరించి నిర్మాణ వ్యయం మొత్తాన్ని కేంద్రమే భరించేలా వారికి వివరించాలని కెవిపి సూచించారు. అదేవిధంగా ఎలాంటి ఆర్థిక భారాలు లేని విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు వంటి అంశాల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా పార్టీ ఎంపిలను చంద్రబాబు నిర్దేశించాలన్నారు.

మోడీ విజన్‌కు ప్రచారం కీలకం

● రాష్ట్రాలకు కేంద్రం పంద్రాగస్టు సర్క్యులర్

న్యూఢిల్లీ : భారత స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచనలతో కూడిన లేఖలు పంపించింది. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలలో పంద్రాగస్టు వేడుకల సందర్భంగా దేశభక్తిని ఇనుమడింపచేసే కార్యక్రమాలను రూపొందించాలి. ప్రధాని మోడీ సంకల్పించిన నవ భారతం ఆలోచనా విధానం పట్ల సామూహిక సానూకూలతను కల్పించే విధంగా విశేష కార్యక్రమాలను చేపట్టాలి. ప్రధాని మోడీ దృక్పథం వాస్తవ రూపం దాల్చేందుకు సహకరించే విధంగా చేయాలని ఈ లేఖలను సంధించారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ తరఫున అన్ని రాష్ట్రాలకు ఈ లేఖలు పంపించారు. కేంద్రం నుంచి తొలిసారిగా తగు సమాచారంతో కూడిన సర్క్యులర్ అందడం కీలకంగా మారింది. రాష్ట్రాలలో జరిగే ఉత్సవాలపై కేంద్రం జోక్యం ఏమిటని పేర్కొంటూ ఈ లేఖలను పట్టించుకోవదని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తగు ఆదేశాలు వెలువరించింది. బెంగాల్ వైఖరిపై కేంద్ర హెచ్ఆర్‌డి మంత్రి ప్రకాశ్ జవదేకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది దురదృష్టకరం అన్నారు. వేడుకలలో భాగంగా దేశభక్తి, దేశాభివృద్ధిపై ప్రధాని మోడీ ఆలోచనా విధానాలను ప్రతిఫలించే విధంగా కార్యక్రమాలు ఉండాలని ఆదేశించినట్లు జవదేకర్ తెలిపారు. ప్రధాని పేర్కొన్న సంకల్ప శుద్ధి ప్రమాణం చేయించడం, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం, ఉగ్రవాదుల దాడులు, యుద్ధాలలో అమరులైన వారిని తల్చుకోవడం అనేది లౌకిక అజెండాలో భాగమే అని, ఇది విధిగా స్కూళ్లలో పాటించాల్సి ఉందని ఏమీ తెలియచేయలేదని, అయితే లౌకికతకు పట్టం కట్టాల్సి ఉందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనాలి, దేశభక్తి భావన , ప్రధాని పథకాల పట్ల మమేక భావం నెలకొనేందుకు యత్నించడం మంచిదని , ఇది అభిలషణీయం అని తేల్చిచెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వేళ నవ భారతదేశం ఆలోచనపై స్ఫూర్తి కలిగించాల్సి ఉందని, ఈ భావనను రగిలించాల్సి ఉందని తెలిపారు.

టైటిల్ పోరుకు ఫెదరర్



మాంట్రియల్: స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ప్రతిష్ఠాత్మకమైన రోజర్స్ కప్ మాంట్రియల్ మాస్టర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీ ఫైనల్లో రెండో సీడ్ ఫెదరర్ 6–3, 7–6 తేడాతో నెదర్లాండ్స్ ఆటగాడు రాబిన్ హాసెను ఓడించాడు. తొలి సెట్‌లో సునాయాసంగా గెలిచిన స్విస్ స్టార్‌కు రెండో సెట్‌లో మాత్రం ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైంది. అయినా పట్టు వదలకుండా ఆడిన ఫెదరర్ సెట్‌ను గెలిచి టైటిల్ పోరుకు చేరుకున్నాడు. మరో సెమీఫైనల్లో జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ విజయం సాధించాడు. సెమీస్‌లో నాలుగో సీడ్ జ్వెరెవ్ 6–4, 7–5 తేడాతో కెనడా సంచలనం డెనిస్ షపొవాల్వొను చిత్తు చేశాడు. టాప్ సీడ్ నాదల్‌ను మట్టి కరిపించి జోరు మీదున్న డెనిస్ విజయపరంపరకు జ్వెరెవ్ సెమీస్‌లో బ్రేక్ వేశాడు. రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైనా చివరి వరకు కుదురుగా ఆడిన జ్వెరెవ్ విజయం సాధించాడు. కాగా, యూఎస్ ఓపెన్‌కు సన్నాహకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో నెగ్గి ఆత్మవిశ్వాసం సంతరించుకోవాలనే పట్టుదలతో జ్వెరెవ్ ఉన్నాడు.

అందరూ ఊహించినట్టే పరుగు మొదలైంది. సహచరుడి నుంచి బోల్ట్ బ్యాటన్ అందుకున్నాడు. దీంతో మైదానం మొత్తం బోల్ట్ నామస్మరణతో మారు మోగి పోయింది. మైదానంలోని అభిమానులు కేకలు వేస్తూ బోల్ట్‌ను ప్రోత్సాహిస్తున్నారు. బోల్ట్ విజయానికి సమీపంలోకి వచ్చేశాడు. మరి కొన్ని క్షణాలు గడిస్తే అతను స్వర్ణాన్ని సొంతం చేసుకోవడం ఖాయం. కానీ, అప్పడే అనుకోని సంఘటన నెలకొంది. ఉన్నట్టుండి బోల్ట్ పరుగులో వేగం సన్నగిల్లింది. ఏం జరుగుతుందో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. వారు తేరుకునే లోగానే బోల్ట్ మైదానంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. అంతే..అప్పటి వరకూ ఉత్సాహంతో ఉరకలేసిన అభిమానుల ఆశలు నీరుగారి పోయాయి. ఈ దృశ్యాన్ని అభిమానులు నమ్మలేక పోయారు. తన చివరి పరుగును విజయవంతంగా ముగుస్తాడని భావించిన తమ ఆరాధ్య ఆటగాడు ఇలా గాయంతో మధ్యలోనే మైదానాన్ని వీడాల్సి రావడాన్ని వారు జీర్ణించుకోలేక పోయారు. చివరి పరుగులో జమైకా చిరుత గాయం వల్ల అర్ధాంతరంగా మైదానాన్ని వీడాల్సి రావడంతో వేలాది మంది కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ షాక్ నుంచి కోలుకోవడానికి అభిమానులకు చాలా సమయమే పట్టింది.





ముగిసిన బోల్ట్ ప్రస్థానం

- చివరి రేసులో గాయం
- అర్ధాంతరంగా ఆగిన పరుగు
- కన్నీళ్లు పెట్టుకున్న అభిమానులు


లండన్ : ప్రపంచ దిగ్గజ అథ్లెట్, జమైకా చిరుత ఉసెన్ బోల్ట్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. కోట్లాది మంది అభిమానుల మనసులను గెలచిన ఈ విఖ్యాత అథ్లెట్ తన కెరీర్‌లో ఆఖరి పోరును గాయం వల్ల అర్ధాంతరంగా వీడాల్సి వచ్చింది. పురుషుల 4X100 మీటర్ల రిలేలో బరిలోకి దిగిన బోల్ట్ గాయం వల్ల మధ్యలోనే తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో తమ ఆరాధ్య ఆటగాడు స్వర్ణం సాధిస్తే చూడాలని మైదానానికి తరలివచ్చిన వేలాది మంది అభిమానులకు, టీవీల్లో వీక్షించిన కోట్లాది మంది ప్రేక్షకులకు నిరాశే మిగిలింది. పరుగు మధ్యలోనే జమైకా చిరుత కుప్పకూలాడు. దీంతో అతను పరుగు పూర్తి చేయకుండానే చక్రాల కుర్చీలో మైదానాని వీడాల్సి వచ్చింది. దీంతో బోల్ట్ అభిమానులు గుండెలు పగిలేలా విలపించారు. 4X100 రిలే ప్రారంభానికి ముందే అభిమానులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి చేరుకున్నారు. బోల్ట్ పాల్గొనే చివరి రేసును ప్రత్యక్షంగా తిలకించాలనే ఉత్సాహంతో వీరు నిర్ణీత సమయానికి ముందే మైదానంలో బారులు తీరారు. మరోవైపు కోట్లాది మంది అభిమానులు టీవీల ముందు వాలిపోయారు. తాము ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్న క్షణాలు దగ్గర పడడంతో వారిలో ఉత్సుకత మరింత పెరిగింది. తమ అభిమాన ఆటగాడు వాయు వేగంతో దూసుకెళ్లి ఫినిషింగ్ లైన్‌ను ముద్దాడడంతో అభిమానుల ఆనందానికి అవదుల్లేకుండా పోయింది. ఇక, తమ ఆరాధ్య ఆటగాడు స్వర్ణంతో తిరిగి రావడం ఖాయమనే నిర్ణయానికి సగటు అభిమాని ఇక్కడికి వచ్చేశాడు. అయితే చివరి పరుగులో జమైకా చిరుత గాయం వల్ల అర్ధాంతరంగా మైదానాన్ని వీడాల్సి రావడంతో వేలాది మంది కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ షాక్ నుంచి కోలుకోవడానికి అభిమానులకు చాలా సమయమే పట్టింది.

భుజాలపై చేతులు వేసుకుని..

మరోవైపు బోల్ట్ గాయపడడంతో అతన్ని వీల్‌చైర్‌పై కూర్చోబెట్టి పరుగును పూర్తి చేయించాలని బోల్ట్ ఫిజియో భావించాడు. అయితే బోల్ట్ సహచరులు మాత్రం ఎవరూ ఊహించని రీతిలో స్పందించారు. పరుగుల వీరుడికి తమదైన రీతిలో వీడ్కోలు పలికారు. బోల్ట్ సహచరులు మెక్‌లాడ్, జులియన్, బ్లేక్, రోజ్‌లు బోల్ట్ చేతులను తమ భుజాలపై వేసుకుని అతని పరుగును పూర్తి చేయించారు. దీంతో ఈ మైదానంలో ఈ సన్నివేశాలను చూసిన అభిమానులు భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. దిగ్గజ అథ్లెట్ చివరి పరుగు ఇలా వూహాలకు అందని రీతిలో ముగించాల్సి రావడం వారిని ఎంతో కలచి వేసింది. కాగా, సహచరుల సహాయంతో పైకి లేచిన బోల్ట్ ఫినిషింగ్‌లైన్‌ను తాకి పోటీని ముగించాడు. ఇది ప్రత్యక్షంగా చూసిన వేలాది మంది అభిమానుల హృదయం చలించిపోయింది. పరుగు ముగించిన తర్వాత బోల్ట్ తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. కళ్ల నిండా నీళ్లతో బోల్ట్ అభిమానులకు వీడ్కోలు పలికాడు. ఈ దృశ్యం అందరిని కదిలించింది. తమ ఆరాధ్య అథ్లెట్ కెరీర్ ఇలా అనూహ్య పరిణామల మధ్య ముగియడం అందరిని ఆవేదనకు గురి చేసింది. అనంతరం బోల్ట్ వీల్‌చైర్‌పై మైదానాన్ని వీడాడు.

తొలి సారి..

2008లో అంతర్జాతీయ కెరీర్‌కు శ్రీకారం చుట్టిన బోల్ట్ కేవలం నాలుగు సార్లు మాత్రమే ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఒలింపిక్స్ పోటీల్లో స్వర్ణం సాధించలేక పోయాడు. 2011 ప్రపంచ ఛాంపియన్‌షిప్ 100 మీటర్ల పరుగును మినహాయిస్తే ఏ పోటీల్లోనూ స్వర్ణం కోల్పోలేదు. తన కెరీర్ ప్రారంభం నుంచి పాల్గొన్న ప్రతి ప్రపంచ స్థాయి పోటీల్లో బోల్ట్ స్వర్ణ పతకాలు గెలుస్తూనే ఉన్నాడు. అయితే ఈసారి మాత్రం 100 మీటర్ల పరుగులో కాంస్యంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఇది సగటు అభిమానిని నిరాశకు గురి చేసింది. తాజాగా తన కెరీర్‌లో చివరి సారిగా పాల్గొన్న 4X100 రిలేలో కూడా బోల్ట్‌కు నిరాశే మిగిలింది. ఈసారి గాయం వల్ల అర్ధాంతరంగానే తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో ఈ విభాగంలో జమైకా కనీసం కాంస్య పతకం కూడా గెలవలేక పోయింది.




హార్డిల్స్‌లో మెక్‌లాడ్‌కు స్వర్ణం

బోల్ట్ నిరాశ పరిచినా మరో అథ్లెట్ ఒమర్ మెక్‌లాడ్ జమైకాకు ఆనందాన్ని పంచాడు. 110 మీటర్ల హార్డిల్స్‌లో మెక్‌లాడ్ స్వర్ణం సాధించాడు. అసాధారణ ఆటను కనబరిచిన మెక్‌లాడ్ 13.04 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఈ ఛాంపియన్‌షిప్‌లో జమైకాకు తొలి పసిడి పతకం అందించాడు. ఈ పోటీల్లో జమైకాకు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. ప్రారంభం నుంచే దూకుడును ప్రదర్శించిన ఒమర్ మెక్‌లాడ్ ప్రత్యర్థులను వెనక్కినెట్టి స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. రష్యా అథ్లెట్ సెర్జీ షుబెంకోవ్ 13.14 సెకన్లలో గమ్యాన్ని చేరి రజతం గెలుచుకున్నాడు. హంగేరి అథ్లెట్ బలాజస్ బాజి కాంస్య పతకం సాధించాడు. కాగా, ఈ పోటీల్లో బోల్ట్‌తో సహా మహిళా స్ప్రింటర్ ఎలైన్ థాంప్సన్ జమైకాకు నిరాశే మిగిల్చింది. అయితే ఒలింపిక్ ఛాంపియన్ మెక్‌లాడ్ స్వర్ణం గెలిచి జమైకాకు కాస్తయిన ఆనందాన్ని పంచాడు.

రెండో రోజే

మన చేతిలోకి..

- హార్ధిక్ మెరుపు శతకం
- చెలరేగిన కుల్దీప్.. కుప్పకూలిన శ్రీలంక
- పట్టు బిగించిన టీమిండియా







పల్లెకెలె: శ్రీలంకతో జరుగుతున్న మూడో టెస్టులో భారత్ పట్టు బిగించింది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసేందుకు మార్గం సుగమం చేసుకుంది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. హార్ధిక్ పాండ్య (108) అద్భుత సెంచరీతో భారత్‌ను ఆదుకున్నాడు. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన శ్రీలంక భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేక 135 పరుగులకే కుప్పకూలింది. కుల్దీప్ యాదవ్ నాలుగు, మహ్మద్ షమి, రవిచంద్రన్ అశ్విన్ రెండేసి వికెట్లు పడగొట్టి శ్రీలంక ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే కుప్పకూల్చారు. తర్వాత ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే శ్రీలంక మరో 333 పరుగులు చేయాలి.

హార్ధిక్ పాండ్య విధ్వంసం..

అంతకుముందు 329/6 ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం రెండో రోజు బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. వృద్ధిమాన్ సాహా 17 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పెవిలియన్ చేరాడు. అయితే తర్వాత వచ్చిన కుల్దీప్ యాదవ్‌తో కలిసి పాండ్య జోరును కొనసాగించాడు. ప్రారంభంలో కుదురుగా ఆడాడు. తర్వాత జోరును పెంచాడు. కుల్దీప్ కూడా అతనికి సహకారం అందించాడు. ఈ క్రమంలో పాండ్య 61 బంతుల్లో అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. తర్వాత అతని జోరుకు అడ్డే లేకుండా పోయింది. లంక బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ పరుగుల వరద పారించాడు. వరుస ఫోర్లు, సిక్సర్లతో హోరెత్తించాడు. అతడిని ఎలా ఆపాలో లంక బౌలర్లకు అంతు బట్టకుండా పోయింది. అర్ధ సెంచరీ నుంచి శతకానికి చేరుకునే క్రమంలో పాండ్యకు కేవలం 25 బంతులు మాత్రమే అవసరమయ్యాయి. దీన్ని బట్టి అతని విధ్వంసం ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన పాండ్య 86 బంతుల్లోనే ఏడు భారీ సిక్సర్లు, మరో ఏడు బౌండరీలతో టెస్టుల్లో తన తొలి సెంచరీని పూర్తి చేశాడు. ఈ క్రమంలో పుష్పకుమార వేసిన ఇన్నింగ్స్ 116 ఓవర్‌లో పాండ్య ఏకంగా 26 పరుగులు పిండుకున్నాడు. తొలి రెండు బంతులను ఫోర్లుగా మలచిన పాండ్య తర్వాత వరుసగా మూడు సిక్సర్లు కొట్టాడు. ఈ సందర్భంగా గతంలో కపిల్‌దేవ్ పేరిట ఉన్న 24 పరుగుల రికార్డును బద్దలు కొట్టాడు. ప్రస్తుతం వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా మాత్రమే ఒకే ఓవర్‌లో అత్యధికంగా 28 పరుగులు పాండ్య కంటే ముందున్నాడు. కాగా, చివరికి 96 బంతుల్లో 8ఫోర్లు, ఏడు సిక్సర్లతో 108 పరుగులు చేసి ఆఖరి బ్యాట్స్‌మన్‌గా ఔటయ్యాడు. దీంతో 487 పరుగుల వద్ద భారత తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. శ్రీలంక బౌలర్లలో సందకాన్ ఐదు, పుష్పకుమార మూడు వికెట్లు పడగొట్టారు. విశ్వ ఫెర్నాండోకు రెండు వికెట్లు లభించాయి.

షమి తొలి దెబ్బ..

తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన శ్రీలంకకు భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమి ప్రారంభంలోనే దెబ్బ తీశాడు. ఫాం కోసం తంటాలు పడుతున్న సీనియర్ ఆటగాడు ఉపుల్ తరంగ ఈసారి కూడా విఫలమయ్యాడు. కేవలం ఐదు పరుగులు మాత్రమే చేసి షమి బౌలింగ్‌లో వికెట్ కీపర్ సాహాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ వెంటనే కరుణరత్నె (4) కూడా వెనుదిరిగాడు. ఈ వికెట్ కూడా షమి ఖాతాలోకే వెళ్లింది. దీంతో లంక 23 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. కొద్ది సేపటికే కుశాల్ మెండిస్ (18) కూడా రనౌటయ్యాడు. మాజీ కెప్టెన్ మాథ్యూస్ కూడా ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు.

కుల్దీప్ మ్యాజిక్..

ఈ దశలో కెప్టెన్ దినేశ్ చండీమల్, వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లా కొద్ది సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. డిక్వెల్లా తన మార్క్ షాట్లతో అలరించాడు. అంతేగాక వీరిద్దరూఐదో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా నెలకొల్పారు. అయితే 4 ఫోర్లతో 29 పరుగులు చేసి జోరుమీద కనిపించిన డిక్వెల్లాను కుల్దీప్ యాదవ్ పెవిలియన్ పంపించాడు. దీంతో లంక కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. తర్వాత వచ్చిన దిల్రువన్ పెరీరా (0) ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. ఈ రెండు వికెట్లు కూడా కుల్దీప్ ఖాతాలోకే వెళ్లాయి. కొద్ది సేపటికే చండీమల్ (48; 87 బంతుల్లో 6X4) కూడా వెనుదిరిగాడు. అశ్విన్ అద్భుత బంతితో చండీమల్‌ను వెనక్కి పంపాడు. ఆ వెంటనే పుష్పకుమార (10)ను కూడా కుల్దీప్ ఔట్ చేశాడు. సందకాన్ (10) అశ్విన్ బౌలింగ్‌లో ఔట్‌కాగా, ఫెర్నాండోను (0)ను కుల్దీప్ ఔట్ చేశాడు.

స్కోరు బోర్డు:

భారత్ మొదటి ఇన్నింగ్స్: శిఖర్ ధావన్ (సి) చండీమల్ (బి) పుష్పకుమార 119, లోకేష్ రాహుల్ (సి) కరుణరత్నె (బి) పుష్పకుమార 85, చటేశ్వర్ పుజారా (సి) మాథ్యూస్ (బి) సందాన్ 8, విరాట్ కోహ్లి (సి) [illegible] అశ్విన్ (సి) డిక్వెల్లా (బి) విశ్వ ఫెర్నాండో 31, వృద్ధిమాన్ సాహా (సి) పెరీరా (బి) విశ్వ ఫెర్నాండో 16, హార్ధిక్ పాండ్య (సి) పెరీరా (బి) సందకాన్ 108, కుల్దీప్ యాదవ్ (సి) డిక్వెల్లా (బి) సందకాన్ 26, మహ్మద్ షమి (సి) అండ్ (బి) సందకాన్ 8, ఉమేశ్ యాదవ్ నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు 24, మొత్తం 122.3 ఓవర్లలో 487 ఆలౌట్.

బౌలింగ్: విశ్వ ఫెర్నాండో 26–3–87–2, లహిరు కుమార 23–1–104–0, దిముత్ కరుణరత్నె 7–0–30–0, దిల్రువన్ పెరీరా 8–1–36–0, లక్షణ్ సందకాన్ 35.3–4–132–5, మలింద పుష్పకుమార 23–2–82–3.

శ్రీలంక మొదటి ఇన్నింగ్స్: దిముత్ కరుణరత్నె (సి) సాహా (బి) మహ్మద్ షమి 4, ఉపుల్ తరంగ (సి) సాహా (బి) షమి 5, కుశాల్ మెండిస్ (రనౌట్) 18, దినేశ్ చండీమల్ (సి) రాహుల్ (బి) రవిచంద్రన్ అశ్విన్ 48, ఎంజెలో మాథ్యూస్ ఎల్బీ–బి హార్ధిక్ పాండ్య 0, డిక్వెల్లా (స్టంప్డ్) సాహా (బి) కుల్దీప్ యాదవ్ 29, దిల్రువన్ పెరీరా (సి) పాండ్య (బి) కుల్దీప్ యాదవ్ 0, మలింద పుష్పకుమార (బి) కుల్దీప్ యాదవ్ 10, లక్షణ్ సందకాన్ (సి) ధావన్ (బి) అశ్విన్ 10, విశ్వ ఫెర్నాండో (బి) కుల్దీప్ యాదవ్ 0, లహిరు కుమార నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 11, మొత్తం 37.4 ఓవర్లలో 135 ఆలౌట్.

బౌలింగ్: మహ్మద్ షమి 6.5–1–17–2, ఉమేశ్ యాదవ్ 3.1–0–23–0, హార్ధిక్ పాండ్య 6–1–28–1, కుల్దీప్ యాదవ్ 13–2–40–4, రవిచంద్రన్ అశ్విన్ 8.4–2–22–2.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్: దిముత్ కరుణరత్నె (బ్యాటింగ్) 12, ఉపుల్ తరంగ (బి) ఉమేశ్ యాదవ్ 7, మలింద పుష్పకుమార (బ్యాటింగ్) 0, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం 13 ఓవర్లలో 19/1.

బౌలింగ్ : మహ్మద్ షమి 4–2–7–0, రవిచంద్రన్ అశ్విన్ 6–4–5–0, ఉమేశ్ యాదవ్ 2–0–3–1, కుల్దీప్ యాదవ్ 1–0–4–0.

భారత్‌కు మరో కపిల్ దొరికాడు



ముంబయి: హార్ధిక్ పాండ్య రూపంలో భారత్‌కు మరో కపిల్‌దేవ్ దొరికాడని భారత చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. శ్రీలంకతో జరుగుతున్న మూడో టెస్టులో మెరుపు శతకం సాధించిన పాండ్యపై ప్రసాద్ ప్రశంసల వర్షం కురిపించాడు. పాండ్య ఆట కపిల్‌ను తలపిస్తుందన్నాడు. అతను కపిల్‌లాగే భారీ షాట్లతో ఆకట్టుకుంటున్నాడని ప్రశంసించాడు. ఒత్తిడిని దరి చేరనియకుండా ఆడడంలో పాండ్య మంచి పరిణితి సాధించాడన్నాడు. లంక సిరీస్‌లో అతని బ్యాటింగ్ తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. ఇర్ఫాన్ పఠాన్ తర్వాత ఆ స్థాయిలో ఆడుతున్న ఫాస్ట్ బౌలర్ ఆల్‌రౌండర్ హార్ధిక్ మాత్రమేనని ప్రసాద్ అన్నాడు. రానున్న రోజుల్లో హార్ధిక్ భారత్‌కు కీలక ఆటగాడిగా మారడం తథ్యమని జోస్యం చెప్పాడు. కాగా, శ్రీలంక సిరీస్‌లో భారత ఆట చాలా బాగుందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్‌కు ఎదురు లేకుండా పోయిందన్నాడు. భవిష్యత్తులో టీమిండియా మరింత బలంగా మారడం ఖాయమన్నాడు. ప్రస్తుతం జట్టులో చోటు కోసం ఆటగాళ్ల మధ్య ఆరోగ్యకర పోటీ నెలకొందన్నాడు. ఇది జట్టుకు శుభసూచకమని ప్రసాద్ అభిప్రాయపడ్డాడు.

యువరాజ్ ఔట్

- మనీష్‌కు పిలుపు
- సీనియర్లకు విశ్రాంతి
- లంకతో సిరీస్‌కు వన్డే జట్టు ఎంపిక

ముంబయి: శ్రీలంకతో జరిగే వన్డే, ట్వంటీ–20 సిరీస్ కోసం టీమిండియాను ఆదివారం ఎంపిక చేశారు. భారత్ ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో శ్రీలంకతో తలపడనుంది. అంతేగాక, ఒక ట్వంటీ–20 మ్యాచ్ కూడా భారత్ ఆడనుంది. ఈ సిరీస్ కోసం భారత క్రికెట్ బోర్డు ఆదివారం జట్టును ఎంపిక చేసింది. సీనియర్ ఆటగాడు యువరాజ్ సింగ్‌కు జట్టులో నుంచి ఉద్వాసన పలికారు. ఛాంపియన్స్ ట్రోఫీలో పేలవమైన ప్రదర్శన కనబరచడంతో అతన్ని జట్టులోకి తీసుకోలేదు. అదే విధంగా మరో సీనియర్ సురేశ్ రైనాకు కూడా జట్టులో చోటు దక్కలేదు. వెస్టిండీస్ సిరీస్‌లో ఆడిన దినేశ్ కార్తీక్‌ను కూడా జట్టులో నుంచి తొలగించారు. మరోవైపు స్టార్ క్రికెటర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమిలకు వన్డే సిరీస్‌లో విశ్రాంతి కల్పించారు. వీరికి ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. అయితే సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి మాత్రం జట్టులో చోటు ఇచ్చారు. రోహిత్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా సిరీస్‌లో ఆడనున్నాడు. తొలుత అతనికి కూడా విశ్రాంతి ఇవ్వాలని బిసిసిఐ భావించింది. అయితే కోహ్లి మాత్రం సిరీస్‌లో ఆడేందుకే ఇష్టపడ్డాడు. దీంతో అతన్ని ఎంపిక చేశారు. ఇక, టెస్టు సిరీస్‌లో రాణించిన కెఎల్.రాహుల్, కుల్దీప్ యాదవ్‌లకు జట్టులో స్థానం దక్కింది. వీరితో పాటు యువ ఆటగాళ్లు శర్దుల్ ఠాకూర్, చాహల్, అక్షర్ పటేల్‌లు కూడా వన్డే జట్టులో స్థానం పొందారు. కేదార్ జాదవ్ కూడా జట్టులో స్థానం నిలబెట్టుకున్నాడు. ఇక, బౌలింగ్ భారాన్ని జస్ప్రిత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్‌లు మోయనున్నారు. కాగా, యువరాజ్ సింగ్‌కు మరో ఛాన్స్ ఇస్తారని భావించినా సెలెక్టర్లు అతనికి మొండి చెయ్యి చూపించారు. అతనికి బదులు మనీష్ పాండేను ఆడించేందుకు సెలెక్టర్లు మొగ్గు చూపారు. రైనాపై కూడా సెలెక్టర్లు ఆసక్తి చూపలేదు. దినేష్ కార్తీక్‌ను కూడా పక్కన బెట్టారు. ఊహించినట్టే సీనియర్లు జడేజా, అశ్విన్, సమి, ఉమేశ్‌లకు విశ్రాంతి ఇచ్చారు. వీరి స్థానంలో ఠాకూర్, చాహల్, అక్షర్ పటేలకు చోటు కల్పించారు.





Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.